thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal
సంపుటి - 19 సంచిక - 362
కరీంనగర్ ఆదివారం, 9 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### భారత సరిహద్దుల్లో బంగ్లాదేశ్ డ్రోన్స్...

భారత్, బంగ్లాదేశ్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు క్రమంగా పెరుగుతున్నాయి. అందుకు బంగ్లాదేశ్ ఆర్మీ పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బైరక్టార్ TB-2 కిల్లర్ డ్రోన్‌ను మోహరించడమేనని చెప్పవచ్చు. బంగ్లాదేశ్ ఆర్మీ మోహరింపుతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెరిగింది. ఈ ప్రాంతం భారతదేశంలో చాలా సున్నితమైనదిగా పరిగణించబడుతుంది. టర్కియే TB-2 డ్రోన్ చాలా శక్తివంతమైనది. ఇది దాడి చేయడమే కాకుండా, గూఢచర్యం చేయడంలో కూడా సహాయపడుతుంది. దీంతో ఇరు దేశాల మధ్య పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈ డ్రోన్‌లను బంగ్లాదేశ్‌లో 67వ సైన్యం నిఘా కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారని చెబుతున్నారు. బంగ్లాదేశ్ రక్షణ అవసరాల కోసం మోహరింపు అని చెప్పినప్పటికీ, ఆధునాతన డ్రోన్‌లను సున్నితమైన ప్రాంతంలో ఉంచడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

# రేపోమాపో తెలంగాణ బీజేపీకి కొత్త రథసారధి!?

## రేసులో ఉన్న నేతల్లో టెన్షన్.. టెన్షన్...!



హైదరాబాద్ : తెలంగాణ పాలిటిక్స్‌లో మూడు నెలలుగా ఒకటే చర్చ. అదే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎంపిక. ఎందరో ఆశావహులు. ఎన్నో ఈక్వేషన్స్. మరెన్నో క్యాలిక్యులేషన్స్ మధ్య నాలుగైదు నెలలుగా తెలంగాణ బీజేపీ ప్రెసిడెంట్ ఎంపిక..డైలీ ఎపిసోడ్‌గా కంటిన్యూ అవుతోంది. అయితే ఇప్పుడు అధ్యక్షుడి ఎంపిక ఆల్మోస్ట్ పూర్తి అయిందని అంటున్నారు కమలనాథులు. ఏ క్షణంలోనైనా జాతీయ నాయకత్వం నుంచి ప్రకటన రావచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాషాయ రథసారధి రేసులో ఉన్న నేతల్లో ఓ వైపు గుబులు..ఇంకోవైపు ధీమా కనిపిస్తోందట. పైకి మాత్రం తమకే అధ్యక్ష పదవి రాబోతుందని చెబుతున్నప్పటికీ..అధిష్ఠానం ఏ ఈక్వేషన్స్‌ను లెక్కలోకి తీసుకుంటుందోనన్న టెన్షన్ మాత్రం ఆశావహుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే అభిప్రాయ సేకరణ చేసిన ఇంచార్జ్ శోభా కర్లాందజేను..చాలా మంది నేతలు తనకే అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారట. ఏకాభిప్రాయం అటుంచితే ఎవరివారే తనకే పార్టీ పగ్గాలు ఇవ్వాలని కోరడంతో ఓవర్ టు ఢిల్లీ అయిపోయిందట సీన్. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సునీల్ బన్సల్ హైదరాబాద్‌కు రానుండటం ఆసక్తికరంగా మారింది. ఆయన తెలంగాణ పర్యటనలో ఉండగానే బీజేపీ అధిష్టానం అధ్యక్షుడి ఎంపికపై ప్రకటన చేసే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రేసులో ఎంపీలు ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్, రఘునందర్ రావుతో పాటు బీజేపీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, చింతల రాంచంద్రారెడ్డి పేర్లు వినిపిస్తూ వస్తున్నాయి. ఎమ్మెల్యేల నుంచి పాయల్ శంకర్ కూడా తాను రేసులో ఉన్నానని సన్నిహితులతో చెప్పుకుంటున్నారు.

**వీరి పేర్లు తెరపైకి...** ఇక అనూహ్యంగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మరో జాతీయ నేత మురళీధర్ రావు పేర్లు కూడా తెరపైకి వచ్చాయి. ఈటల రాజేందర్ అధ్యక్ష రేసులో ముందున్నారని ఆయన సన్నిహితులు ప్రచారం చేసుకుంటుండటం పార్టీలో అసంతృప్తులకు దారి తీస్తోందట. ఇక నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జాతీయ స్థాయిలో తనకున్న పరిచయాలతో అధ్యక్ష పదవి కోసం గట్టిగానే ప్రయత్నం చేస్తున్నారట. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైలెంట్‌గా అధ్యక్ష పదవి కోసం లాబీయింగ్ చేస్తున్నారట. ఇక పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి కాకుండా పాతవారికే అధ్యక్ష పదవి ఇవ్వాలన్న డిమాండ్‌తో రాంచందర్ రావు సీనియర్ల మద్దతు కూడగట్టినట్లు టాక్. ఎంపీల్లో ఎవరికి చాన్స్ ఇచ్చిన పార్టీ తమ కంట్రోల్ ఉండదని భావిస్తున్న ఒకరిద్దరు సీనియర్ నేతలు పాయల్ శంకర్ పేరును ప్రతిపాదించినట్టు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక దేశవ్యాప్తంగా మహిళలకు పెద్దపీట వేయాలన్న ఆలోచనలో జాతీయ నాయకత్వం ఉందట. అందులో భాగంగానే డీకే అరుణ పేరు తెరమీదకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక పార్టీ కోసం పనిచేసే వ్యక్తిగా ముద్రపడిన మురళీధర్ రావు కూడా ప్రయత్నాలు చేస్తున్నారట. బీజేపీ జాతీయ నాయతక్వం కూడా ఓ వైపు రాష్ట్ర నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తూనే మరోవైపు పొలిటికల్ సర్వేలు చేపిస్తోందట. ఈ నెల 15లోపే జాతీయ అధ్యక్షుడిని ఎన్నిక పూర్తి చేయబోతున్నారట. అంతలోపే తెలంగాణ బీజేపీ అధ్యక్ష సెలక్షన్ ఉంటుందన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఏ క్షణంలోనైనా బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి ప్రకటన రావొచ్చన్న టాక్ బలంగా వినిపిస్తోంది. తెలంగాణ కాషాయ రథసారిధిగా ఎవరికి అవకాశం దక్కబోతుందో చూడాలి మరి.

## రూ.18,772 కోట్లతో.. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగంపై కీలక అప్డేట్



హైదరాబాద్ : తెలంగాణ అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 జాతీయ రహదారులను ఇప్పటికే పూర్తి చేశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి.. రూ.6,280 కోట్ల వ్యయంతో 285 కిలో మీటర్ల మేర కొత్తగా జాతీయ రహదారులను నిర్మించినట్టు స్పష్టం చేశారు. ఇప్పటికే పూర్తయిన రహదారులను త్వరలోనే ప్రారంభించనున్నట్టు ప్రకటించిన కిషన్ రెడ్డి.. ఈ ప్రారంభోత్సవానికి రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రానున్నట్టు తెలిపారు. మరోవైపు.. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్ రింగ్ రోడ్డు గురించి కూడా మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్టు తెలిపారు. ఫైనాన్స్‌కు సంబంధించి ట్రై పార్టీ అగ్రిమెంట్ జరగాల్సి ఉందని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి రూ.18,772 కోట్లు ఖర్చు అవుతోందని అంచనా వేసిన అధికారులు.. అందుకు సంబంధించిన అంచనా వ్యయాన్ని కూడా అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నోట్ కూడా ప్రిపేర్ అవుతున్నట్లుగా కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు.. ఆరాంఘర్ నుంచి శంషాబాద్‌కు ఆరు లేన్ల హైవే కూడా ఇప్పటికే పూర్తయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాళ్ల కోసం సిగ్నల్ ఫ్రీ రోడ్డు కూడా పూర్తయిందని చెప్పుకొచ్చారు. వీటితో పాటు.. బీహెచ్ఈఎస్ ఫ్లైఓవర్ కూడా తుదిదశకు చేరుకుందని.. వచ్చే నెలలో పూర్తవుతుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీహెచ్ఈఎల్ ఫ్లై ఓవర్ పూర్తయితే కూకట్‌పల్లి పటాన్‌చెరు మధ్య ట్రాఫిక్ కంట్రోల్ అవుతుందని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. మరోవైపు.. కేంద్రం, తెలంగాణల మధ్య పరిష్కారం కాని సమస్యలపై చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం (మార్చి 08న) ప్రజా భవన్‌లో అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించగా.. ఈ భేటీకి బీజేపీ ఎంపీలు హాజరుకాలేదు. ఇందుకు సంబంధించి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కిషన్ రెడ్డి లేఖ కూడా రాశారు. తమ పార్టీ ఎంపీలకు ఆహ్వానం ఆలస్యంగా అందిందని లేఖలో తెలిపారు. ఎంపీలకు నియోజకవర్గాల్లో ముందస్తు కార్యక్రమాలు ఉన్నాయని.. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల వల్ల సమావేశానికి రాలేకపోతున్నామని లేఖలో వెల్లడించారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాల కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. చిత్తశుద్ధి, అంకితభావంతో తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తూనే ఉంటుందని కిషన్ రెడ్డి మరోసారి ఉద్ఘాటించారు.




స్వయం సహాయక సంఘాల సభ్యుల ఏజ్ లిమిట్ పెంచుతున్నట్లు ప్రకటించారు. 15యేళ్ల నుంచి 65 యేళ్లలోపు మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు చేరాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ మహిళల అర్థికాభివృద్దే..రాష్ట్ర ఆర్థికాభివృద్ధి..ఇప్పటికే మహిళా సంఘాల్లో 65లక్షల మంది సభులున్నారు..కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తే వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ చాలా ఈజీ అన్నారు. మహిళల ఉన్నతికి రాష్ట్రప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్రంలో 65లక్షల మంది ఆడబిడ్డలు స్వయం సహాయక సంఘాల్లో ఉన్నారు. పాఠశాలల నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. స్కూల్ పిల్లల బట్టలు కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. మహిళలు ఇంట్లో కూర్చొని వేల రూపాయలు సంపాదించొచ్చన్నారు. ప్రతి జిల్లా కేంద్రానికి ఇందిరా మహిళశక్తి భవనాన్ని మంజూరు చేశామన్నారు. 1000మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా సోలార్ ప్లాంట్లను మహిళలకు అప్పగించామన్నారు. ఆర్టీసీలో బస్సులను మహిళలకు లీజుకు ఇచ్చామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. 600మంది బస్సులను మహిళా సంఘాలకు అప్పజెప్పాం.. రాబోయే రోజుల్లో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులకు మహిళలను యాజమానులను చేస్తామన్నారు.




# మీ అన్నగా మాట ఇస్తున్నా..

## మిమ్మల్ని కోటీశ్వరులను చేస్తా

## వచ్చే ఎన్నికల్లో.. మహిళలకు 33 శాతం సీట్లు!

## మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ (శనివారం) పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీకి వెళ్లిన సీఎం.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.550 కోట్లతో యూనివర్సిటీ నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో భారీఎత్తున నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సులను రేవంత్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత మహిళా సంఘాల స్టాల్స్‌ను మంత్రులతో కలిసి సందర్శించారు. అక్కడే మహిళా పెట్రోల్ బంకుల నమూనాను పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులతో వారి ఉత్పత్తుల గురించి ముచ్చటించారు. వారు తయారు చేసిన రాగి లడ్డూని రేవంత్ రుచి చూసి ప్రశంసించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. “వందేళ్ల చరిత్ర కలిగిన చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి రూ.550 కోట్ల నిధులు కేటాయించాం. అంతర్జాతీయ యూనివర్సిటీలతో విద్యార్థులు పోటీ పడాలి. మహిళా రిజర్వేషన్ కోసం సోనియా గాంధీ కృషి చేశారు. రాజకీయాల్లోకి మహిళలు కూడా రావాలి. అవకాశం వస్తే ఆడవారు ఏ రంగంలోనైనా రాణిస్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. గత పదేళ్లపాటు ఆడబిడ్డలకు గ్రహణం పట్టింది. వారి ఆశీర్వాదంతోనే గ్రహణం తొలగిపోయింది. ఇప్పుడు ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడ్డారు. కేసీఆర్ పాలన, కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను మహిళలు గమనిస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యం కావాలని మహిళలు కోరుకున్నారు. 65 లక్షల మంది ఆడవారు స్వయం సహాయక సంఘాల్లో ఉన్నారు. ప్రభుత్వ స్కూల్స్ నిర్వహణను స్వయం సహాయ సంఘాలకు అప్పగించాం. పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే బాధ్యతా వారికే అప్పగించాం. ఆడబిడ్డలు తలచుకుంటే వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధన కష్టం కాదు. మహిళా సంఘాలు కార్పొరేట్ కంపెనీలతో పోటీపడేలా చేస్తాం. ప్రతి జిల్లాలో ఇందిరా శక్తి భవనాలు నిర్మిస్తున్నాం. సోలార్ ఉత్పత్తిలో అదానీ, అంబానీలతో పోటీ పడేలా చేస్తాం. తెలంగాణ ఆర్టీసీలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులకు మహిళలు యజమానులు. మహిళలకు చట్టసభల్లోనూ రిజర్వేషన్లు ఉండాలని సోనియా కృషి చేశారు. మహిళలకు అండగా ఉన్నది ఇందిరమ్మ రాజ్యమే. ప్రతి మండలంలో రైస్ మిల్లులు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నాం. మహిళా సంఘాల వ్యాపారాల్లో పన్ను మినహాయింపులు ఇస్తాం. టన్నెల్ కూలితే, పంటలు ఎండితే బీఆర్ఎస్ నేతలు పైశాచికానందం పొందుతున్నారు. వారి పైశాచికానందం కోసం నన్ను తిడుతున్నారు. ప్రజలకు కష్టం వస్తే ఆదుకునే ప్రయత్నం చేయాలి. మంచి సూచనలు ఇవ్వాలి. అంతేకానీ దురుద్దేశంతో విమర్శలు చేస్తే సరికాదు. ఆడబిడ్డలు అన్నగా మాట ఇస్తున్నా. మిమ్మల్ని కోటీశ్వరుల్ని చేస్తా. కేసీఆర్ మొదటి టర్మ్‌లో అసలు మహిళా మంత్రే లేరు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు ఇచ్చి గెలిపించుకుంటామని” చెప్పారు.



# మహిళలు రాణించాలంటే చదువుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న రాజీవ్‌గాంధీ కలల్ని.. మహిళా వర్సిటీ విద్యార్థులు నిజం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రూ.550 కోట్ల విలువైన నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు సీఎం.. శంకుస్థాపనలు చేశారు. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సందర్భం వస్తుందని, అందులో మీ ప్రాతినిధ్యం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. మహిళలకు అవకాశం ఇస్తే తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ యూనివర్సిటీలో చదువుకోవడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని, మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్నానన్న సీఎం రేవంత్ రెడ్డి.. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి వారికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించామని వివరించారు. ఆడబిడ్డలు వంటింటి కుందేళ్లు కాదని.. వారు వ్యాపారవేత్తలుగా రాణిస్తారన్న భావనతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అదానీ, అంబానీలతో మహిళలు పోటీపడేలా కార్యాచరణ తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు విశ్వవిద్యాలయంలో దర్బార్ హాల్‌ను సీఎం సందర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.



# 18 లేదా 19న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. శాసనసభ, శాసన మండలి 12న ఉదయం 11 గంటలకు సమావేశం అవుతాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నోటిఫికేషన్ జారీ చేశారు. 12న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా, బీఏసీలో చర్చ అనంతరం సభా నిర్వహణ తేదీలను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయించనున్నారు. రెండు కీలక బిల్లులు ఈసారే..: బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజు 12వ తేదీన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. అనంతరం సభ వాయిదా పడనుంది. తర్వాత రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రవేశపెట్టనున్నారు. దీనిపై చర్చ జరిగిన అనంతరం తీర్మానాన్ని ఆమోదించనున్నారు. ఆ తర్వాత హోలీ, ఆదివారం సెలవులు ఉండటంతో సోమవారం మళ్లీ సభ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే రోజు ఎస్సీ వర్గీకరణ బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుపై చర్చ అనంతరం ఆమోదించి, బీసీల రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ముందుకు తేనున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందిన అనంతరం ఈ నెల 18 లేదా 19 తేదీల్లో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడతారని అసెంబ్లీ వర్గాలు వెల్లడించాయి. బడ్జెట్, శాఖలవారీ పద్దులపై చర్చ అనంతరం 27న ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఉగాది, రంజాన్ పర్వదినాల నేపథ్యంలో 27వ తేదీతో సమావేశాలు ముగిస్తారని అధికారులు చెబుతున్నారు.

# మహిళలు వాటిని ఉపయోగించుకోవాలి.. బస్సు ప్రయాణంలో మంత్రి కీలక వ్యాఖ్యలు



మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సు లో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇవాళ హైదరాబాద్ లోని ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌లో పర్యటించారు. అనంతరం అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బస్సులో ప్రయాణికులతో ముచ్చటిస్తూ.. బస్సు ప్రయాణంలో తలెత్తుతున్న ఇబ్బందులపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక తెలంగాణ ప్రభుత్వం పక్షాన మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాలు జరుగుతున్నాయని, మహిళలు అందరూ వాటిని ఉపయోగించుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం ఆర్టీసీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులలో అత్యంత ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించారు. తర్వాత ఎంజీబీఎస్ బస్ స్టేషన్ లో మహిళా ప్రయాణికులకు గులాభి పూలు, స్వీట్లు పంచి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు (%ఔశీఎవఅం ఖుఎ ఔఅంష్త్రవం%) తెలియజేశారు. అంతకముందు మంత్రి పొన్నం ప్రభాకర్ తన ఇంట్లో మహిళలను సత్కరించి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తన తల్లికి పాదాభివందనం చేసి, తల్లితో పాటు, తన సతీమణికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెబుతూ.. వీరత్వము, దీరత్వం, మాతృత్వం కలిగి భవిష్యత్ అనే అంశానికి మాతృమూర్తి కారణమైన సందర్భంలో మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అని అన్నారు.

# అమర రాజ బ్యాటరీస్ కు కేంద్రమంత్రి అంకురార్పణ



మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధికి శనివారం మరో ముందడుగు పడింది. రూ. 6400 కోట్లతో దివిటిపల్లిలో నిర్మిస్తున్న అమరరాజ గిగా పరిశ్రమ యూనిట్-1 నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి కేంద్ర రైల్వే, విద్యుత్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీదర్ బాబు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో ఉంటూ భాజపా కోసం పనిచేస్తున్న వారిని ఫిల్టర్ చేయాలి - రాహుల్



అహ్మదాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో ఉంటూ భాజపా కోసం పనిచేస్తున్న కార్యకర్తలను, నేతలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మన బాధ్యతలు నెరవేర్చేంత వరకు అధికారం ఇవ్వమని గుజరాత్ ప్రజలను అడగకూడదని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ ఈ విధంగా మాట్లాడారు. తమ పార్టీ బాధ్యతలు నెరవేర్చే వరకు రాష్ట్ర ప్రజలు తమకు ఓటు వేయరని రాహుల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా భాజపా అందించిన పాలన విఫలమైందని.. గుజరాత్ ప్రజలు కొత్త విజన్ కోసం వేచి చూస్తున్నారని అన్నారు. ఆశించిన విధంగా రాష్ట్రం ప్రగతి సాధించడం లేదని, కాంగ్రెస్ కూడా అందుకు సరైన మార్గాన్ని చూపించలేకపోతోందని అభిప్రాయపడ్డారు. "గుజరాత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో రెండు రకాలున్నారు. నిజాయతీగా పనిచేస్తూ ప్రజలను గౌరవిస్తూ, వారి కోసం పోరాడుతూ, పార్టీ సిద్ధాంతాన్ని తమ గుండెల్లో పెట్టుకునేవారు ఒకరు. రెండో రకానికి వస్తే.. ప్రజలతో సంబంధాలు కొనసాగించకుండా వారితో దూరంగా ఉండటమే కాకుండా గౌరవం కూడా ఇవ్వరు. ఇందులో సగం మంది భాజపాతో ఉన్నారు" అని కీలక వ్యాఖ్యలు చేశారు.




హైదరాబాద్: త్వరలో దేశవ్యాప్తంగా జనగణన జరుగుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. రానున్న జనరల్ ఎన్నికలకు ముందే మహిళల రిజర్వేషన్ల చట్టం అమలు చేయబోతున్నామని వెల్లడించారు. జనాభా లెక్కల సేకరణపై విపక్షాలు చేస్తున్నవి తప్పుడు ఆరోపణలేనని హోంమంత్రి అమిత్‌షా కేంద్ర కేబినెట్?భేటీలో చెప్పారని గుర్తుచేశారు. డీలిమిటేషన్‌తో రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా కూడా తగ్గే చాన్స్ లేదన్నారు.

తెలంగాణలో 17కు 17, ఏపీలో 25కు 25 సీట్లు ఉంటాయని స్పష్టం చేశారు. 2009లో పునర్విభజన ఏ రకంగానైతే జరిగిందో అదే రకంగా పునర్విభజన జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బీజేపీ స్టేట్ ఆఫీసులో మహిళా దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఫ్రీ బస్ ఇచ్చిన రేవంత్.. అందులో తిరుగుతూ మిగిలిన హామీలు అమలు చేసినట్లు ఫీల్ అవ్వమని మహిళలకు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. మహిళలు పిడికిలి బిగించి రేవంత్ సర్కారును నిలదీయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ సర్కార్‌లో.. గ్యారంటీల అమలు తక్కువ, ప్రచారం ఎక్కువ అని ఎంపీ డీకే అరుణ ఎద్దేవా చేశారు.

**ఐఐటీహెచ్‌తో బొగ్గు శాఖ ఒప్పందం..** కవాడిగూడలోని సీజీఐ టవర్స్ లో ఐఐటీ హైదరాబాద్ తో బొగ్గు, గనుల శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఐఐటీ హైదరాబాద్‌లో రూ.98 కోట్లతో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కోల్‌ఇండియా, ఐఐటీ హైదరాబాద్ మధ్య ఒప్పందాన్ని కిషన్ రెడ్డి సమక్షంలో కుదుర్చుకున్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్ కింద స్వతంత్ర ఆర్ అండ్ డీ వ్యవస్థను ఏర్పాటు చేయాలనేది కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆలోచన అన్నారు.




డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రజాభవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష ఎంపీల సమావేశం ముగిసింది. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 28 అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. విభజన సమస్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఏకం కావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. కేంద్రం దగ్గర అపరిష్కృత అంశాలపై చర్చ జరిపారు. పెండింగ్ సమస్యల సాధన అజెండాగా సమావేశం సాగింది. నిధులపై పార్లమెంట్‌లో ఎలా పోరాడాలో చర్చించినట్లు తెలిపారు. పార్లమెంట్‌లో ఏయే అంశాలు లేవనెత్తాలనే విషయాలపై చర్చించి విపులంగా బుక్‌లెట్ తయారు చేసినట్టు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో పదేళ్లు బీఆర్ఎస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఏడాదిగా తాము తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరం ఏకం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమావేశానికి రాని ఎంపీలకు బుక్‌లెట్ అందిస్తామన్న భట్టి విక్రమార్క అవసరమైతే మరోసారి భేటీ నిర్వహించేందుకైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందట్లేదన్నారు. రాష్ట్రానికి లబ్ధి చేకూరేలా అవసరమైతే పార్లమెంట్ సమావేశాల్లో అడ్జెయిన్ మెంట్ మోషన్ ఇచ్చే అవకాశాలను ఎంపీలకు వివరించామని చెప్పారు. ఇకపోతే.. ఈ సమావేశానికి చివరి నిమిషంలో బీజేపీ ఎంపీలు గైర్హాజరు అయ్యారు.

ఆహ్వానం ఆలస్యంగా అందిందని.. ఎంపీల సమావేశంపై పార్టీలో చర్చించుకునే సమయం కూడా లేదు.. ముందుగా నిర్ణయించుకున్న పార్టీ కార్యక్రమాల కారణంగా హాజరు కాలేకపోతున్నాం.. భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే కాస్త ముందుగా తెలియాజేయాలని కిషన్ రెడ్డి భట్టికి లేఖ రాశారు. తెలంగాణ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. గత 10 సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసింది. ఇకముందూ చిత్తశుద్ధి, అంకితభావంతో తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటుంది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.





నిజామాబాద్: సౌత్ ఇండియాలో బీజేపీకి సీట్లు తగ్గుతాయనేది కేవలం రీజినల్ పార్టీల తప్పుడు ప్రచారమని బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారం (మార్చి 8) నిజామాబాద్ లో ఎంపీ ధర్మపురి అరవింద్ మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల సమిష్టి కృషితో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిందని.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ గెలుపు మాదేనని ధీమా వ్యక్తం చేశారు. ఆల్ పార్టీల ఎంపీల సమావేశంలోనూ కాంగ్రెస్ రాజకీయం చేసిందని.. తమకు ప్రోటోకాల్ మేరకు ఆహ్వానం అందలేదని తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవమని తెలిసి కూడా అదే రోజు సమావేశం ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ముందస్తు షెడ్యూల్ వల్లే ఆల్ పార్టీ ఎంపీల మీటింగ్‌కు వెళ్లలేదని క్లారిటీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు దళితులపై ప్రేమ ఉంటే సీఎం కుర్చీ ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు లెక్కలతో బీసీ రిజర్వేషన్ చట్టం ఎలా చేస్తారని ప్రశ్నించారు.

నిజామాబాద్‌లో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అడ్డుపుల్ల వేస్తున్నారని.. నవోదయ నిజామాబాద్ రూరల్‌లో వద్దని.. బోధన్‌లోని నిజాం సుగర్స్ భూమిలో ఏర్పాటు చేయాలనడం సిగ్గు చేటని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేతగాని దద్దమ్మలు అని.. వాళ్ల పని కూడా నేనే చేయాల్సి వస్తోందని ఘాటు విమర్శలు చేశారు. రేవంత్ సర్కార్ బీజేపీ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

# ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. కుమారుడి మృతి.. తండ్రీకుమార్తె గల్లంతు

వరంగల్: ఎస్సారెస్పీ కాల్వలోకి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కుమారుడు మృతి చెందగా.. తండ్రి, కుమార్తె గల్లంతయ్యారు. కాల్వలో కొట్టుకుపోతున్న తల్లిని స్థానికులు కాపాడారు. వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. గల్లంతైన తండ్రి, కుమార్తె కోసం గాలింపు కొనసాగుతోంది.వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మేచరాజుపల్లికి చెందిన సోమారపు ప్రవీణ్ తన భార్య కృష్ణవేణి, కుమార్తె చైత్ర సాయి, కుమారుడు ఆర్యవర్ధన్ సాయితో కలిసి హనుమకొండ నుంచి స్వగ్రామానికి కారులో బయలుదేరారు. ఈక్రమంలో మార్గమధ్యలో డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్‌కు గుండె నొప్పి వచ్చింది. దీంతో చికిత్స కోసం తిరిగి వరంగల్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా గుండె నొప్పి ఎక్కువై కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ



కాలువలో పడింది. స్థానికుల సాయంతో కృష్ణవేణి బయటపడింది. కుమారుడు మృతి చెందగా.. కారుతో సహా ప్రవీణ్, చైత్ర సాయి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. నీటి ప్రవాహాన్ని తగ్గించి ప్రవీణ్, చైత్రసాయి ఆచూకీ కనుక్కునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# వెండి తెర వెన్నెల రాణి దేవికా రాణి

## దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు తొలి గ్రహీత దేవికా రాణి - మార్చి 9... దేవికా రాణి వర్ధంతి



రూప లావణ్యం, అద్భుత నటనా చాతుర్యం, అద్వితీయ అందం కలగలిపిన నాటి మేటి సినీ నటి దేవికా రాణి. ఆడపిల్లలు సినిమాలలో నటించడం తప్పుగా భావించే నాటి రోజులలోనే సినిమాలలో నటించిన భారతీయ తెర ప్రథమ మహిళ ఆమె. ఆమె తొలి సినిమా నటి, నిర్మాత, స్టూడియో అధినేత్రి. సినిమా నటన, నిర్మాణం, డిజైనింగ్, మేకప్ మొదలయిన శాఖలలో శిక్షణ పొందిన తొలి భారతీయ మహిళ. నాటి రోజుల్లో లండన్ వెళ్ళి ఆర్కిటెక్చర్, టెక్స్టైల్స్, డెకరేషన్ ఇంజనీరింగ్లో శిక్షణ పొందారామె. దేవికా రాణి (మార్చి 30, 1908 – మార్చి 9, 1994) సుప్రసిద్ధ సినీ నటి. పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల గ్రహీత. నటిగా, నిర్మాత గా భారతీయ చిత్ర పరిశ్రమలో ఆమె చేసిన పాత్ర మరువలేనిది. స్వాతంత్ర్యానికి ముందు మహిళా మార్గదర్శకుల్లో ఆమె ఒకరు. భారతీయ తెర ప్రథమ మహిళ (ఫస్ట్ లేడీ ఆఫ్ ఇండియన్ సినిమా)గా గుర్తింపు పొందిన నటి. వెండి తెర మీద తొలి ముద్దు సన్నివేశంలో నటించిన భారతీయ నటి దేవికా రాణీయే. దేవికా రాణి తన భర్త హిమాన్షు రాయ్‌తో కలిసి 1943లో బాంబే టాకీస్‌ను స్థాపించారు. ఇది భారత దేశంలోని మొట్ట మొదటి సుసంప న్నమైన స్టూడియోలలో ఒకటి. 1933లో భారతీయ సినిమాలో మొట్ట మొదటి ఆంగ్ల భాషా టాకీగా తీసిన 'కర్మ' సినిమాలో హిమాంశును ఆమె నాలుగు నిమిషాలు ముద్దు పెట్టుకుని సంచలనం సృష్టించిన తొలి తరం సంచలన డేరింగ్ నేటి. ఈమె 1908 మార్చి 30వ తేదీన నాటి మద్రాసు ప్రెసిడెన్సీ, నేటి ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ పట్టణంలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు లీలా చౌధురి, కల్నల్ మన్మథ్నాథ్ చౌధురిలు. వీరు నోబెల్ బహుమతి గ్రహీత, గురుదేవ్ రవీంద్రునికి దగ్గరి బంధువులు, విద్యావంతులకు నిలయమైన సంపన్న జమీందారీ కుటుంబం వీరిది. భారతదేశం లోను, మద్రాసు ప్రెసిడెన్సీలోను తొలి సర్జన్ జనరల్ కల్నల్ చౌధురి. 8 ఏళ్ళ వరకు బాల్యపు విద్యాభ్యాసాన్ని శాంతినికేతన్లో సాగించారు. 9 ఏళ్ళ వయస్సులోనే శాంతి నికేతన్లో విద్యాభ్యాసం తర్వాత ఉపకార వేతనం మీద లండన్ వెళ్ళి అక్కడ రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్స్, మ్యూజిక్లో సంగీతం, నటన లో శిక్షణ పొందారు. 1920 నాటికి పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆమె తన బాల్యంలో ఎక్కువ భాగం లండన్‌లో గడిపారు, అక్కడ ఆమె నటన, సంగీతం, వాస్తుశిల్పం అభ్యసించారు. రాయల్ అకాడమీ ఆఫ్ డ్రైమెటిక్ ఆర్ట్స్, రాయల్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్ లో చేరారు. వివిధ కళలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని, నైపుణ్యతను సంపాదించారు. ఇవే తరువాత కాలంలో సినిమా రంగంలోని వివిధ రంగాలలో ఈమెని అత్యున్నత స్థాయిలో నిలిపాయి. ఆమె టెక్స్టైల్ డిజైనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించగా, హిమాన్షు రాయ్, న్యాయవాదిగా మారిన చలనచిత్ర నిర్మాతను కలుసుకున్న తర్వాత ఆమె జీవితం ఒక మలుపు తిరిగింది. జర్మనీలో ప్రసిద్ధ సినీ నిర్మాతగా పేరు పొందిన హిమాంశు రాయ్ తో పరిచయం ఏర్పడి తర్వాత అది ప్రేమగా మారి 1929లో పెళ్ళి చేసుకున్నారు. ఆమె చిత్ర నిర్మాణం విషయంలో నేర్చుకోవడానికి బెర్లిన్‌కు వెళ్లి, బెర్లిన్ లోని యు.ఎఫ్.ఎ. స్టూడియోలో మేక ప్, కాస్ట్యూమ్ డిజైనింగ్ మొదలైన విభాగాల్లో శిక్షణ పొందారు. స్వదేశానికి తిరిగివచ్చి స్వంతంగా "కర్మ" (1933) అనే ఆంగ్ల చిత్రాన్ని నిర్మించారు. దేవికారాణి నాయికగా, హిమాంశు రాయ్ నాయకునిగా దీనిని హిందీలోకి అనువదించి విడుదల చేసారు కూడా. 1934లో "బాంబే టాకీస్" అనే సంస్థను స్థాపించి ఎందరో ఔత్సా హిక కళాకారుల్ని చేర్చుకొని వివిధ రంగాల్లో శిక్షణ నిచ్చారు. దేవికా రాణి కూడా భారతీయ సినిమాకు మధుబాల, ముంతాజ్, దిలీప్ కుమార్ వంటి అమూల్యమైన రత్నాలను అందించిన నిర్మాత. బాంబే టాకీస్ తీసిన చిత్రాలలో దేవికా రాణి, అశోక్ కుమార్ ల జంట హిట్ పెయిర్ గా పేరు పొందారు. వారు మొదటగా జీవన్ నయ్యా (1936)లో కలిసి నటించారు. అశోక్ కుమార్, దేవికా రాణి తరచుగా దేశభక్తి జన్మభూమి (1936), ప్రేమకథ ఇజ్జత్ (1937) మరియు పౌరాణిక సావిత్రి (1937) వంటి చిత్రాలలో కలస. నటించిన జంట. అంజాన్ (1941) వారు కలిసి తెరపై వచ్చిన చివరి చిత్రం. ఆమె నటించిన 16 చిత్రాలలోని చాలా పాత్రలు సంఘర్షణాత్మక మైనవి. అనేక మహిళా కేంద్రీకృత చిత్రాలను చేశారు. బాంబే టాకీస్ ద్వారా అచూన్ కన్యలో నటించగా, ఈ చిత్రం బ్రాహ్మణ అబ్బాయి మరియు అంటరాని అమ్మాయి ప్రేమ కథ ఆధారంగా మరియు సమాజంలోని కుల వ్యవస్థను ధైర్యంగా సవాలు చేసింది. సమాజ వివక్షతకు గురయ్యే హరిజన యువతిగా అచూత్ కన్య (1936) లో, తల్లి కాలేని గృహిణిగా నిర్మల (1939) లో, అనాథగా దుర్గ (1939), తిరగ బడిన మహిళగా సావిత్రి (1937) లో విధివంచితు రాలైన బ్రాహ్మణ యువతిగా జీవన్ ప్రభాత్ (1937) లో ఆమె నటన అనితర సాధ్యమైనది. 1940 మే 19లో హిమాంశు రాయ్ హఠాన్మరణం పొందడంతో బాంబే టాకీస్ నిర్వహణ బాధ్యత ఆమె చేతిలో పడింది. తర్వాత తీసిన బసంత్, కిస్మత్, అంజానా మొద లైన చిత్రాలు ఆర్థికంగా లాభాలు తెచ్చి పెట్టాయి. తర్వాత బాంబే టాకీస్ స్టుడియోను దర్శించడానికి వచ్చిన సుప్రసిద్ధ రష్యన్ చిత్రకారుడు స్వెతస్లోవ్ రోరిక్ తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారి 1945లో వివాహానికి దారి తీసింది. తర్వాత ఆమె సినీరంగానికి దూరమయ్యారు. భారతీయ సినిమాకు పితామహుడుగా భావించబడే దాదాసాహెబ్ ఫాల్కే శతజయంతి సందర్భంగా 1969 లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని భారత ప్రభుత్వం ఏర్పాటు చేయగా, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు నెలకొల్పిన తొలిసారి 1969లో చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గుర్తింపుగా దేవికా రాణి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న మొదటి గ్రహీతగా నిలిచారు. ఆ తర్వాత కాలంలో పృథ్వీ రాజ్ కపూర్, రూబీ మేయర్స్, బి.యన్ సర్కార్ లాంటి వాళ్ళకు ఈ అవార్డ్ అందచేశారు. ఆమె సినిమా రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభు త్వం 1958లో పద్మశ్రీ పురస్కారం ఇచ్చింది. చివరి రోజుల్లో బెంగుళూరులో గడుపుతూ 1994 మార్చి 9 తేదీన 85 ఏళ్ల వయసులో ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# స్వామివారి కళ్యాణం దేవస్థానం లోనే నిర్వహించాలి : తెరాస నేతల డిమాండ్



ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కళ్యాణం దేవాలయంలోని శేషప్ప కళావేదిక మీదనే నిర్వహించాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం దేవాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వారి కళ్యాణం బ్రాహ్మణ సంఘం పక్కన గల స్థలంలో నిర్వహించడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారని, అట్టి స్థలం ఇంతకాలం డంపింగ్ యార్డ్ కోసం ఉపయోగించారని కావున అట్టి స్థలంలో నిర్వహించ కూడదని పేర్కొన్నారు. ఒకవేళ దేవస్థానం దేవాలయం బయట నిర్వహించాలనుకుంటే అట్టి స్థలాన్ని కొనుగోలు చేయాలని, పరిపూర్ణంగా ఏర్పాట్లు చేసిన తర్వాతనే నిర్వహిస్తే బాగుంటుందని అన్నారు. స్వామివారి కల్యాణం సమయంలో వర్షం పడితే కార్యక్రమానికి అంతరాయం జరుగుతుందని, అధికారులు ఇతరుల ఒత్తిడికి గురి కాకుండా కళ్యాణోత్సవ స్థలాన్ని యధావిధిగా దేవాలంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం దేవస్థానం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అయ్యోరి రాజేష్, సంగి శేఖర్, బండారి అశోక్, అయ్యోరి వేణుగోపాల్, అనంతుల లక్ష్మణ్, సుధాకర్, జెట్టి రాజన్న తదితరులు పాల్గొన్నారు.
**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




దేశీయంగా ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల విధింపుతో దూకుడుగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పలు దేశాల నుంచి వచ్చే వారిపైనా నిషేధం విధించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లపై ట్రావెల్ బ్యాన్ విధించే అవకాశం ఉన్నట్లు సమాచారం. భద్రతా కారణాల దృష్ట్యా ట్రంప్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకోనుందని, వచ్చే వారమే ఇది అమల్లోకి రానున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడైన సమయంలోనూ కొన్ని ముస్లిం దేశాల పౌరులను అమెరికాలోకి అనుమతించడంపై నిషేధం విధించారు. అనేక పరిశీలన అనంతరం 2018లో అక్కడి సుప్రీం కోర్టుకూడా ఆ నిర్ణయాన్ని సమర్థించింది. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జో బైడెన్ సర్కార్.. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసింది. అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. అనేక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. ఇందులో అమెరికాలోకి ప్రవేశించే విదేశీయులను నుంచి జాతీయ భద్రతా ముప్పు పొంచి వుందా అన్న విషయాన్ని ముందే గుర్తించే కార్యనిర్వాహక ఆదేశంపైనా సంతకం చేశారు. దీని ప్రకారం, పాక్షికంగా లేదా పూర్తిగా ప్రయాణ నిషేధం విధించాల్సిన దేశాల జాబితాను రూపొందించి మార్చి 12లోగా సమర్పించాలని కేబినెట్ సభ్యులను ఆదేశించారు. ఇందులో భాగంగా పూర్తిగా నిషేధం కోసం సిఫార్సు చేసిన జాబితాలో అఫ్గానిస్థాన్ ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో పాకిస్థాన్‌ను కూడా చేర్చనున్నట్లు సమాచారం. అఫ్గాన్‌లో దాదాపు రెండు దశాబ్దాల పాటు ఉన్న అమెరికా సేనల కోసం పని చేసిన స్థానికులపై తాలిబన్లు ప్రతీకారం తీర్చుకోనున్నారనే భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వేలాది మంది అఫ్గాన్ పౌరులు అమెరికాలో శరణార్థులు లేదా ప్రత్యేక వలసవాదుల కింద వీసా పొందారు. ఒకవేళ నిషేధం అమల్లోకి వస్తే వీరందరిపై తీవ్ర ప్రభావం చూపనుందని తెలుస్తోంది.

# ట్రంప్ తో లొల్లి.. జెలెన్ స్కీ హీరో అయిపోయాడే!



కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి.. పెట్టుకుంటే అగ్రరాజ్యపు అధిపతితోనే పెట్టుకోవాలి. ఇప్పుడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ అదే చేశాడు. అతడు చేసింది కరెక్ట్ నా? రాంగ్ నా? అన్నది పక్కనపెట్టి ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోనే ఏకంగా వైట్ హౌస్ లో గొడవ పెట్టుకొని పాపులర్ అయిపోయాడు. ఇతడి ధైర్య సాహసానికి ప్రపంచమే ఆశ్చర్యపోగా.. ఇప్పుడు ఉక్రెయిన్ ప్రజల్లో అతడికి మద్దతు పెరగడం విశేషంగా చెప్పొచ్చు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్‌స్కీ మధ్య వైట్‌హౌస్ వేదికగా జరిగిన సమావేశం తీవ్ర వాగ్వాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ట్రంప్ మాట్లాడుతూ జెలెన్‌స్కీ ప్రజల మద్దతు కోల్పోయారని, ఆయన నియంతలాగా వ్యవహరిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఉక్రెయిన్‌లో జెలెన్‌స్కీ ప్రజాదరణపై పలు సంస్థలు అభిప్రాయ సేకరణలు నిర్వహించాయి.

**–జెలెన్‌స్కీ ప్రజామోదంలో 10% పెరుగుదల...** కీవ్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ నిర్వహించిన పోల్ ప్రకారం, ఉక్రెయిన్‌లో 67% మంది ప్రజలు జెలెన్‌స్కీకి మద్దతు తెలిపినట్లు వెల్లడైంది. ట్రంప్‌తో సమావేశానికి ముందు ఆయన మద్దతుదారుల శాతం 57% కాగా, సమావేశం అనంతరం అది 10% పెరిగింది.


ట్రంప్ ఉన్మాదపూరిత వ్యాఖ్యలు, ఉక్రెయిన్ అధ్యక్షుడిని అవమానించే విధంగా మాట్లాడటం ప్రజల్లో అసంతృప్తిని కలిగించిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జెలెన్‌స్కీ మద్దతుదారుల సంఖ్య పెరగడానికి కారణమని తెలుస్తోంది.

**–ట్రంప్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ ప్రజల ప్రతిస్పందన...** ట్రంప్ జెలెన్‌స్కీపై చేసిన ఆరోపణలు ఉక్రెయిన్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రష్యా ఆక్రమణతో దేశం దెబ్బతిన్నా, తమ నాయకుడిపై విదేశీ నాయకులు ఇలా విమర్శలు చేయడం ప్రజలకు ఆగ్రహాన్ని కలిగించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జెలెన్‌స్కీ నేతృత్వాన్ని ప్రజలు సమర్థిస్తుండటమే ఇందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు.

**–శాంతి చర్చలపై వివాదం...** ట్రంప్–జెలెన్‌స్కీ సమావేశం ప్రధానంగా ఉక్రెయిన్–రష్యా యుద్ధ పరిష్కార చర్చల గురించే జరిగింది. ట్రంప్ మాట్లాడుతూ ఉక్రెయిన్ యుద్ధానికి కారణమని, సకాలంలో సంధి చేసుకుని ఉంటే ప్రస్తుత పరిస్థితి వచ్చేది కాదని వ్యాఖ్యానించారు. అలాగే, జెలెన్‌స్కీకి ప్రజాదరణ 4% మాత్రమే ఉందని కూడా ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను జెలెన్‌స్కీ ఖండించారు. ప్రజలు తన నాయకత్వంపై నమ్మకంతో ఉన్నారని, ఉక్రెయిన్ భూభాగాన్ని రక్షించడానికి తాను ఎప్పటికీ వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఉక్రెయిన్‌లో జెలెన్‌స్కీ ప్రజాదరణ పెరగడం ఆసక్తికరంగా మారింది. అమెరికా–ఉక్రెయిన్ సంబంధాల్లో ఈ సంఘటన ప్రభావం చూపుతుందా లేదా అనేది మరింత కాలం గమనించాల్సిన అంశం. అయితే, ప్రజలు తమ నాయకుడి పట్ల మద్దతు పెంచుకోవడం అనేది అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా చెబుతున్నారు.

# ఎన్ఆర్ఐల కొత్త భయం : ప్రమాదంలో గ్లోబల్ ఆదాయం

భారత ప్రభుత్వం ఎన్ఆర్ఐల ఆర్థిక వ్యవహారాలను గతంలో ఎన్నడూ లేనంతగా గమనిస్తోంది. విదేశీ బ్యాంక్ ఖాతాల నుండి విదేశీ వ్యాపారాల వరకు ఏదీ దాచిపెట్టలేనిది మారింది. మీరు RNOR గా అర్హత పొందితే, మీ గ్లోబల్ పాసివ్ ఆదాయం, విదేశీ బ్యాంక్ వడ్డీ, స్టాక్ డివిడెండ్లు, క్యాపిటల్ గెయిన్స్ పై భారతదేశంలో పన్ను విధించబడుతుంది. మీ విదేశీ ఆస్తులను నివేదించకపోతే 300% జరిమానా లేదా జైలు శిక్ష తప్పనిసరి. విదేశాల్లో వ్యాపారం నిర్వహిస్తూ భారతీయ క్లయింట్ల నుండి ఆదాయం పొందినా అది కూడా పన్నుకు లోబడి ఉంటుంది. మీకంపెనీకి భారతదేశంలో కార్యాలయం లేకపోయినా అది భారతదేశానికి పన్ను చెల్లించాల్సిన అవసరం రావచ్చు. ఎన్ఆర్ఐలకు పన్ను మినహాయింపులు పొందడం ఇప్పుడు




కఠినమైన నియమాలతో కుదించబడింది. చిన్న పొరపాటు కూడా పెద్ద జరిమానాలకు దారి తీస్తుంది. ఇప్పుడు క్రిప్టో, స్టాక్స్, పెన్షన్ ఉపసంహరణ సహా అన్ని విదేశీ పెట్టుబడులు భారత ప్రభుత్వానికి పన్నుల కోసం నివేదించాల్సి ఉంటుంది.

డబుల్ టాక్సేషన్ అవాయిడెన్స్ అగ్రిమెంట్ ప్రకారం ఎన్ఆర్ఐలు ఊరట కోసం ఆశిస్తే అదీ కష్టతరం కానుంది. మరిన్ని పత్రాలు సమర్పించాలని ప్రభుత్వం కోరుతోంది. దీన్ని టాక్స్ ఎగవేయడానికి ఉపయోగించేవారు క్రిమినల్ కేసులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎన్ఆర్ఐలు భారతదేశానికి తిరిగి వచ్చిన మొదటి 2 సంవత్సరాలు గ్లోబల్ ఆదాయంపై పన్ను విధించబడదు. కానీ ఆ తరువాత మొత్తం ఆదాయానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మీరు విదేశాల్లో వ్యాపారం ఏర్పాటు చేసి తిరిగి రాబోతున్నట్లయితే, మీ ఆర్థిక ప్రణాళికను జాగ్రత్తగా రూపొందించుకోవాలి. ప్రభుత్వం ప్రతి లావాదేవీని, ప్రతి ఆస్తిని, మీరు విదేశాల్లో సంపాదించే ప్రతి రూపాయిని గమనిస్తోంది. చిన్న తప్పిదం జరిగినా భారీ జరిమానాలు, ఖాతాల రద్దు, లేదా మరింత తీవ్రమైన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎన్ఆర్ఐల జీవితం ఈ కొత్త పన్ను నియమాలతో మరింత క్లిష్టతరం అయింది.

# భార్యను చదువు మానేయమనడంపై కోర్టు సంచలన తీర్పు!

భార్యభర్తల విడాకులకు సంబంధించిన కేసుల్లో వారి వివాహం రద్దు కావడానికి పలు రకాల కారణాలుంటాయనే సంగతి తెలిసిందే. అ కారణాల్లో తాజాగా.. భార్యను చదువును ఆపమని బలవంతం చేయడం చేరిందని చెప్పొచ్చు! ఈ సమయంలో.. ఒక వ్యక్తి తన భార్యను చదువును ఆపమని బలవంతం చేయడంతో.. వారి వివాహాన్ని కోర్టు రద్దు చేసింది. అవును... తాజాగా మధ్యప్రదేశ్ హైకోర్టు ఒక వివాహాన్ని రద్దు చేసింది. ఇందులో భాగంగా... ఒక వ్యక్తి తన భార్యను చదువు ఆపమని బలవంతం చేయడం, ఆమె కలలను నాశనం చేయడంతో సమానం అని.. చదువుకొని లేదా తనను తాను మెరుగుపరుచుకోవడానికి ఇష్టపడని వ్యక్తితో జీవించమని ఒత్తిడి చేయడం మానసిక క్రూరత్వానికి సమానమని పేర్కొంది. హైకోర్టు ఇండోర్ బెంచ్.. ఒక మహిళ పిటిషన్ ఆధారంగా ఆమె



వివాహాన్ని రద్దు చేస్తూ ఈ వాఖ్యలు చేసింది. ఇందులో భాగంగా... విద్య అంటే జీవితానికి సిద్ధం కావడం మాత్రమే కాదు..

అది జీవితమే అని అమెరికన్ తత్వవేత్త జాన్ డ్యూయి చెప్పిన కోట్ ను ఇక్కడ ఉదహరించింది! వివరాల్లోకి వెళ్తే... తన భర్తతో విడిపోవాలని ఓ మహిళ షాజాపూర్ జిల్లాలోని ఫ్యామిలీ కోర్టును అభ్యర్థించగా.. న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో.. ఆ మహిళ హైకోర్టులో అప్పీల్ చేసింది. తన అప్పీల్ లో 12వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత 2015లో షాజాపూర్ కు చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్నట్లు పేర్కొంది. అయితే.. వివాహం తర్వాత ఆమె చదువు కొనసాగించాలని కోరగా.. అందుకు ఆమె అత్తమామలు అంగీకరించలేదు. భర్త కూడా తిరస్కరించారు! ఈ నేపథ్యంలో కేసు వివరాలు, ఇరువైపుల వాదనలు పరిశీలించిన తర్వాత.. ఫ్యామిలీ కోర్టు ఆదేశాలను జస్టిస్ వివేక్ రుసియా, జస్టిస్ గజేంద్ర సింగ్ లతో కూడిన డివిజన్ బెంచ్ రద్దు చేసింది. ఈ సందర్భంగా సదరు మహిళ విజ్ఞప్తిని ఆమోదించిన హైకోర్టు.. హిందూ వివాహ చట్టంలోని నిబంధనల ప్రకారం ఆమె వివాహాన్ని రద్దు చేసింది.

చురకలు

## సంపాదకీయం

# ట్రంప్ దెబ్బకు భారత్ కూడా సుంకాలు తగ్గించిందా?

భారత ప్రధాని నరేంద్రమోడీ తనకు జిగ్రీ దోస్త్ అయినా.. తన కోసం అంతకుముందు ఎన్నికల్లో ప్రచారం చేసినా కూడా భారత్ విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గలేదు. సుంకాల విషయంలో ఇండియాను టార్గెట్ చేశారు. భారత్ తగ్గించకపోతే మేము కూడా తగ్గించకుండా పెంచుతామని హెచ్చరించారు. దీనికి టైం కూడా ఇచ్చారు. అమెరికా స్వప్రయోజనాలే ధ్యేయంగా ముందుకెళుతున్న ట్రంప్ దెబ్బకు కెనడా, మెక్సికోలే కాదు.. ఇప్పుడు భారత్ కూడా వెనక్కి తగ్గింది. సుంకాలు తగ్గింపునకు అంగీకరించింది. ఇలా ట్రంప్ అనుకున్నది సాధించేస్తున్నాడు. భారత్ సుంకాల తగ్గింపుకు అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం వాణిజ్య రంగంలో ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ అధిక సుంకాలను విధించడం వల్ల అమెరికా సంస్థలు ఆ దేశంలో వ్యాపారం చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పిన తర్వాతే భారత్ సుంకాలను తగ్గించేందుకు అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని ఆయన మరోసారి లేవనెత్తారు.

**– భారత్‌లోకి టెస్లా ప్రవేశం...** ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా త్వరలో భారత్‌లో అడుగుపెట్టనుంది. ప్రస్తుతం భారత్ కార్ల దిగుమతిపై 110% సుంకాలను విధిస్తోంది. ఎలాన్ మస్క్ ఈ విషయంలో అనేక మార్లు తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశంగా భారత్‌ను అభివర్ణించిన మస్క్, టెస్లా కార్లను భారత్‌లో తక్కువ సుంకాలతో ప్రవేశపెట్టేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపై సుంకాలను పూర్తిగా తొలగించేలా రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. అయితే, తక్షణమే సుంకాలను పూర్తిగా తొలగించేందుకు భారత్ ఇంకా ఆచితూచి స్పందిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**– రష్యా ఆయుధాలను కొనవద్దని భారత్ కు ఆఫర్...** అమెరికా వాణిజ్యమంత్రి హోవార్డ్ లుట్నిక్, భారత్ తన రక్షణ అవసరాల కోసం రష్యాపై ఆధారపడటం మానుకోవాలని సూచించారు. దీంతో భారత్–అమెరికా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రత్యామ్నాయంగా అధునాతన అమెరికన్ రక్షణ వ్యవస్థలను అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని చెప్పారు. అంతేకాక యూఎస్ డాలర్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త కరెన్సీ కోసం బ్రిక్స్ దేశాలు ప్రయత్నించడం ఇరుదేశాల సంబంధాలకు ప్రతికూలంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. అమెరికా దిగుమతులపై సుంకాలను తగ్గించాల్సిందిగా భారత్‌ను కోరినట్లు లుట్నిక్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా పలు మార్లు భారత్, చైనా తదితర దేశాలపై భారీ సుంకాలను విధిస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 2న భారత్, చైనా విధించే సుంకాలు అమెరికా వాణిజ్య పరిస్థితిని ప్రభావితం చేయనున్నాయని పేర్కొన్నారు.

**– భారత్ స్పందన..** ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. సుంకాలు, సుంకాలేతర అడ్డంకులను అధిగమించేందుకు బహుళ రంగ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కింద అమెరికాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించింది. ఈ పరిణామాలు భారత్–అమెరికా వాణిజ్య సంబంధాల్లో కీలక మలుపులో ఉన్నాయి. భారత్ తన వ్యాపార విధానాలను సవరిస్తుందా లేదా అనే అంశం ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామాలు ఇరుదేశాల భవిష్యత్తు వ్యాపార సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది.

# ఆంధ్రా ఫ్రాయిడ్ అన్నపురెడ్డి - మార్చి 9... అన్నపరెడ్డి వర్ధంతి



కష్టాలు, కన్నీళ్ల మధ్య గడిపిన బాల్యం ఆయనది. కుల వివక్షతో కలిని వేయబడ్డ సున్నిత మనసు ఆయనది. తండ్రి నిర్లక్ష్యానికి గురై, బడికెళ్లాల్సిన వయసులో గొడ్లను కాయడానికే పరిమితమై, ఒక బాలుని సగం విరిగిన పలక ముక్క పొంది, పాఠశాలలో అడుగుపెట్టిన ఆయన ఆ తర్వాత కాలంలో విద్యా ధికుడై మనస్తత్వ శాస్త్రంపై, బౌద్ధమ్మంపై ఎన్నో ప్రామాణికమైన గ్రంథాలు విరచించిన ప్రతిభాశాలిగా నిలిచారు. ఎంతో మందికి విజ్ఞానపు వెలుగులు అందించారు. పదహారేళ్ల సుదీర్ఘకాలం మిసిమి పత్రికకు సంపాదకునిగా పని చేశారు. ఒక మనో విజ్ఞాన శాస్త్ర వేత్తగా, సామాజిక శాస్త్రవేత్తగా, విశ్లేషకునిగా, బౌద్ధ తత్వవేత్తగా, సాహిత్య విమర్శకునిగా, భాషా శాస్త్రవేత్తగా, అనువాదకునిగా, సంపాదకునిగా... లోతైన అంతర దృష్టిని, పాండిత్యాన్నీ కలిగిన వ్యక్తిగా పేరెన్నిక గన్నారు. ఆయనే "ఆంధ్రా కార్ల్ మార్క్స్" గా గుర్తింపును పొందిన అన్నపురెడ్డి. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా తుమూలూరు గ్రామంలో అన్నపరెడ్డి తన అమ్మమ్మ గారింట్లో 1933, ఫిబ్రవరి 22న పుట్టారు. తల్లి గోవిందమ్మ, తండ్రి అప్పిరెడ్డి. అన్నపరెడ్డి ఏడాది బిడ్డగా ఉన్నప్పుడే అతని తల్లిని ఆత్మ కూరులో ఉన్న తన ఇంటి నుంచి తండ్రి వెళ్లగొట్టాడు. దాంతో ఆమె నిస్సహాయస్థితిలో అన్నపరెడ్డిని చంక నెత్తుకుని పుట్టిల్లు చేరి, తల్లీ తండ్రీ తానై, అన్నపరెడ్డిని పెంచింది. నిరుపేద కుటుంబం రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. ఎన్నోరకాల ఈసడింపుల మధ్య బాల్యం సాగింది. నాలుగేడేళ్ల వయసులోనే గొడ్లకాపరిగా జీవితం మొదలైంది. నెలకు రెండు రూపాయలొచ్చే గొడ్లకాపరి పనిలో అన్నపరెడ్డి ఉండి పోవడంతో అతని చదువు గురించి ఎవరూ పట్టించు కోలేదు. రోజుకు ఒక అణా (రూపాయిలో 16వ వంతు)కి కూలీకి వెళ్లే మా అమ్మ, ఒక కాణీ (రూపాయిలో 64వ వంతు) పెట్టి పలక కాని బడికి పంపలేక పోయింది. ఆమె నిరక్షరి కావటంతో నన్ను బడికి పంపాలనే ఆలోచనా ఆమెకు పొడమలేదు. పక్కింటి పిల్లవాని పెద్ద పలక పగిలి రెండు చెక్కలైతే... ఒక చెక్క నాకిచ్చి వాడు నన్నా బడికి వాడు నన్ను ఆ బడికి తీకు పోయిన సంఘటన జీవితంలో మరిచి పోలేనిదని ఒక సందర్భంలో పేర్కొన్నారు. సమాజంలో కుల, మతాలు అంటే ఏమిటో తెలియని రోజుల్లోనే చిన్ననాడే అన్నపరెడ్డికి కుల వివక్ష ఎదురైంది. ఎప్పుడూవరి జీవితమూ పూల బాట కాదు. అలాగని ముళ్లబాట కాదు అని ఆయన నమ్మేవారు. బాల్యం నుంచీ ఎదురైన ఎన్నో జీవితానుభవాలు అన్నపరెడ్డిలో ఆలోచనా వికాసానికి పునాదులు వేశాయి. అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ప్రముఖ రచయిత, తత్వవేత్త, అధ్యాపకుడు, సంపాదకుడు, బౌద్ధమతావలంబి. ఫ్రాయిడ్‌ను తెలుగు చేసిన వాడిగా, 'మిసిమి' సంపాదకుడిగా, బౌద్ధ రచనల మీద విశేష కృషి చేసి తన పేరునే అన్నపరెడ్డి బుద్ధ ఘోష దుగా మార్చుకున్న 'కళారత్న', 'బౌద్ధరత్న', 'సద్ధర్మ మహోపా ధ్యాయ' అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి. అయన 1933, ఫిబ్రవరి 22వ తేదీ మహాశివరాత్రి నాడు, గుంటూరు జిల్లా, కొల్లిపర మండలం తూము లూరు గ్రామంలో జన్మించారు. విద్యాభ్యాసం కొల్లిపర హైస్కూల్లో, గుంటూరు హిందూ కళాశాల, ఆంధ్ర విశ్వ విద్యాలయం వాల్తేరులలో గడచింది. తెనాలిలోని వి.యస్. ఆర్. కళాశాల, వి.యస్.ఆర్ %డ% యన్.వి.ఆర్. కళాశాల, గుంటూరు లోని జె.కె.సి. కళాశాలలో 1957 నుండి 1991 వరకు అధ్యాపకుడి గా సామాజిక శాస్త్రాలను బోధిం చారు. ఆ తరువాత వడ్లమూడి లోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో కొంతకాలం పనిచేశారు. 'మిసిమి' మాసపత్రిక సంపాదకునిగా 1996 –2011ల మధ్య వ్యవహరించారు. అన్నపరెడ్డి తాము అధ్యయనం చేసిన అంశాలపై విస్తృతంగా రచనలు చేశారు. మొత్తం 83 గ్రంథాలు, 16 వేల పుటల్లో అవి పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పలు పుస్తకాలు పదుల సంఖ్యలో పునర్ముద్రణలు పొందాయి. పలు విశ్వ విద్యాల యాల్లో పాఠ్య పుస్తకాలుగా, రిఫరెన్స్ గ్రంథాలుగా ఉన్నాయి. బౌద్ధాన్ని కూలంకషంగా అధ్యయనం చేసిన ఆయన తన జీవితాంతం బౌద్ధానికి పూర్తిగా అంకితం చేశారు. 1988లో రాసిన 'మానవీయ బుద్ధ' పుస్తకం మొదలుకుని, కొన్ని నెలల కిందట వెలువడిన 'అంగుత్తర నికాయం' సంపుటాల వరకూ ఆయన రాసినన్ని బౌద్ధ గ్రంథాలు దేశంలోనే ఇంకే భాషలో కూడా ఎవరూ రాయలేక పోవడం విశేషం. అన్నపరెడ్డి తన స్వీయ చరిత్రను 'అనాత్మవాది ఆత్మకథ (అలాత చక్ర)' పేరుతో రాశారు. శాంతియుత సమాజానికి బుద్ధుని బోధనలే శరణ్యమని ఆయన చెప్పే వారు. బౌద్ధమతం అవలంబించిన తర్వాత ఆయన "అన్నపరెడ్డి బుద్ధఘోషుడు" అనే పేరుతో కూడా రచనలు చేశారు. ఆయనికి "బుద్ధరత్న", "సద్ధర్మ మహోపా ధ్యాయ" అనే బిరుదులు వచ్చాయి. మొత్తం 75కు పైగా రచనలు చేశారు. విశాఖలో డెమొక్రటిక్ స్టూడెంట్ యూనియన్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తార్కిక ఆలోచన లను పంచుకున్నారు. చదువు పూర్తయ్యాక తెనాలిలోని వియస్ఆర్ కాలేజీలో తర్కశాస్త్ర అధ్యాపకునిగా ఉద్యోగంలో చేరారు. అక్కడే ప్రముఖ రచయిత, విద్యావేత్త జివి కృష్ణారావుతో పరిచయం, స్నేహం అతనికి పెంపొందాయి. తనలోని సృజనాత్మకతకు ఆయనే ప్రేరణ అంటారు అన్నపరెడ్డి. బాల్య, కౌమారదశల్లో ఎదురైన సమాజ అవమానాలు, అవమానాలు అన్నపరెడ్డిని హేతువాదం వైపు నడిపించాయి. త్రిపురనేని రామస్వామి రాసిన శంబూక వధ, యథార్థ రామాయ ణం, యథార్థ ప్రహ్లాద చరిత్ర, సూత పురాణం వంటివాటిని అన్నపరెడ్డి అధ్యయనం చేశారు. ఊరి రచ్చబండ మీద చెప్పే పురాణ ప్రసంగాలకు అడ్డుతగిలి, హేతు దృష్టితో ప్రశ్నలు వేసేవారు. అలా హేతు వాదినయ్యాను, నాస్తికుడిని అయ్యాను. ఈ రెండింటితో పాటు తరవాత బుద్ధుడు వచ్చి, నన్ను అనుభవిక వాదినీ, మానవతా వాదినీ చేసాడని ఆయన పేర్కొన్నారు.. చదువుకునే రోజుల్లోనే సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతాలపై నిశితంగా అధ్యయనం చేశారు. మనో విజ్ఞాన శాస్త్రాన్ని అవపోశన పట్టారు. కాలేజీ మాగజైన్‌కు 'ఫ్రాయిడిన్ థియరీ ఆఫ్ సెక్యువా లిటీ' అనే వ్యాసాన్ని రాశారు. ఇది పలువురి ప్రశంసలందు కున్నారు. సహాధ్యా యులు ఆయన్ని 'ఆంధ్రా ఫ్రాయిడ్' అని పిలవడం ప్రారంభించారు. అయితే తన అధ్యయనాన్ని అన్నపరెడ్డి అక్కడితో ఆపలేదు. ఆ ప్రేరణతోనే 'స్వప్న సందేశం' అనే పుస్తకాన్ని రాశారు. సిగ్మండ్ ఫ్రాయిడ్ కలలకు అర్థం చెప్పడం ఎలా? నాగరికత దాని అపశ్రు తులు, మనసు–మర్మం, మనసు గతినే మార్చిన ఫ్రాయిడ్..' తదితర పుస్తకాలను రాశారు. "నా ఉద్దేశంలో చాలామంది రచయితలు – అందరూ అని అనను – గానుగెద్దు పోకడలనే పోతున్నారు రోకంటి పాట పాడుతున్నారు. తమ స్వతంత్ర విచార ధారను సాగించలేక పోతు న్నారు. మౌలిక ప్రశ్నలను వేసేతత్వ సాహసించలేక పోతున్నారు. బ్రతుకు వెనుక దాగివున్న రహస్య సూత్రం ఏమిటి?... ఏ రచయితా ఆలోచించడం లేదు"...అని అభిప్రాయాన్ని పదేపదే వ్యక్తం చేస్తుండే వారు. అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(84) 2021 మార్చి 9న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# భారత గణిత శాస్త్ర పరిశోధనా పితామహుడు గణేష్ ప్రసాద్ - మార్చి 9...గణేష్ ప్రసాద్ వర్ధంతి



గణితశాస్త్రాన్ని, ప్రాచీన కాలం నుండి ఎంతోమంది భారతీయులు అభివృద్ధి పరుస్తూ వచ్చారు. ప్రాచీన కాలంలో ... క్రీ.పూ. 4లో పాణిని నుండి మొదలు కొని పింగళుడు, వరాహమిహిరుడు, ఆర్యభట్టు, యతి వృషభుడు, బ్రహ్మగుప్తుడు, మొదటి భాస్కరుడు, శ్రీధరుడు, మహావీరుడు, పావులూరి మల్లన, ఆచార్య హేమచంద్రుడు, భాస్కరా చార్యుడు, వరకు అలాగే మధ్య యుగంలో ...నారాయణ పండితు డు, మాధవుడు, పరమే శ్వరుడు, నీలకంఠ సోమయాజి, మహేంద్ర సూరి, శంకర వారియార్, రఘునాథ శిరోమణి, జ్యేష్ఠ దేవుడు, అచ్యుత పీషరటి, మునీశ్వరుడు, కమలా కరుడు, జగన్నాథ సామ్రాట్ తదితరులుబీ ఆధునిక యుగం సంబంధిత 1800లలో...రామచంద్ర లాల్, శ్రీనివాస రామానుజన్, ఎ.ఎ. కృష్ణస్వామి అయ్యంగార్, గణేష్ ప్రసాద్, తదితరులు గణిత శాస్త్ర అభివృద్ధికి విశేష కృషి చేసి తర్వాతి శాస్త్రవేత్తలకు మార్గదర్శ కులు అయినారు. అలా గణిత శాస్త్ర వివిధ అంశాలపై పరిశోధనలు చేసి భారత దేశ గణిత శాస్త్ర పరిశోధనా పితా మహునిగా పేరెన్నిక గన్నాడు గణేష్ ప్రసాద్. గణేష్ ప్రసాద్ (1876 – 1935) భారతీయ గణిత శాస్త్రవేత్త. ఆయన పొటెన్షియల్ సిద్ధాంతం, వాస్తవ చరరాశుల ప్రమేయాలు, ఫోరియర్ శ్రేణులు, ఉపరితల సిద్ధాంతం అనే గణిత విభాగాలలో ప్రత్యేకత పరిశోధనలు చేసిన మేధావి. ఆయన కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం, గొట్టింజెన్ విశ్వ విద్యాలయం లలో శిక్షణ పొందా డు. భారత దేశానికి తిరిగి వచ్చి దేశంలో గణిత పరిశోధనల సంస్కృతిని అభివృద్ధి చేసాడు. భారత దేశంలోని గణిత శాస్త్రజ్ఞులు గణేష్ ప్రసాద్ ను "భారత దేశ గణిత శాస్త్ర పరిశోధనా పితా మహుడు" గా పిలుస్తారు. ఆయన భారత దేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని ప్రాథమిక విద్య అభివృద్ధి పట్ల ప్రత్యేక ఆసక్తి కనపరచి అందుకు కృషి సల్పాడు. గణేష్ ప్రసాద్ 1876 నవంబరు 15 న ఉత్తర ప్రదేశ్ లోని బాలియాలో శ్రీవాస్తవ కాయస్థ కుటుంబం లో జన్మించాడు. అక్కడే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తన ప్రారంభ విద్యను అభ్యసించాడు.1891లో మెట్రిక్యులేషన్ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. అలహాబాద్‌లోని ముయిర్ సెంట్రల్ కాలేజీలో చదువు కున్నాడు, 1895లో గణితంలో ఫస్ట్ క్లాస్ ఆనర్స్ తో బీ ఏ డిగ్రీ పూర్తి చేశాడు. అలహాబాద్, కలకత్తా యూని వర్శిటీలలో డీ ఎస్సీ, ఎం ఏ డిగ్రీ తీసుకుని, తర్వాత అలహా బాద్ నందలి కాయస్థ పాఠశాలలో విద్యా బోధనకు శ్రీకారం చుట్టా డు. అలహాబాదు లోని "మూయిర్ సెంట్రల్ కాలేజ్"లో కూడా విద్యా బోధన గావించాడు. తర్వాత ఉన్నత విద్య, పరిశోధనల కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయానికి వెళ్లాడు. కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో ఆయనకు ఇ.డబ్ల్యు.హబ్సన్, ఆండ్రూ ఫోర్సైత్ వంటి గొప్ప గణిత శాస్త్రవేత్తలతో కలసి పనిచేసే అవ కాశం లభించింది. తర్వాత గొట్టింజెన్ ప్రాంతానికి వెళ్ళి ప్రముఖ శాస్త్ర వేత్తలైన ఆర్నాల్డ్ సోమర్ ఫీల్డ్, డేవిడ్ హిల్బర్ట్, జార్జి కాంటర్ వంటి వారితో కలసి పని చేసే అవకాశం కలిగింది. గొట్టింజెన్ లో ప్రసాద్ "ఆన్ ద కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ మేటర్ అండ్ ద అనలైటిక్ థీరీస్ ఆఫ్ హీట్" పై పరిశోధనా పత్రాన్ని ప్రచురించాడు. ఐదు సంవత్సరాలు విదేశాలలో గడిపిన అనంతరం , ప్రసాద్ 1904లో భారత దేశానికి తిరిగి రాగానే అలహాబాద్ లోని ముయిర్ సెంట్రల్ కాలేజీలో గణితశాస్త్ర అదనపు ప్రొఫెసర్‌గా నియమితు డయ్యాడు. అప్పటి బనారస్‌లోని క్వీన్స్ కాలేజీలో గణిత శాస్త్ర విభాగాధిపతి సుధాకర్ ద్వివేది పదవీ విరమణ చేయడంతో డాక్టర్ ప్రసాద్ అక్కడికి పంప బడ్డాడు. అక్కడ గణితశాస్త్ర అధ్యాపకుడు ఆయన ఒక్కడే కావడంతో నాలుగు డిగ్రీ తరగతులకు ఆయనే బోధించాల్సి వచ్చింది. 1917లో బనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో గణితశాస్త్ర ప్రొఫెసర్‌గా సెంట్రల్ హిందూ కళాశాల, బనారస్ గౌరవ ప్రిన్సి పాల్‌గా పనిచేశాడు. అక్కడ గణిత శాస్త్ర బోధనను సమూలంగా పునర్వ్యవస్థీ కరించాడు. 1923లో కలకత్తాకు ఆహ్వానించ బడి, గణితశాస్త్ర ప్రొఫెసర్ గా. విధులు నిర్వర్తించాడు. 1935 మార్చి 9న ఆయన మరణించే వరకు ఈ పదవిలో కొనసాగాడు. 1924 లో గణేష్ ప్రసాద్ కలకత్తా గణిత సంఘానికి అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు. ఇండియన్ అసోసి యేషన్ ఫర్ అడ్వాన్స్ మెంట్ ఆఫ్ సైన్స్ కు ఉపాధ్యక్షు లుగా ఎన్నికైనాడు. ఆయన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ప్రస్తుతం ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ) వ్యవస్థాపక సభ్యుడు. ఆగ్రా యూనివర్సిటీ స్థాపకుల్లో ఆయన కూడా ఒకరు. ఆయన 11 పుస్తకాలను రచించాడు. గణిత శాస్త్రంలో 50 పరిశోధనా పత్రాలను వ్రాసాడు. వివిధ విషయాలపై పనిచేశాడు. ఇందులో థియరీ ఆఫ్ పొటెన్షియల్స్, థియరీ ఆఫ్ ఫంక్షన్స్ ఆఫ్ ఎ రియల్ వేరియబుల్, ఫోరియర్ సిరీస్, థియరీ ఆఫ్ సర్ఫేస్ మొదలైనవి ఉన్నాయి. ఆయన విద్యార్థులలో దివంగత డాక్టర్ ఎ ఎన్ సింగ్, డాక్టర్ గోరఖ్ ప్రసాద్, డాక్టర్ ఆర్ ఎస్ వర్మ, డాక్టర్ బి ఎన్ ప్రసాద్, డాక్టర్ ఎన్ జి శబ్దే. డాక్టర్ ఆర్ డి మిత్రా వంటి వారు ఉన్నారు. డా. ప్రసాద్ హిందీ అంటే చాలా ఇష్టపడేవాడు. యూనివర్శిటీ క్లాసులలో హిందీని ఒక సబ్జెక్ట్‌గా పరిచయం చేయడంలో ఆయన కృషి మరిచి పోలేనిది. "పంతొమ్మి దవ శతాబ్దానికి చెందిన కొంత మంది గొప్ప గణిత శాస్త్రజ్ఞులు" అనే పేరుతో ఆయన తన పుస్తకం లోని మొదటి వాల్యూమ్‌ను హిందీలోకి అనువదించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అభినవ ఆంధ్ర భోజుడు బెజవాడ గోపాల్ రెడ్డి - మార్చి 9...బెజవాడ వర్ధంతి



డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గురించి ఈ తరం వారికి అంతగా తెలియక పోవచ్చు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. పరిపాలనలో, సాహిత్యంలో సాధికారిక సాధించి "అభినవ ఆంధ్ర భోజుడు"గా గుర్తింపు పొందారు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, సాహితీవేత్త .బెజవాడ గోపాలరెడ్డి సౌమ్యుడు, వివాద రహితుడైన రాజకీయవేత్త. రాష్ట్ర మంత్రిగా, ఉప ముఖ్య మంత్రిగా, ముఖ్య మంత్రిగా, నెహ్రూ మంత్రివర్గ సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, గవర్నర్ గా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన్ను ఎవరూ వేలెత్తి చూపిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదేమో. 11భాషలలో ప్రావీణ్యం సంపాదించిన అనన్య సామాన్యుడు. స్వాతంత్ర్య సమర యోధుడు, బహుభాషావేత్త, ఆంధ్ర రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రి, డా.బెజవాడ గోపాలరెడ్డి (ఆగష్టు 7, 1907 – మార్చి 9, 1997). పదకొండు భాషల్లో పండితుడైన గోపాలరెడ్డి అనేక రచనలు కూడా చేసారు. పరిపాలనా దక్షుడుగా, కేంద్ర, రాష్ట్రాల్లో మంత్రిపదవులు, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిత్వమే కాక, ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడు (1958–1962) గా కూడా పనిచేసారు. 1907 ఆగస్టు 7న నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డి పాలెంలో ఓ భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. స్వంత ఊరిలోనే కళాశాల చదువు పూర్తి చేసి బందరు జాతీయ కళాశాలలో చేరారు. శాంతి నికేతన్ లో 1924–27 సం.లలో రవీంద్ర కవీంద్రుని శాంతినికేతన్ లో విద్యాభ్యాసం చేశారు. ఒక వైపు జాతీయోద్యమం మరోవైపు సాహిత్య పిపాస గోపాలరెడ్డి జీవనంలో పెనవేసు కొన్నాయి. 1927లో శాంతినికేతన్‌లోని విశ్వభారతి విశ్వ విద్యాలయంలో స్నాతకోత్తర విద్యను పూర్తి చేసాడు. రవీంద్రుని గీతాంజలిని తెనిగించిన సాహితీవేత్త. రవీంద్రనాథ్ ఠాగూర్ ని గోపాలరెడ్డి గురుతుల్యులు, దైవ సమానులుగా భావించే వారు. తమ జీవితంలో ప్రతిమెట్టును విశ్వకవి ఆశీస్సులతోనే అధిరోహించానని గర్వంగా చెప్పుకునేవారు. గాంధీజీ ఉపన్యాసాలతో ఉత్తేజితులైన గోపాలరెడ్డి ప్రాథమిక విద్యను మధ్యలోనే ఆపి,స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అనేక మార్లు నిర్బంధానికి గురై జైలుశిక్షను అనుభవించారు. 1931లో అతి పిన్న వయసులో ఏఐసీసీ సభ్యులుగా, 1937లో రాజాజీ నేతృత్వంలో ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో ముప్పయి ఏళ్ల నిండక ముందే మంత్రి అయ్యారు. అప్పటికింకా ఆయన అవివాహితుడు. రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మదినం నాడే బ్రహ్మ సమాజ పద్దతిలో లక్ష్మీ కాంతమ్మను ఆయన వివాహం చేసుకున్నారు. స్వాతంత్ర్యానంతరం టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గంలో 1953 అక్టోబర్ 1నుండి 54 నవంబర్ 15వరకు ఆర్థిక మంత్రిగా, 1955 మార్చి 28 నుండి 56 నవంబర్ 1వరకు ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరించాక నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో ఆర్థికమంత్రిగా, హోంమంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన గోపాలరెడ్డి జాతీయ స్థాయిలో నెహ్రూ ఆహ్వానంపై,1962– 64లో జవహర్ లాల్ మంత్రి వర్గంలో సమాచార ప్రసార మంత్రిగా వ్యవహరించారు. విశాఖ పట్టణ కేంద్రం (1963 ఆగష్టు 4), కడప కేంద్రం (1963 జూన్ 17) ఆకాశవాణి కేంద్రాల ప్రారంభోత్సవాలు ఆయన చేతిమీదుగా జరిగాయి. పాలనలో నిర్మోహ మాటంగా వ్యవహరించే వారు. ప్రజోపయోగం కాని సిఫార్సులను తిరస్కరించే నేతగా ఆయన పేరెన్నిక గన్నారు. ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా 01-05-1967 నుండి 30-06-1972 వరకు ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన గోపాలరెడ్డి, తదనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. బెంగాలీ, హిందీ, ఒరియా, గుజరాతీ మొదలైన ఆంగ్లంతో సహా పదకొండు భారతీయ భాషలలో ప్రావీణ్యం ఉన్న గోపాలరెడ్డి సాహితీ ప్రియులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు భాషా సమితి అధ్యక్షులుగా ఎనలేని సేవలందించారు. రవీంద్రుని రచనలు అనేకం ఆంధ్రీకరించారు. గోపాలరెడ్డి కవిత్వంలో రంగు, రుచి, వాసన అన్నీ ఆయన అనుభవాల సారమే. జీవిత అవసాన దశలోనూ, పండిన వయసున సైతం నిద్రాణమైన జాతిని మేల్కొల్పడానికే ఆయన కలం పట్టారు. వెలుగులు పంచారు. తుది శ్వాస వదిలే వరకు సాహితీ లోకంలో క్రియాశీలంగా ఉన్నారు. నాలుగు విశ్వ విద్యాలయాలు ఆయనను గౌరవ డాక్టరేట్‌లతో సత్కరించాయి. "సాహిత్య బంధువు", "అభినవ భోజుడు" వంటి అనేక బిరుదులు ఆయనను వరించాయి. 1946 నుండి తెలుగు భాషా సమితి అధ్యక్షులుగా వ్యవహరించారు. 1957 నుండి 82 వరకు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీకి అధ్యక్షులుగా 25 సం.లు పని చేశారు. 1978 నుండి కేంద్ర సాహిత్య అకాడమీ కార్యనిర్వాహక సభ్యులు. 1963 నుండి 71వరకు ఎనిమిదేళ్ళు జ్ఞానపీఠ సారథ్య బాధ్యతలు నిర్వహించారు. గోపాలరెడ్డి బహుభాషా కోవిదులు, సాహితీ ప్రియులు. గురువుగా భావించిన టాగోర్ రచనలను ఆంధ్రీకరించారు. వానచినుకులు, ఊర్వశి, నైవేద్యం ఆమె, గులాబీ రేకులు, హంసతూలిక వంటివి ఆయనకు పేరు తెచ్చి పెట్టాయి. నాలుగు విశ్వ విద్యాలయాలు ఆయనను గౌరవ డాక్టరేట్ సత్కరించాయి. అభినవ భోజుడనే బిరుదు పొందిన బెజవాడ గోపాలరెడ్డి 1997 మార్చి 9న తన 88వ ఏట కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# విపణి విస్తరణకు సింగరేణి అడుగులు

గోదావరిఖని : సింగరేణి ఇతర రాష్ట్రాల్లో తన వ్యాపార సామ్రాజ్యం విస్తరణకు అడుగులు వేస్తోంది. కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల స్థాపనకు సిద్ధమైంది. ఇప్పటికే సింగరేణి ప్రాంతాల్లో 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాలతో పాటు 245 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మరిన్ని కేంద్రాలను ఇతర రాష్ట్రాల్లో నెలకొల్పి సంస్థను జాతీయ స్థాయిలో విస్తరించేందుకు యాజమాన్యం ప్రణాళికలు వేస్తోంది. అందుకు అనుగుణంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వ్యాపారాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తుంది.

**సంయుక్తంగా నిర్మాణం**

రాజస్థాన్‌లో సోలార్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు అక్కడి రాష్ట్ర ఇంధన శాఖతో సింగరేణి సోమవారం ఒప్పందం చేసుకుంది. 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇరు పక్షాలు అంగీకారం కుదుర్చుకున్నాయి. ఇందులో రాజస్థాన్ ప్రభుత్వానికి 26 శాతం, సింగరేణికి 74 శాతం వాటాలుగా నిర్ణయించారు. రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ సంస్థ(ఆర్‌వీయూఎన్‌ఎల్), సింగరేణి సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఒడిశాలో కూడా 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు



కేంద్రాలు నెలకొల్పేందుకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ప్రస్తుతం ఒడిశాలోని నైనీ బొగ్గుబ్లాకు తీసుకున్న సింగరేణి అదే ప్రాంతంలో విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసి బొగ్గును అదే ప్లాంటుకు తరలించాలని భావిస్తుంది.

**7650 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరణ**

వచ్చే అయిదేళ్లలో 7,650 మెగావాట్ల అతిపెద్ద విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల సంస్థగా సింగరేణి విస్తరించనుంది. ప్రస్తుతం 1200 మెగావాట్ల థర్మల్ కేంద్రాలు.. 245 మెగావాట్ల సోలార్ కేంద్రాల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. కొత్తగా ప్రణాళికలో సంయుక్త భాగస్వామ్యంతో నిర్మించనున్న థర్మల్ కేంద్రాలను 4000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనుంది. మరో 1500, 205 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు 500 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ హైడ్రో విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉంది.

# పక్కన పడితే కష్టమే

పెద్దపల్లి : పెద్దపల్లిలో ఒకే సమయంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన రహదారి విస్తరణ పనులు 'ఒక అడుగు ముందుకు రెండడుగుల వెనక్కి' అనే చందంగా సాగుతున్నాయి. దీంతో ఆరు నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఏటా విడుదలయ్యే అభివృద్ధి నిధులను ఎప్పటికప్పుడు ఖర్చుచేస్తేనే ప్రగతి వీచికలు ప్రజలకు కనిపిస్తాయి కానీ.. ఏళ్లు గడిచినా పనులు ముందుకు సాగకపోవడంతో నిర్మాణ వ్యయం పెరగడంతోపాటు ప్రజలకు పనుల నిర్వహణ తీరుపై విసుగు కలుగుతోంది. పెద్దపల్లి పురపాలిక పరిధిలో రెండున్నరేళ్ల క్రితం వ్యవసాయ మార్కెట్‌లో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.33.69 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.

**నత్తనడకన..**

జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారుల విస్తరణ, మురుగుకాలువల నిర్మాణ పనులు ఆరు నెలలుగా కొనసాగుతున్నాయి. వీటిలో ఎల్లమ్మ గుడివైపు రహదారి మినహా మిగిలినవి పూర్తి కాలేదు. విద్యుత్తు సంస్థతో సమన్వయ లోపం కారణంగా స్తంభాలు తొలగించకుండానే మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. వివిధ ప్రాంతాలలో ఇళ్ల తొలగింపు ప్రక్రియ కూడా వివాదాస్పదం అవుతుండటం ఆటంకంగా మారుతోం



ది. వ్యాపార కేంద్రమైన శంకర్‌గంజ్, జెండా కూడలీ ప్రాంతాల్లో నెలలు తరబడి పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**పూర్తయిన పెద్ద పనులే లేవు..**

పెద్దపల్లిలోని కూరగాయల మార్కెట్ విస్తరణ పనుల కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి నిధులు కేటాయించారు.పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టగా వీటిలో రూ.4.20 కోట్లతో ప్రస్తుత కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది కానీ.. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి కూడా ఈ పనులు చేపట్టే అవకాశం కనిపించడం లేదు.రూ.25.80 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన 9 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.డీఎంఎఫ్‌టీ నిధులు రూ.3.03 కోట్లతో చేపట్టిన పనుల్లో 90 శాతం పనులు జరిగాయి. రూ.28 లక్షలతో చేపట్టిన మూడు చిన్నపనులు మాత్రమే పూర్తి చేశారు.

కూరగాయల మార్కెట్ విస్తరణ పనులు మాత్రమే మొదలు కాలేదని.. డిజైన్‌పై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని.. నిధులు ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో వెనక్కిపోవని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ పేర్కొన్నారు.

# గుట్టుగా తవ్వేస్తున్నారు..!



హుజూరాబాద్ : గుట్టు చప్పుడు కాకుండా తవ్వేస్తున్నా మట్టి అక్రమార్కులకు సిరులు కురిపిస్తోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు ఎందుకు చూడటం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇకనైనా మట్టి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సాగుతోంది ఇలా..**

హుజూరాబాద్ మండలం సిర్సపల్లి శివారులోని పాండవుల గుట్టతోపాటు సమీప గుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. యంత్రాల సాయంతో ట్రాక్టర్లు, లారీల ద్వారా ఈ దందా నడిపిస్తున్నారు. ఇక్కడి నుంచి జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, సైదాపూర్ మండలాలకు రవాణా చేస్తున్నారు. ట్రిప్పుకు దూరాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2500ల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

మట్టి దందా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల తహసీల్దార్ కనుకయ్యకు సమాచారం రావటంతో తానే స్వయంగా వాహనాన్ని నడుపుకొంటూ పాండవుల గుట్ట వద్దకు వెళ్లారు. ఆయన వస్తున్నారనే సమాచారం తెలుసుకోవడం.. అక్రమార్కులు అక్కడి నుంచి పరారవడం.. అక్రమార్కుల ఇన్‌ఫార్మర్ వ్యవస్థ పటిష్ఠతను తెలియపరుస్తోంది.నిత్యం వందలాది ట్రిప్పుల మట్టిని అక్రమంగా విక్రయిస్తున్నారు. గ్రామ శివారులోని గుట్టలే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఎక్కడ మట్టి కనబడితే చాలు అక్కడికి యంత్రాలు చేరుకుంటున్నాయి. వారిని అడిగే నాథుడే కరవయ్యారు. రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు మట్టిని తరలిస్తున్న వాహనాలు పట్టుకుంటే ప్రజాప్రతినిధుల నుంచి అధికారుల మీద ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని సమాచారం.

జాతీయ రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. సదరు నిర్మాణ కంపెనీ ఈ గుట్టల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తీస్తున్నారని సమీప గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇష్టానుసారంగా మట్టిని తీయటంతో లోతైన గోతులు ఏర్పడ్డాయని.. మైనింగ్ అధికారులు ఇటువైపే చూడటం లేదని చెబుతున్నారు.

శంకరపట్నం మండలం మెట్‌పల్లి, కరీంపేట, తాడికల్, మొలంగూరు గ్రామాల సమీపంలోని గుట్టలతోపాటు కాకతీయ ప్రధాన కాలువల సమీపంలోని మట్టి నిల్వలను వదిలిపెట్టలేదు. చీకటి పడితే చాలు.. ట్రాక్టర్లలో తరలింపు కొనసాగుతోంది.

మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని హుజూరాబాద్ ఎమ్మార్వో కనుకయ్య తెలిపారు. అక్రమంగా మట్టి తీయటం నేరమని.. చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

ముందుగా మైనింగ్ శాఖకు టెంపరరీ పర్మిట్‌తో దరఖాస్తు చేసుకోవాలి. కావాల్సిన పరిమాణాన్ని అందులో నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.దరఖాస్తు పరిశీలన కోసం ఆ మండల తహసీల్దార్‌కు నివేదిస్తారు.తహసీల్దార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఎన్‌వోసీ జారీ చేసిన తర్వాతే మట్టి తీయాలి ఇదంతా 5 నుంచి 10 రోజుల్లో పూర్తి కావాల్సి ఉంటుంది.

# వనరులు అడుగంటి వన్యప్రాణుల విలవిల



సిరిసిల్ల : రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫలితంగా అడవుల్లో నీటి వనరులు అడుగంటిపోతున్నాయి. ఊట కుంటలు, చెక్‌డ్యాంలలో నీటి జాడలు కనుమరుగవుతున్నాయి. వేసవి కాలంలో వన్యప్రాణుల మనుగడకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉండగా నిధుల లేమితో ఆయా పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అడవి జంతువులు దాహార్తితో అల్లాడుతున్నాయి. నీటికోసం జనారణ్యంలోకి వస్తున్నాయి. జిల్లాలో చందుర్తి, మల్యాల, సిరిసిల్ల అటవీక్షేత్రాల పరిధిలో 12 సెక్షన్లు ఉన్నాయి. 44 బీట్‌లలో సుమారు 27 వేల హెక్టార్లకు పైగా అటవీ విస్తీర్ణం ఉంది. ప్రధానంగా వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ఎక్కువ శాతం అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో 2017-18 సంవత్సరంలో వన్యప్రాణి గణన చేపట్టారు. అడవుల్లో నీటి వనరులను పరిశీలిస్తే రాతి కట్టడాలు 178, పర్కొలేషన్ ట్యాంకులు(చిన్న, పెద్దవి)116, సాసర్‌పిట్లు 120 ఉన్నాయి.

**నిధులు వస్తేనే పనులు**

వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. అడవుల వృద్ధితోపాటు వన్యప్రాణి సంరక్షణకు గతంలో అటవీశాఖ నీటి వనరులను అభివృద్ధి చేసింది. నీటి జాడలు లేని ప్రాంతాల్లో 4 నుంచి 6 చదరపు కిలోమీటర్లకు ఒకటి చొప్పున సాసర్‌పిట్లను ఏర్పాటు చేశారు. రూ.లక్షల నిధులతో చెక్‌డ్యాంలు, రాక్‌ఫిల్‌డ్యాంలు, సోలార్‌పంపు సెట్లు తదితరాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణతోపాటు మరమ్మతులకు అటవీశాఖకు భారీగా ఖర్చవుతుంది. ప్రభుత్వం నుంచి రెండేళ్లుగా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టడం గగనంగా మారింది. అయిదు సోలార్ పంపు సెట్లలో నీటి లభ్యత క్రమంగా తగ్గుతుండగా కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా చేసే అవకాశాలు ఉన్నా ఇంధన కొనుగోలు భారంగా మారుతోంది. కొన్నిచోట్ల బీట్ అధికారులు, సెక్షన్ అధికారులు సొంత డబ్బులను వెచ్చిస్తున్నారు.

**తప్పని ముప్పు**

అడవుల్లో నీటి లభ్యత లేకపోవడంతో దప్పిక తీర్చుకునేందుకు వణ్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. పంట పొలాలను ధ్వంసం చేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వనాలు వీడే ప్రాణులను హతమార్చేందుకు వేటగాళ్లు మాటు వేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఇటీవల గంభీరావుపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి దుప్పి మాంసాన్ని విక్రయిస్తూ అధికారులకు పట్టు బడ్డాడు. సిరిసిల్ల రేంజ్ పరిధిలో ఏడుగురిపై కేసులు సైతం నమోదయ్యాయి. గతేడాది వీర్నపల్లి మండలంలో మూడు దుప్పులు శునకాల దాడిలో మృతిచెందాయి.

నీటి వసతి కల్పిస్తున్నాం అడవుల్లో వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. నిర్వహణ విషయంలో నిధుల కొరత వాస్తవమే. అయినప్పటికీ సాసర్‌పిట్లలో నీటిని నింపుతున్నాం. అడవి జంతువుల దాహార్తి తీర్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. వణ్యప్రాణులకు ముప్పు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. వన్యప్రాణుల దాడిలో నష్టం జరిగితే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. పరిశీలించి పరిహారం ఇప్పించేలా చూస్తాం.శ్రీహరి ప్రసాద్, అటవీక్షేత్రాధికారి సిరిసిల్ల

# ప్రధాన పంట వరి

జగిత్యాల : నీటి లభ్యతతో ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలోనూ వరి ప్రధానపంటగా నిలిచింది. నవంబరు నుంచి ఫిబ్రవరి 15 వరకు రైతులు పెద్దఎత్తున వరినాట్లు వేయగా విస్తీర్ణం రీత్యా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉమ్మడి నల్గొండ జిల్లా తరువాత రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచినట్లు వ్యవసాయశాఖ తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సాధారణం కన్నా 27 శాతం

వరకు అధిక వర్షపాతం నమోదు, భూగర్భ జలలభ్యత, ఆయకట్టుకు శ్రీరాంసాగర్, ఎల్ఎండీ తదితర ప్రాజెక్టు నీటిని విడుదల చేయటం, వరదకాలువలో నీటినిల్వ తదితర కారణాలతో రైతులంతా వరిసాగుకే మళ్లారు. ఇతర పంటలకు కూలీల కొరత, వణ్యప్రాణులు, కోతుల బెడద, ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య ఉండగా కనీస మద్దతు ధరకు దొడ్డు ధాన్యం సేకరణ, సన్నాలకు బోనస్ చెల్లింపు తదితర కారణాలతో మెజారిటీ రైతులు వరివైపే మొగ్గారు. నాలుగు జిల్లాల్లో 2022లో యాసంగిలో 6.64 లక్షల ఎకరాల్లోనే రైతులు వరిని సాగుచేయగా 2023లో 9.33 లక్షల ఎకరాల్లో, నిరుడు 9.15 లక్షల ఎకరాల్లో, ఈ యాసంగిలో 8.83 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.నాలుగు జిల్లాల్లోనూ 84 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా తదుపరి నువ్వు, ఆవాలు, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, కంది, పెసర, మినుము, ఆయిల్‌పామ్, కూరగాయలు తదితర పంటలను విత్తుకున్నారు. వరిపంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయగా ఎండవేడిమి పెరగటంతో భూగర్భ జలమట్టం తగ్గి నీటితడులు సమస్యగా మారగా చివరి ఆయకట్టుకు ఆశించినట్లుగా కాలువనీరు వెళ్లటం లేదు. రాత్రి చలి, పగటిపూట ఎండవేడిమితో పోషకలోపాలు, చీడపీడల సమస్యకూడా పెరిగి వరి రైతులు పలుమార్లు సస్యరక్షణ చర్యలను చేపట్టాల్సి వచ్చి తల్లడిల్లుతున్నారు. మరోవైపు ఎల్లంపల్లి నుంచి నీటిని పూర్తిస్థాయిలో ఎత్తిపోసే వీలు లేకపోవటంతో ఎస్సారెస్పీపైనే భారం పడినా.. ఎస్సారెస్పీలోనూ నీటినిల్వ తగ్గుతుండటం ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో విద్యుత్, సాగునీరు, చీడపీడల సమస్యను అధిగమించి ధాన్యాన్ని సగటు స్థాయిలో ఉత్పత్తి చేయటం రైతులకు సవాలుగా మారింది. ఇప్పటినుంచి విద్యుత్, సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటేనే పంటను సజావుగా పూర్తిచేయగలుగుతారు.

# ఆర్థిక స్వావలంబన... ఆరోగ్య రక్షణ

బోయినపల్లి : స్వశక్తి మహిళా సంఘాల్లోని సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోంది. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ లక్ష్యాలు సాధించే విధంగా కృషి చేస్తున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించే విధంగా తాజాగా అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు.

**మహిళా సంఘాల సభ్యులకు అవగాహన**

జిల్లాలో 9854 స్వశక్తి సంఘాలు ఉండగా సుమారు 1,14,462 మంది సభ్యులు ఉన్నారు. సంఘాల్లోని సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు అందిస్తున్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుంటూ సభ్యులు కిరాణ, కుట్టు మిషన్, వస్త్ర దుకాణం ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. తీసుకున్న రుణంతోపాటు వడ్డీ కలిపి ప్రతినెలా బ్యాంకులో వాయిదాలు చెల్లిస్తున్నారు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడుతున్నారు. కాగా మహిళా సంఘాల్లోని సభ్యులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. అనేక మంది క్యాన్సర్, థైరాయిడ్, మూత్రకోశ, రక్తహీనత, అధిక బరువు, మధుమేహం, ఇతర వ్యాధులతో బాధపడుతున్నారు. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ



అనారోగ్య సమస్యలను చెప్పుకునే విధంగా అవగాహన కల్పించడంతోపాటు వాటి బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఏపీఎం, సీసీ, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులకు ఐసీడీఎస్, వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏ, గ్రామైక్య సంఘం పదాధికారులకు, ఆరోగ్య కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్యవంతంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడంతోపాటు వ్యాయామం చేయడం, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాలు, లభించే పోషకాహారం, వ్యాక్సినేషన్ గురించి వివరిస్తున్నారు. గ్రామాల్లోని స్వశక్తి మహిళా సంఘం సభ్యుల సమావేశంలో ఆరోగ్య అంశం ఎజెండాగా చేర్చాలని నిర్ణయించారు. సమావేశంలో వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడం, తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని వీవోఏలకు అధికారులు సూచిస్తున్నారు.

**తరచూ కార్యక్రమాలు నిర్వహించాలి**

**వజ్రవ్వ, వరదవెల్లి**

ఆర్థికంగా ఎదగడంతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇది మహిళా సంఘాల సభ్యులకు ఎంతగానో మేలు చేస్తుంది. మా సమస్యలు తెలుసుకొని పరిష్కారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడం సంతోషం. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**ప్రత్యేకంగా వివరిస్తున్నాం**

**జయసుధ, ఏపీఎం**

మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏ, గ్రామైక్య సంఘం పదాధికారులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించాం. సంఘం సభ్యుల అనారోగ్య సమస్యలు తెలుసుకోవడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర అంశాలపై వివరించాం. గ్రామాల్లో నిర్వహించే స్వశక్తి సంఘాల సమావేశాల్లో సభ్యులకు అంగన్వాడీ, వైద్య సిబ్బందితో అవగాహన కల్పించాలని ప్రత్యేకంగా వివరిస్తున్నాం. దీనివల్ల మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది.

# ఆదాయం అంతంతే

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఏటా జరిగే మహాశివరాత్రి జాతరకు యంత్రాంగం కోట్ల రూపాయలను భక్తుల సౌకర్యాల కోసం వెచ్చిస్తోంది. కాగా ఖర్చుకు తగిన ఆదాయం రావడం లేదు. గత నెల 25 నుంచి 27 వరకు ఆలయంలో మహాశివరాత్రి వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి దాదాపు నాలుగు లక్షల మంది భక్తులు వస్తారని అంచనాతో ఆధ్యాత్మికత ఉట్టి పడేలా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ ఆ స్థాయిలో భక్తులు రాలేదు. మూడు రోజుల వేడుకలకు సుమారు మూడున్నర లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుని వివిధ రకాల మొక్కులు చెల్లించుకుని వెళ్లారు. అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ వేడుకలకు రూ.2.03 కోట్ల నిధులు వెచ్చించారు. వేడుకలు ముగిసిన తరువాత స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.1,31,89,177ల ఆదాయం సమకూరింది. హుండీల లెక్కింపుతో మరో రూ.కోటికి పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.

**ఎక్కువ వ్యయం తాత్కాలిక ఏర్పాట్లకే...**

మహాశివరాత్రి జాతరలో ఏటా చాలా వరకు తాత్కాలిక పనులకు రూ.కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు. శాశ్వత నిర్మాణ పనులపై అధికారులు దృష్టి సారించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఏటా చలువపందిళ్లు, కలకత్తా పెండాళ్లు, అద్దె ప్రాతిపదికన సీసీ కెమెరాలు, శివార్చన వేదిక వద్ద అద్దె ప్రాతిపదికన ఏర్పాట్లు, లైటింగ్, సూచిక బోర్డులు, కమాన్, ప్రత్యేక క్యూలైన్లు వంటి తదితర వాటికి నిధులు భారీగానే వెచ్చిస్తున్నారు. మహాశివరాత్రి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ కోసం ఆయా ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి భక్తులకు సకల సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నప్పటికీ అధికారుల అంచనా మేరకు భక్తులు, ఆదాయం రావడం లేదు. ప్రతి ఏటా ఇదే తంతు కొనసాగుతోంది. వేములవాడకు వచ్చేవారికి అవసరమైన వసతి గదులు, క్యూలైన్లలో మౌలిక వసతులు, సులువుగా స్వామివారి దర్శనం తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

**శాశ్వత పనులకు అవకాశం లేదు**

మహాశివరాత్రి జాతర సందర్భంగా చేపట్టే ఏర్పాట్లలో శాశ్వత పనులు చేపట్టడానికి వీలు లేదు. ఇందులో కలకత్తా పెండాళ్లు, చలువ పందిళ్లు, లైటింగ్, కమాన్, వంటివి ఆలంకరణ కోసమే ఏర్పాటు చేస్తున్నాం. శాశ్వత పని చేయాలంటే మాస్టర్ ప్లాన్‌ను అనుసరించాల్సి నిర్మాణాలు చేయాల్సి ఉంది. రఘునందన్, డీఈ రాజన్న ఆలయం

# పారదర్శక అనుమతులు.. పక్కాగా నిర్మాణాలు

హైదరాబాద్: పురపాలిక తరహాలోనే గ్రామ పంచాయతీల్లో కూడా తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సేల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (టీజీబీపాస్)ను ప్రవేశపెట్టారు. దీంతో గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల్లో ప్రజాప్రతినిధుల జోక్యం తగ్గిపోవడంతో పాటు అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడనుంది. టీఎస్‌బీపాస్ విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించారు. చేర్పులు, మార్పులతో గ్రామీణుల ముంగిటకు వచ్చింది. వేయి కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలు 197: జిల్లాలో పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలుండగా, వేయి కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలు 197, ఐదు వేల జనాభాకు పైగా ఉన్న గ్రామ పంచాయతీలు 10 ఉన్నాయి. కొత్త విధానం ద్వారా ఇకమీదట



పురపాలిక పరిధిలో అమలవుతున్న మాదిరిగానే భవన నిర్మాణాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ప్రస్తుతం ఈ-పంచాయతీ ద్వారా 300 గజాల వరకు స్థలం ఉండి నిర్మాణాల అనుమతికి దరఖాస్తు చేసుకుంటే కార్యదర్శులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తున్నారు.

**దరఖాస్తు చేసిన వెంటనే పరిశీలన**

టీజీబీపాస్ ద్వారా ప్రస్తుతం పురపాలికల్లో భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. మీసేవలో ప్లాట్ల వివరాలతో కూడిన దస్తావేజులను పొందుపర్చి టీజీబీపాస్‌కు దరఖాస్తు చేయగానే అక్కడి అధికారి పరిశీలిస్తారు. పురపాలకలోని పట్టణ ప్రణాళిక, నీటిపారుదల, ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో కూడా 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నారు.

**సాంకేతిక సమస్య తలెత్తితే ఏంచేయాలి**

టీఎస్‌బీపాస్‌తో గ్రామాలకు ఉపయోగం ఉన్నా సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు. అధికశాతం గ్రామాల్లో మీసేవ కేంద్రాలు అందుబాటులో లేవు. దస్తావేజుల కోసం మండల కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాల్సి వస్తోంది. టీజీబీపాస్ ద్వారా తిరస్కరించిన దరఖాస్తుల రుసుము తిరిగి రాదు. దీంతో చేసే పనినే జాగ్రత్తగా చేయాల్సి ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. గ్రామాల్లోనూ సెట్ బ్యాక్, అంతర్గత రహదారులు తప్పనిసరిగా 30 అంగుళాలు ఉండాలన్న నిబంధనలు పాటించాలి. మండల కేంద్రాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తుండటంతో అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారుతున్నాయి. ప్రభుత్వం అమలు చేయనున్న టీజీబీపాస్ ద్వారా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు వివరిస్తున్నారు.

# ఉద్యాన పంటలకు ప్రోత్సాహమేదీ..!

ఎల్లారెడ్డిపేట : జిల్లాలోని నేలల స్వభావం అన్ని రకాల పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. గత కొంత కాలంగా సాగునీటి లభ్యత అనుకూలంగా ఉండటంతో పంటల సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. కాగా జిల్లా రైతులు వరిసాగువైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం అంతంతమాత్రంగా ఉండటంతో ఉద్యాన, ఆరుతడి పంటల సాగుకు దూరంగా ఉంటున్నారు. వన్యప్రాణులు, కోతుల బెడద కూడా అందుకు కారణమవుతోంది.

**6756 ఎకరాలకే పరిమితం**

1,87,464 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన జిల్లాలో 1,01,062 సాగుకు యోగ్యమయ్యే భూములున్నాయి. ఇందులో చెరువులు, కుంటల కింద 15,175 హెక్టార్లు, బోర్లు, బావుల కింద 25,212 హెక్టార్లు సాగులోకి వస్తుండగా వర్షాధార సాగుభూములు మరో 45,400 హెక్టార్లు ఉన్నాయి. ఈ యాసంగిలో అత్యధికంగా 1,77,250 ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారు. ఇతర ఆరుతడి పంటలైన గోధుమ 52 ఎకరాలు, మొక్కజొన్న 1693, పెసర 13.2, శనగ 180, వేరుశనగ 25.2, నువ్వులు 146, పొద్దుతిరుగుడు 1046 ఎకరాలను మాత్రమే సాగుచేశారు. ఇక జిల్లాలో ఉద్యాన పంటల సాగు 6756 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. ఉద్యాన పంటల సాగుపై రైతుల్లో అవగాహన కొరవడింది. జిల్లాలో వన్యప్రాణుల స్వైర విహారంతో కూరగాయలు, ఉద్యాన పంటల సాగుకు తీవ్ర విఘాతం కలుగుతోంది. మొక్కజొన్న, శనగ, వేరుశనగ, సోయాబీన్, పొద్దుతిరుగుడు, కందులు, పెసలు, కూరగాయల పంటలు, పండ్ల తోటలపై వానరాలు, అడవిపందులు, ఇతర అడవి జంతువుల దాడితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో అనేక మంది రైతులు వరి మినహా ఇతర ఉద్యాన పంటల సాగు జోలికి వెళ్లడం లేదు.

**కొన్ని రకాలకే రాయితీ...**

జిల్లాలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 24 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నా 16 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 35 ఎకరాలకు సరిపడా కూరగాయల నారును అందించారు. మల్చింగ్‌షీట్‌కు ప్రభుత్వం ఎకరానికి రూ.6400 రాయితీ ఇస్తుండగా 82 ఎకరాల లక్ష్యానికి గాను 75 ఎకరాలకు అందజేశారు. సిద్దిపేట జిల్లా ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఏ) నర్సరీ నుంచి టమాటా, మిర్చి, వంకాయ నారును మాత్రమే నూరుశాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తోంది. గత మూడు సంవత్సరాల్లో 712 మంది రైతులు 2150 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగుచేశారు.

**అవగాహన కల్పిస్తున్నాం**

ఉద్యాన పంటల సాగులో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. మామిడి, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్ తోటలు పెంచేందుకు ఎక్కువ లక్ష్యాన్ని ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పందిరి సాగును ఎక్కువగా ప్రోత్సహించాలని విన్నవిస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 300 యూనిట్ల తుంపర సేద్యం, 150 ఎకరాలకు బిందు సేద్యం పరికరాల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేశాము. లత, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# ఎల్ఆర్ఎస్‌కు సాఫ్ట్‌వేర్ కష్టాలు



హైదరాబాద్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)ను సాఫ్ట్‌వేర్ కష్టాలు వెంటాడుతున్నాయి. అకస్మాత్తుగా డేటా మాయం కావడం.. కొంత సమయం తర్వాత మళ్లీ ప్రత్యక్షం కావడం లాంటి పరిస్థితి ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. సాంకేతిక ఇబ్బందులు వల్ల ప్రక్రియ వేగంగా ముందుకు వెళ్లడం లేదు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి సెంటర్ ఫర్ గుడ్‌గవర్నర్స్(సీజీజీ) సాఫ్ట్‌వేర్‌ను అందిస్తోంది. ఈ లోపాలను సరిదిద్దేందుకు యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని చెబుతున్నారు.

**ఇప్పటివరకు 10వేల లోపు మాత్రమే..**

హెచ్‌ఎండీఏలోని ఆరు జోన్ల పరిధిలో 3.2 లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం 10వేల వరకు మాత్రమే పరిశీలించి ఫీజు చెల్లింపు నోటీసులు జారీ చేశారు. ప్రత్యేకంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన.. పరిష్కారం కోసం 67 మంది సిబ్బందిని కూడా రంగంలోకి దించారు. క్షేత్రస్థాయి పరిశీలన, రెవెన్యూ, ఇరిగేషన్ నుంచి ఎన్‌వోసీ జారీ ప్రక్రియలో వేగం పెరగాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో తప్పుల కారణంగా చాలా దరఖాస్తులు పెండింగ్‌లో పెడుతున్నారని వాపోతున్నారు. కొన్ని లేఅవుట్లలో నీటి కుంటలు, చెరువులు ఉన్నట్లు మార్కు చేసి ఉంటున్నాయి. క్షేత్రస్థాయిలో అక్కడ నీటి వనరులు కనిపించడం లేదు. ఇలాంటి దరఖాస్తులను తదుపరి పరిశీలన కోసం పెండింగ్‌లో పెట్టడంతో పరిష్కారానికి నోచుకోవడం లేదు. వాస్తవానికి 200 మీటర్లలోపు నీటి వనరులు ఉన్నవాటిని తిరస్కరిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. నీటి వనరులు లేకుండానే ఎన్‌వోసీ తెచ్చుకోవాలని సూచిస్తుండటంతో చాలామంది అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**ఆన్‌లైన్‌లోనే ప్రొసీడింగ్స్ జారీ**

ఎలాంటి వివాదాలు లేని ప్లాట్లకు ఫీజులు చెల్లించాలని దరఖాస్తుదారులకు సమాచారం అందుతోంది. చాలామంది ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లిస్తున్నారు. మార్చి 31వ తేదీ లోపు ఫీజులు చెల్లించిన వారికి 25శాతం రాయితీ రానుండటంతో చాలామంది ముందుకొస్తున్నారు. శివార్లలో మార్కెట్ ధర తక్కువగా ఉన్న ప్రాంతంలో 280 చదరపు గజాల ప్లాట్లు ఉన్న వ్యక్తికి మొత్తం ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.19,197 కాగా.. ఇందులో రూ.6,535 రాయితీ కింద హెచ్‌ఎండీఏ ప్రకటించింది. మార్కెట్ ధర రూ.2 వేలు ఉన్న ప్రాంతంలో రిబేట్ రూ.60వేలకు పైనే పొందే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు వారం రోజుల్లోనే ఆన్‌లైన్‌లోనే ప్రొసీడింగ్స్ జనరేట్ అవుతుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దానిని డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుందన్నారు.

# దారికి రాక.. పనులు దరిచేరక



హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీ కాలనీల్లో కొత్త రోడ్డు వేస్తోందని సంబరపడ్డారు. పనులు మొదలుకాగానే కష్టాలు తీరుతున్నాయని మురిసిపోయారు. కానీ ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదు. పనుల్లో జాప్యమే ఇప్పుడు స్థానికులకు శాపంగా మారింది. ఇంజినీర్ల నిర్వాకంతో..ఓ వైపున నాసిరకం పనులు, మరో వైపు అసంపూర్తి పనులు నగరవాసులకు సమస్యగా పరిణమిస్తున్నాయి. రెండు, మూడేళ్ల తర్వాత పూర్తి చేసినట్టు గుత్తేదారులు బిల్లులు పెడుతున్నా.. వాటా తీసుకుని ఇంజినీర్లు ఆమోదం తెలుపుతున్నారు. ఇటీవల అలాంటి రూ.150 కోట్ల విలువైన బిల్లులు రావడంతో కమిషనర్ ఇలంబర్తి విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

**కేంద్ర కార్యాలయం నిఘా పెడితేనే..** సర్కిళ్లు, డివిజన్ల వారీగా టెండర్ల ప్రక్రియ ముగిశాక.. ఆరు నెలలైనా పూర్తవ్వని రోడ్డు నిర్మాణ పనులను ఉన్నతాధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది. కొందరు గుత్తేదారులు టెండర్లు ఆహ్వానించని ప్రాంతాల్లోనూ పనులు చేస్తామంటూ రోడ్లను తవ్వేసి వదిలేస్తున్నారు. కేంద్ర కార్యాలయం వాటి లెక్క తేల్చి గుత్తేదారుల లైసెన్సు రద్దు చేయాలని, ఇంజినీర్లపై వేటువేయాలని ప్రజలు కోరుతున్నారు. **ఇవిగో ఉదాహరణలు..**

మన్సూరాబాద్ డివిజన్ వివేకానందనగర్ కాలనీలో రెండేళ్ల కిందట రెండు వీధుల్లో రూ.50లక్షలతో రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. గుత్తేదారు మట్టి రోడ్డును తవ్వేసి.. కంకర, రాతి ఇసుక మిశ్రమాన్ని పరిచారు. కాలనీ లేఅవుట్ విషయమై వచ్చిన ఫిర్యాదును సాకుగా చూపుతూ ఇంజినీర్లు పని ఆపేశారు.

ముషీరాబాద్ డివిజన్ భారత్ సేవా సమాజ్ వీధిలో రెండున్నర నెలల కిందట రూ.20.70లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. గుత్తేదారు గల్లీలోని పాత సీసీ రోడ్డును తవ్వేశారు. వ్యర్థాలను వీధిలోనే కుప్పగా పోశారు. అప్పట్నుంచి కాంట్రాక్టరు అటు వైపే చూడట్లేదు.

ముషీరాబాద్ అజార్‌గల్లీలోనూ రూ.8లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనుల కోసం రోడ్డును తవ్వి.. పనులను అసంపూర్తిగా వదిలేశారు.

కవాడిగూడ డివిజన్ మల్లయ్య వీధిలో ఆర్య సమాజ్ స్కూలు ఎదురుగా చేపట్టిన కాలనీ రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది.

కొత్తపేట డివిజన్ గాయత్రినగర్ నుంచి ఎస్ఆర్ఎల్ కాలనీ మీదుగా సత్యనగర్ వరకు వెళ్లే ట్రంక్‌లైన్ నిర్మాణం అసంపూర్తిగా నిలవడంతో.. తవ్విన రోడ్డు అరకిలోమీటరు పొడవున స్థానికులకు నరకం చూపుతోంది.

# నెలకో కంపెనీ.. సింథటిక్ డ్రగ్స్ కహానీ!



హైదరాబాద్ : నగర శివారులో ఖాయిలాపడిన పరిశ్రమను అద్దెకు తీసుకొని డైజోఫాం తయారుచేశారు. నిత్యం సుమారు 100కిలోల సరకు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్ణాటక, తమిళనాడు సరఫరా చేశారు. ఇక్కడ పోలీసులకు చిక్కాక మకాం విజయవాడకు మార్చారు. గతేడాది పోలీసుల తనిఖీల్లో ప్రధాన నిందితుడు అరెస్ట్‌కావడంతో గుట్టు వెలుగు చూసింది. ఇదే తరహాలో బీబీనగర్‌లో అంతర్జాతీయ మత్తురాకెట్ బండారం టీజీన్యాబ్ బృందం బట్టబయలు చేసింది. 120 కిలోలకుపైగా ఎఫిడ్రిన్‌ను స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.100 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. విదేశాల్లోని డ్రగ్‌డాన్‌లు పథకం ప్రకారం రాజధాని, శివారు ప్రాంతాల్లో సింథటిక్ డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

**ఏం జరుగుతోందంటే..:** రాజధాని చుట్టుపక్కల ప్రాంతాలు, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలో పలు ఫార్మాకంపెనీలున్నాయి. నిర్వహణ భారం, నష్టాలతో కొన్ని మూతపడ్డాయి. కొన్ని అరకొరగా కొనసాగుతున్నాయి. ఇక్కడి యంత్రాలు, ప్రయోగశాలలను మత్తుముఠాలు తమకు అనువుగా మలచుకుంటున్నాయి. యజమానుల నుంచి అద్దెకుతీసుకొని ఎండీఎంఏ, ఎఫిడ్రిన్, అల్ప్రాజోలం, డైజోఫాం వంటి సింథటిక్ డ్రగ్స్ తయారుచేస్తున్నారు. అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌తో సంబంధాలున్న కింగ్‌పిన్‌లు తెరవెనుక నుంచి చక్రం తిప్పుతుంటారు. దళారుల ద్వారా కార్యకలాపాలు చక్కబెడుతున్నారు. దుబాయ్, సింగపూర్, తైవాన్‌లో ఉన్న సూత్రధారులు ముంబయి, దిల్లీ, గోవాల్లో స్మగ్లర్లను దళారులుగా రంగంలోకి దింపుతున్నారు. వారి ద్వారా నష్టాల్లో ఉన్న కంపెనీల జాబితా సేకరిస్తున్నారు. ఆయా సంస్థల యజమానులు, ప్రయోగశాలలో పనిచేసే ఉద్యోగులతో మంతనాలు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.10-20 లక్షలు అద్దె చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. అక్రమ కార్యకలాపాలకు అంగీకరించిన కంపెనీల పేరిట ముడిసామగ్రి కొనుగోలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో సింథటిక్ డ్రగ్స్ తయారు చేస్తున్నారు.

**ఒకరికొకరు తెలియకుండానే**

ఓ ఫార్మా యూనిట్‌లో తయారైన డ్రగ్స్‌ను ఒక కారులో భద్రపరుస్తారు. 20-30 కిలోమీటర్ల దూరం వెళ్లాక మరో కారులోకి మారుస్తారు. రాష్ట్ర సరిహద్దుల్లో మరో బండిలోకి చేరవేస్తారు. సరకు గమ్యంచేరే వరకు 5-6 వాహనాలు మారుతాయి. భిన్నమైన వాహనాలు, డ్రైవర్లు, ఏజెంట్లు వీరిని అనుసరిస్తూ ఎస్కార్ట్‌గా మరో కారు. ఒకరికొకరు తెలియకుండా నిర్దేశిత ప్రాంతానికి మాదకద్రవ్యాలు చేరవేయటం వీరి ప్రత్యేకత. విదేశాల నుంచే అక్కడి నంబర్లతో వాట్సప్, టెలిగ్రాం యాప్‌ల ద్వారా ఇక్కడున్న వారికి దిశానిర్దేశం చేస్తారు. ముంబయి, గోవా, దిల్లీ, బెంగళూరు చేరిన సరకు వివిధ మార్గాల్లో ఇతర దేశాలకు రవాణా అవుతున్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. పరిశ్రమలు మారుమూల ప్రాంతాల్లో ఉండటం, మూసివేశారనే అభిప్రాయంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. 15-30 రోజులకో ప్రాంతంలో యూనిట్‌ను అద్దెకు తీసుకోవటం ఈ స్మగ్లర్ల ప్రత్యేకత.

# పారిశ్రామిక వాడ.. ఉపాధి జాడ

తాండూరు : జిల్లాలో అతిపెద్ద పట్టణంగా పేరున్న తాండూరును వాయు కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా పట్టణానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న తాండూరు మండలం జిన్‌గుర్తి గ్రామ పరిధిలో కేటాయించిన ప్రభుత్వ భూముల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు సంబంధించిన మౌలిక వసతులను ప్రారంభించింది. ఈ భూముల్లో ప్రభుత్వం పారిశ్రామిక యూనిట్లను బ్లాకులుగా ఏర్పాటు చేయనుంది. బ్లాకులు వారిగానే మౌలిక వసతులను కల్పిస్తారు. ఇవి పూర్తికాగానే నాపరాళ్ల పాలిష్ యూనిట్ల యజమానులకు వారి ఆసక్తిని బట్టి బ్లాకులను కేటాయిస్తారు.



**రోడ్లపై తొలగనున్న వ్యర్థాల బెడద**

తాండూరులోని నాపరాళ్ల పాలిష్ యూనిట్లు, కటింగ్ యంత్రాల యూనిట్ల నుంచి నిత్యం వేల టన్నుల్లో వ్యర్థాలు సుద్దలు, ముక్కల రూపంలో బయటికి వస్తున్నాయి. వీటిని యజమానులు సమీపంలోని రోడ్లు, ప్రభుత్వ స్థలాలు, జల వనరుల్లో గుమ్మరిస్తున్నారు. వీటి కారణంగా కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక వాడలోకి మారే యూనిట్లలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు అక్కడే రీసైక్లింగ్ చేసే ప్లాంటును ఏర్పాటు చేస్తారు. 53 ఏళ్ల కిందట పేదలకు పంపిణీ చేసిన భూములు జిన్‌గుర్తిలోని ప్రభుత్వ భూమిని 53 ఏళ్ల కిందట పేదలకు పంపిణీ చేసింది. ఇందులో కొందరు వ్యవసాయం చేస్తే ఇంకొందరు ఖాళీగానే ఉంచారు. కాలుష్యం తగ్గించేందుకు వచ్చే ఏడాది నుంచి బ్లాకుల కేటాయింపు

– శేషగిరి, పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ అధికారి పారిశ్రామిక వాడలో మౌలిక వసతుల ఏర్పాటు పూర్తి కాగానే నాపరాళ్ల యూనిట్ల యజమానులకు బ్లాకులను కేటాయిస్తాం. తాండూరు పట్టణంలో వాయుకాలుష్యం పూర్తిగా తగ్గించాలనే ఉద్దేశంతో నాపరాళ్ల యూనిట్లను ప్రభుత్వం పారిశ్రామిక వాడలోకి మారుస్తోంది.

# స్థలం లేని పేదలకు గూడేదీ?

కరీంనగర్ : గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇంటిని కట్టించేందుకు ముందుకొస్తుండగా.. పట్టణాల్లో స్థలాలు లేని వారు, పక్కా ఇళ్లు లేని వారంతా గందరగోళానికి గురవుతున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించనున్నారు. నియోజకవర్గానికి పల్లెటూరులో 70 శాతం మందికి స్థలాలు ఉండగా పట్టణాలు, నగరంలో దానికి భిన్నంగా ఉంటోంది. అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ శాశ్వత నివాసం వస్తుందని ఆశ పడిన వారికి నిరాశే ఎదురవుతోంది. మూడు దశల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దరఖాస్తులను వడబోసి విభజించారు. మొదటి విడతలో స్థలమున్న వారికే ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

**స్థలం లేని వారే అధికం**

కరీంనగర్‌తోపాటు ఇతర మున్సిపాలిటీల్లో స్థలం లేని వారే అధికంగా ఉన్నారు. వీరంతా అద్దెకు ఉండటం, సొంతిల్లు లేని వారికి ప్రభుత్వం ఇళ్లను ఇస్తుందని పేద, మధ్య తరగతి ప్రజలు భావించారు. తీరా జాబితాలు తయారు చేసి వేరు చేయడంతో ఇప్పట్లో పక్కా ఇళ్లు లేనట్లుగా భావించాల్సి వస్తుందని చెబుతున్నారు. నగరంలో పలు చోట్ల గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. వీరికి స్థలం లేకపోవడంతో అర్హులైనా అర్హులు కాని లెక్కల్లోకి వచ్చారు. కనీసం డబుల్ బెడ్ రూంలో వసతి కల్పించాలనే డిమాండ్ వస్తోంది. అద్దెకు ఉన్న వారి పరిస్థితి అలాగే తయారైంది. అద్దెలు భారీగా పెరుగుతుండగా కనీసం



ప్రభుత్వమైనా అవకాశం ఇస్తుందని భావించినా ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. పట్టణాల్లో పక్కా ఇళ్లు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**మూడు దశల్లో ఎంపిక**

సొంతంగా ఇంటి స్థలం ఉండి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్-1 విభాగం కింద గుర్తించారు. సర్వే సమయంలో ఆ స్థలాన్ని జియో ట్యాగింగ్ చేశారు. సొంత స్థలం లేని వారిని ఎల్-2 జాబితాలో చేర్చారు. వారికి స్థలంతోపాటు నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తారు. అద్దెకున్నవారు, సొంత ఇల్లు ఉండి ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్-3 కింద జాబితాలో ఉంచారు.

# ఎండ సుర్రు.. మీటరు గిర్రు

హైదరాబాద్: ఉష్ణోగ్రతల తీవ్రతతో నగరంలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతోంది. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వాడకం అధికంగా ఉంటోంది. ఏసీల లోడ్‌తో రాత్రి 10 గంటల తర్వాత వినియోగం గరిష్ఠంగా నమోదవుతోంది. దీంతో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల(డీటీఆర్) లోడ్‌ను గుర్తించేందుకు సిబ్బంది రాత్రిపూట టంగ్ టెస్టర్ సాయంతో తనిఖీలు చేస్తున్నారు. రాత్రిళ్లు ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్ 60 శాతం దాటిన చోట కొత్తవి ఏర్పాటు చేయాలని టీజీ ఎస్పీడీసీఎల్ యాజమాన్యం నిర్ణయించింది. గతంలో 100 కేవీఏ డీటీఆర్ ఓవర్‌లోడ్ అయితే అక్కడ 160 కేవీఏ ఏర్పాటు చేసేవారు. వేసవి ప్రారంభం కావడంతో అంతరాయాలు లేని సరఫరా కోసం ఎల్‌సీలపై ఆంక్షలు, పర్యవేక్షణకు ఇన్‌ఛార్జిలుగా ఇంజినీర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. **నెట్‌వర్క్ బలోపేతానికి చర్యలు** నడి వేసవిలో 5వేల మెగావాట్లకు గరిష్ఠ డిమాండ్ చేరుతుందని అంచనాల్లో అధికారులు ఉన్నారు. ఇందుకు తగ్గట్టుగా నెట్‌వర్క్ బలోపేతంపై వేసవి కార్యాచరణ ప్రణాళికలో పనులు చేపట్టారు. 11కేవీ తీగల్లో 250 యాంప్స్ వరకు విద్యుత్తు ప్రసారమవుతుంది. గతేడాది 160 యాంప్స్ దాటిన ఫీడర్లను గుర్తించి విభజన చేపట్టారు. 33కేవీ ఫీడర్ల తీగల్లో 400 యాంప్స్ సామర్థ్యానికి 300 యాంప్స్ దాటితే విభజించి లోడ్ సర్దుబాటు చేశారు. ఉపకేంద్రాల్లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్ 70 శాతం మించితే అదనపు పీటీఆర్‌లు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యలతో వేసవిలో అంతరాయాలు లేకుండా చేయగలమనే ధీమాను అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

## పనులు ముమ్మరం..చేరేనా లక్ష్యం!

పెద్దపల్లి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పని దినాల లక్ష్య సాధనకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. 2024-25కు నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చి నెలాఖరులోగా చేరుకునేందుకు సమాయత్తమవుతున్నారు. నెల రోజులుగా యాసంగి వరి నాటు పనులు జోరుగా సాగిన నేపథ్యంలో ఆశించిన స్థాయిలో కూలీలు హాజరు కాలేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడం, దాదాపు యాభై రోజుల సమయమే ఉన్నందున ఉపాధి పనులు ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. గ్రామాల వారీగా లక్ష్యాలు నిర్దేశించారు. హాజరు ప్రగతి తక్కువగా ఉన్న గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**రూ.72.21 కోట్ల చెల్లింపు**

జిల్లాలో మొత్తం 1.19 లక్షల జాబ్‌కార్డుల పరిధిలో 2.43 లక్షల మంది కూలీలు నమోదయ్యారు. వీటిలో 74 వేల కార్డులు క్రియాశీలంగా ఉండగా 1.19 లక్షల మంది పనులు చేస్తున్నారు. ఈ ఏడాది 25.55 లక్షల పని దినాలకు ఇప్పటివరకు 22.91 లక్షలు పూర్తయ్యాయి. మొత్తం రూ.72.21 కోట్లు చెల్లించగా వీటిలో రూ.52.19 కోట్లు కూలీల వేతనాలకు, 20.02 కోట్లు సామగ్రి వాటా కింద వెచ్చించారు. పొలం బాట కింద మంజూరైన పనులు నత్తనడకన



సాగుతున్నాయి. పొలాల్లో యాసంగి సాగుతో ఉపాధి పనులకు విఘాతం కలుగుతోంది.

**లక్ష్యం.. 2.64 లక్షల పని దినాలు**

మరో 50 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. మార్చి నెలాఖరులోగా జిల్లాలో 2.64 లక్షల పని దినాలు పూర్తి చేయాల్సి ఉంది. ప్రగతిలో వెనుకబడిన గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటల పూడికతీత పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 11 వేల పనులు గుర్తించగా ఇప్పటివరకు 2,700 పూర్తయ్యాయి. మిగిలిన 8,300 పనులు ప్రగతిలో ఉన్నాయి. జిల్లాలో 2.43 లక్షల మంది కూలీలుండగా 598 మంది మాత్రమే వంద రోజులు పూర్తి చేశారు. కూలీలకు వంద రోజుల పని కల్పించడంలో అధికారులు చొరవ చూపడం లేదన్న విమర్శలున్నాయి.

**ఆత్మీయ భరోసాతో పెరిగిన ఆసక్తి**

భూమి లేని కూలీలకు ప్రభుత్వం ఆత్మీయ భరోసా కింద సాయం పంపిణీ చేయనుంది. ఇందుకోసం ఉపాధిహామీ పనులను ప్రామాణికంగా తీసుకోవడంతో ఈసారి డిమాండ్ పెరగనుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు గుంట భూమి లేని పేదల్లోనూ కొందరు జాబ్‌కార్డు తీసుకోలేదు. మరికొందరికి జాబ్ కార్డున్నా పనులు చేయడం లేదు. వచ్చే ఏడాది కూలీల సంఖ్య పెరగనుంది.

**కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం**జిల్లాలో జాబ్‌కార్డు పొందిన ప్రతి కూలీకి ఉపాధి చూపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వార్షిక సంవత్సరం గడువు సమీపిస్తుండటంతో పని దినాల లక్ష్యం పూర్తి చేసేందుకు అవగాహన కల్పిస్తున్నాం. గడువులోగా లక్ష్యం చేరుకుంటాం. కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

## ఆదాయం పెంపునకు మరింత సహకారం

పెద్దపల్లి : రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సహకార రంగాన్ని బలోపేతం చేస్తోంది. నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంస్థలను(ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్-ఎఫ్‌పీవోలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం వివిధ వ్యాపారాల నిర్వహణతో ప్రగతి సాధిస్తున్న సహకార సంఘాలను ఎంపిక చేశారు. ఇటీవల జిల్లాల వారీగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. 135 సహకార సంఘా లుండగా 41 సంఘాలను ఎఫ్‌పీవోలుగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**ఆర్థికంగా బలోపేతం** సమష్టి వ్యాపారాలతో పలు సహకార సంఘాలు లాభాల బాటలో పయనిస్తున్నాయి. వీటికి మరింత ఆదాయం తెచ్చే ఉద్దేశంతో ఎఫ్‌పీవోలుగా ఎంపిక చేస్తున్నారు. పథకంలో ఎంపికైన ఒక్కో సంఘానికి నిర్వహణ ఖర్చులకు రూ.15 వేలు, పరిపాలన ఖర్చులకు రూ.18 వేలు కలిపి మొత్తం రూ.33 వేల గ్రాంట్ మంజూరు



చేస్తారు. సంఘం పరిధిలోని ప్రతి సభ్యుడు రూ.2 వేల వాటా చెల్లించాల్సి ఉంటుంది. సభ్యులందరూ కలిపి చెల్లించిన మొత్తానికి సమానంగా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు మంజూరు చేస్తుంది.

**ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యం**

ఉమ్మడి జిల్లాలో 135 సహకార సంఘాలున్నాయి. ఇందులో ప్రగతి ఆధారంగా ఎఫ్‌పీవోలుగా ఎంపిక చేశారు. స్థానిక వనరులు, పరిస్థితులకు అనుగుణంగా లాభసాటి వ్యాపారాలు నిర్వహించేలా ప్రభుత్వం ప్రోత్సహించనుంది. సభ్యులకు రుణాలు మంజూరు చేయను ంది. ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి, మిర్చి, పసుపు పంటల సాగవుతుండగా సంబంధిత ఉత్పత్తులతో పరిశ్రమలు స్థాపించనున్నారు. ఎఫ్‌పీవోల ఏర్పాటుకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదని, త్వరలో రానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. గుర్తించిన సంఘాల్లోని సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

జిల్లా వారీగా ఎంపిక చేసిన సంఘాలు

జగిత్యాల: 16 కరీంనగర్: 10 పెద్దపల్లి: 9 రాజన్నసిరిసిల్ల: 6

## ప్రగతి పనుల జోరు.. వసతులు సమకూరు



కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. పనుల మంజూరు, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం 2023 డిసెంబరులో 'కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ' పేరుతో 'కడా'ను ఏర్పాటు చేసి ప్రత్యేకాధికారిని నియమించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.4500 కోట్ల పనులను మంజూరు చేశారు. వీటిలో కొన్నింటికి నిధులు విడుదలై పనులు కూడా ప్రారంభమయ్యాయి. **తారు రోడ్లకు రూ.130.52 కోట్ల మంజూరు**

ముఖ్యంగా ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో తారు రోడ్ల నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల, బొంరాస్‌పేట మండలాల పరిధిలోని పీఆర్ రోడ్లను తారుగా మార్చడానికి రూ.130.52 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తికావడంతో పనులు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బీ పరిధిలో 11 రోడ్ల అభివృద్ధికి రూ.250 కోట్లు మంజూరుకాగా కొన్నింటికి టెండర్లు పూర్తి కావడంతో పనులు జోరుగా సాగుతున్నాయి.

**ఎకో టూరిజం ప్రాజెక్టుకు ప్రతిపాదనలు**

నియోజకవర్గానికి సాగునీరు అందించే రూ.2900 కోట్లతో చేపట్టిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులకు గుత్తేదారుతో ఒప్పందాలు కూడా పూర్తికావడంతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. బొంరాస్‌పేట, కొడంగల్ మండలాల్లో రూ.10 కోట్లతో ఎకో టూరిజం ఏర్పాటుకు ప్రభుత్వానికి అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

**శరవేగంగా 220 పడకల ఆసుపత్రి నిర్మాణం**

వైద్య కళాశాలకు రూ.360 కోట్లు మంజూరయ్యాయి. దీనికి అనుబంధంగా 220 పడకల ఆసుపత్రి నిర్మాణం వేగంగా జరుగుతోంది. సమీకృత గురుకులాల కోసం రూ.110 కోట్లు మంజూరు చేశారు. బొంరాస్‌పేట మండల కేంద్రంలో రూ.6 కోట్లతో నిర్మించే జూనియర్ కళాశాల, బురాన్‌పూర్ సమీపంలో రూ.25 కోట్లతో నిర్మించే బీసీ బాలుర గురుకుల పాఠశాల భవనాలకు టెండర్లు పూర్తి కావడంతో పనులు ప్రారంభించారు. వీటితో పాటు కొత్తగా ఏర్పాటైన దుద్యాల మండలంలో సమీకృత పోలీస్ స్టేషన్, హకీంపేటలో ఐటీఐ తదితరాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

## రసాయనాల లీకేజీతో అగ్నిప్రమాదం



కాప్రా : చర్లపల్లి అగ్నిప్రమాదంలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. కెమికల్ లీకేజీ వల్ల ప్రమాదం జరిగిందని యజమాని చెబుతున్నారు. సర్వోదయ సాల్వెంట్స్ పరిశ్రమలో రసాయనాలు వేరు చేస్తారు. ఇందులో ఉత్పత్తి అయిన రసాయనాలను కంటైనర్ల ద్వారా ఇతర పరిశ్రమలకు తరలిస్తారు. సర్వోదయలో చిన్నచిన్న అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలను సిబ్బంది ఆర్పేస్తారు. అయితే నాటి ప్రమాదాన్ని సిబ్బంది ఊహించలేదు. పక్కనున్న డీవీపీఎస్ కంపెనీ 2 నెలల కిందటే స్థాపించగా అందులోని గోద్రెజ్ వీల్ లిఫ్టులు మొత్తం కాలి బూడిదయ్యాయి. దీని పక్కనే ఉన్న ఫ్లోరో షీల్డ్ పరిశ్రమ భవనం కూడా దెబ్బతిన్నది. హైటెక్స్ హైడ్రాలిక్ పరిశ్రమ రేకులు కాలిపోయాయి. యాజమాన్యాల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని చర్లపల్లి ఎన్‌స్పెక్టర్ బి.రవికుమార్ తెలిపారు.

**క్షణాల్లో మంటలు వచ్చాయి- వట్టె నర్సిరెడ్డి, కాపలాదారు, ఫ్లోరోషీల్డ్ పరిశ్రమ (ప్రత్యక్ష సాక్షి)**

సర్వోదయ కంపెనీలో మంటలు 15 నిమిషాల్లో మా కంపెనీకి వ్యాపించాయి. కంపెనీలో ఉన్నవారిని అందరినీ బయటకు పంపించాం. క్షణాల్లో పక్క పరిశ్రమలోని రసాయనాలు మా దగ్గర పడడంతో ప్రమాద తీవ్రత పెరిగింది.

**కెమికల్, ఫార్మా పరిశ్రమలను తరలించాలి**

– జక్కా రోషిరెడ్డి, ఛైర్మన్, ఐలా, చర్లపల్లి

నగరానికి దూరంగా ప్రత్యేక ఇండస్ట్రియల్ జోన్‌లను ఏర్పాటు చేసి కెమికల్, ఫార్మా కంపెనీలను తరలించాలి. ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తే పరిశ్రమలను తరలించేందుకు యాజమాన్యాలు ముందుకు వస్తాయి. ఐలా పరిధిలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తాం. **రక్షణ చర్యలు చేపట్టడం అవశ్యం–** కె.గోవిందరెడ్డి, అధ్యక్షుడు, చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం

ప్రతీ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రమాదాల సమయంలో పరికరాలను వాడితే తీవ్రత ఉండదు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై కార్మికులకు శిక్షణ ఇవ్వాలి.

## ఇరువైపులా ఇరుక్కొని విలవిల



హైదరాబాద్ : 'అధిక లాభానికి ఆశపడి పెట్టుబడి పెడితే సైబర్ నేరగాళ్లు రూ.కోట్లు కాజేస్తున్నారు. అసలు కేటుగాళ్లు తప్పించుకొని బాధితులను కేసుల్లో ఇరికిస్తున్నారు. కమీషన్లపై ఆశ.. పోయిన సొమ్ము వచ్చే దారి తెలియక లబోదిబోమంటున్నారు. 2 నెలల వ్యవధిలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు సుమారు 70 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 50 మంది మోసపోయిన వారే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.'

**ఒకరికి తెలియకుండా మరొకరికి**

స్టాక్‌మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్, మ్యాట్రిమోనీ, కొరియర్ పార్శిల్ రూపం ఏదైనా అందినంత దండుకోవటమే మాయగాళ్ల లక్ష్యం. అడ్డదారిలో సేకరించిన ఫోన్ నంబర్లకు సందేశాలు పంపి చిక్కిన వారిని పీల్చిపిప్పి చేస్తున్నారు. నేరాలకు సహకరించేందుకు ఏజెంట్లు, దళారులను బాధితుల నుంచే ఎంపిక చేసుకుంటున్నారు. వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వేదికలుగా పరిచయాలు పెంచుకుంటున్నారు. మ్యూల్ బ్యాంకు ఖాతాలు, షెల్ కంపెనీ డైరెక్టర్లు, సిమ్‌కార్డులు కొనుగోలు చేసేందుకు సహాయకులుగా మార్చుకుంటున్నారు. కమీషన్ ఇస్తున్నారు. ఒక బాధితుడి నుంచి కొట్టేసిన నగదును మరో బాధితుడి బ్యాంకు ఖాతాలో జమ చేయిస్తారు. పెద్దమొత్తంలో వచ్చే నగదును తమ ఆధీనంలోని కరెంట్ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. సైబర్ మోసాలపై అవగాహన లేని వారికి డబ్బు ఆశచూపి బ్యాంకు లావాదేవీలపై ఆన్‌లైన్‌లో అవగాహన కల్పిస్తున్నారు. భారతీయ నగదును, డాలర్‌గా, క్రిప్టో కరెన్సీగా కన్వర్షన్ చేయటం నేర్పిస్తున్నారు. కమీషన్ వస్తుందనే ఆశతో తమ ఖాతాను దుర్వినియోగం చేస్తున్నామని గ్రహించేలోపు కేసుల్లో ఇరుక్కుంటున్నారని నగర సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత దార తెలిపారు.

**స్థాయికి తగినట్టుగా రేటు**

బ్యాంకు ఖాతా తెరిచేందుకు సహకరిస్తే రూ.10-50వేలు.. అద్దెకు ఇస్తే రూ.2-5వేలు.. నగదు, క్రిప్టోకరెన్సీ మార్పిడికి రూ.లక్షకు 10శాతం కమీషన్.. ఇలా చీకటి వ్యవహారంలో కొన్ని మనీట్రాన్స్‌ఫర్ ఏజెన్సీలు మాయగాళ్లకు సహకరిస్తున్నట్టు గుర్తించారు. కేసులు నమోదైనపుడు బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తారని తెలిసీ కేవలం గంట వ్యవధిలో నగదును 20 వేర్వేరు ఖాతాల్లోకి మళ్లిస్తారు. దర్యాప్తులో అక్రమ లావాదేవీలు వెలుగు చూసినపుడు నష్టపోయిన సొమ్మును రాబట్టుకునేందుకు ఇలా చేస్తున్నామంటూ పోలీసుల ఎదుట వాపోతున్నారు. తాజాగా పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ముగ్గురు మహిళలున్నారు. వీరికి బ్యాంకు, క్రిప్టో కరెన్సీ లావాదేవీలపై అవగాహన లేకున్నా పావులుగా వాడుకున్నారు. తక్కువ సమయంలో డబ్బు వస్తుందని ఆశపడి నేరస్తులకు సహకరించి జైలుపాలు కావొద్దని డీసీపీ కవిత దార హెచ్చరించారు. అనుమానాస్పద లావాదేవీలు, సైబర్ నేరాలపై 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## ఏటా ప్రతిపాదనలకే పరిమితం

సిరిసిల్ల : ఉమ్మడి జిల్లాలో ఎగువ మానేరు తొలి సాగునీటి ప్రాజెక్టు. జిల్లాలోని గంభీరావుపేట మండలం నర్మాలలో నిర్మించిన ఈ జలాశయం ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలకు సాగునీరందుతుంది. తొలి ఆయకట్టు 18 వేల ఎకరాలు. దశాబ్దాలుగా నిర్వహణ లేక తగ్గుతూ ప్రస్తుతం 13 వేల ఎకరాలకు చేరింది. ఈ యాసంగిలో పది వేల ఎకరాలకు నీటిని విడుదల చేస్తున్నారు. వారంలో అయిదు రోజులు నీరివ్వడం, రెండు రోజులు విరామం ఇవ్వడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. ప్రస్తుతం మల్లన్నసాగర్ నుంచి 0.5 టీఎంసీ విడుదల చేశారు. పంట చివరి వరకు నీటిని విడుదల చేస్తేనే మొత్తం పంట చేతికందుతుంది.

ఎగువమానేరు కుడి, ఎడమ కాలువలకు పలు చోట్ల గండ్లు పడటం, చెట్లు, పూడికతో పేరుకుపోవడం వల్ల వాటి సామర్థ్యం మేరకు నీటిని తరలించలేని దుస్థితి నెలకొంది. నీటి విడుదల సమయంలో రైతులే కాలువల్లో పూడిక తీసుకుని బాగు చేసుకుంటున్నారు. నర్మాల నుంచి ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది వరకు ఉన్న కుడి కాలువలో 200 క్యూసెక్కుల వరకు నీటిని తరలించే సామర్థ్యమున్నా లైనింగ్ సరిగా లేక అన్ని చోట్ల దెబ్బతిన్నది. ప్రతి సీజన్‌లో మరమ్మతులు చేయకపోవడం, కట్ట శిథిలం కావడం, చేసిన పనుల్లోనూ నాణ్యత లోపాల



వల్ల ప్రస్తుతం కాలువలో 120 క్యూసెక్కులకు మించి తరలించలేని దుస్థితి నెలకొంది.

ఎడమ కాలువ 3.5 కిలోమీటర్లు కాగా 20 క్యూసెక్కుల సామర్థ్యానికి పది క్యూసెక్కులకు మించి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చివరి ఆయకట్టుకు నీరు చేరడంలో జాప్యం నెలకొంటుంది. కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల లైనింగ్, తూములు, షట్టర్లు, కాలువల కట్టలు, డ్రాపులు, అక్విటెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ మరమ్మతులు చేసినా కాలువల్లో నిండుగా నీటిని వదల్లేని పరిస్థితి నెలకొంది. దీంతో చివరి ఆయకట్టుకు ఆశించినట్లుగా నీరు చేరడం లేదు.

ఎగువ మానేరు జలాశయం ప్రధాన కాలువలు, షట్టర్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు 2021 నుంచి 2023 వరకు ఏటా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నారు. తొలుత రూ.47 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.75 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. అంచనా విలువ పెరుగుతుందే తప్ప నిధుల మంజూరుకు నోచుకోవడం లేదు.

ఇబ్బంది లేకుండా చర్యలు

కాలువలకు లైనింగ్ లేకపోవడంతో సామర్థ్యం మేరకు వదిలితే గండ్లు పడే అవకాశం ఉంది. అందుకే తక్కువగా వదులుతున్నాం. ఆయకట్టులో పంటలకు ఇబ్బందుల్లేకుండా సాగునీటిని సరఫరా చేస్తాం .తబ్రేజ్, జలాశయం ఏఈ

జలాశయం స్వరూపం

సామర్థ్యం: 2.2 టీఎంసీలు

ప్రస్తుతం నిల్వ: 1.6 టీఎంసీలు

విస్తీర్ణం: 5.48 స్క్వేర్ మైల్స్

కుడి కాల్వ: 3.5 కిలోమీటర్లు, ఆయకట్టు: 670 ఎకరాలు

ఎడమ కాల్వ: 22 కిలోమీటర్లు, ఆయకట్టు: 9330 ఎకరాలు

## బడుల్లో భగీరథ నీటికి కటకట

సిరిసిల్ల : 'పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 33 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ భగీరథ పైపును ప్రహరీ వరకు తీసుకొచ్చి వదిలేశారు. పాఠశాలలోని ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు చేతి పంపు నీటినే తాగుతున్నారు.'

ఉమ్మడి జిల్లాలో 2,199 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 1.48 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా పాఠశాలల్లోని విద్యార్థులకు శుద్ధ జలం అందడం లేదు. రికార్డుల్లో మిషన్ భగీరథ, చేతి పంపు, ఆర్వో ప్లాంటు, పంచాయతీ నల్లాల ద్వారా నీరు అందిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు చూపుతున్నా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రస్తుతం ఫిబ్రవరి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. తాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోకుంటే విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.

**ఇవీ సమస్యలు**

మిషన్ భగీరథ పైపులైన్లు పాఠశాలల వరకు వేసినా.. మంచినీటి ట్యాంకులకు, కుళాయిలకు కనెక్షన్లు ఇవ్వలేదు.

కొన్ని చోట్ల నీటి సరఫరా సమయం పాఠశాల పనివేళల్లో ఉండకపోవడంతో ఉపయోగం లేకుండా పోతోంది.

చాలా పాఠశాలల్లో చేతిపంపులు, బోరు మోటారు నీరే దిక్కవుతోంది.

చేతి పంపులు, పంచాయతీ నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు శుభ్రంగా ఉండటం లేదని విద్యార్థులు ఇంటి నుంచే సీసాల్లో తెచ్చుకుంటున్నారు. పలు పాఠశాలల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటులు నిర్వహణ లేక చాలా వరకు మూలన పడ్డాయి.

ఈ విషయమై సిరిసిల్ల డీఈవో జగన్మోహన్‌రెడ్డిని సంప్రదించగా విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

'కరీంనగర్ మంకమ్మతోటలోని ప్రభుత్వ ధన్గర్‌వాడి ఉన్నత పాఠశాలలో 265 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటి నుంచి ఉదయం సీసాల్లో తెచ్చుకున్న నీటినే సాయంత్రం వరకు సరిపుచ్చుకుంటున్నారు. ఆర్వో ప్లాంటు ఉన్నా అది మధ్యాహ్న భోజన వంటలకు ఉపయోగిస్తున్నారు.'

**తగినంత నీరు తాగాలి**

పాఠశాల సమయంలో చదువు, ఆటల మీద పడి విద్యార్థులు నీరు తాగడం మరిచిపోతుంటారు. ఉపాధ్యాయులు నీరు తాగేందుకు సమయం ఇవ్వాలి. కలుషిత నీరు తాగడం ద్వారా టైఫాయిడ్, వైరల్ హెపటైటిస్, అతిసారం వంటి వ్యాధుల భారిన పడే అవకాశం ఉంది. విద్యార్థులకు శుద్ధజలం అందుబాటులో ఉంచితే వ్యాధుల ముప్పు నుంచి కాపాడినవారమవుతాం. మురళీధర్‌రావు, చిన్న పిల్లల వైద్య నిపుణులు, కరీంనగర్ జనరల్ ఆస్పత్రి

చురకలు



# రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఇసుకను కొందరు కర్ణాటకకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో అక్రమార్కులు జోరుగా దందా సాగిస్తున్నారు. ఇక్కడి వేదవతి నదిలో నాణ్యమైన ఇసుక లభిస్తుండటంతో ఇతర ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. దీంతో పగలు ఒకచోట ఇసుక నిల్వ చేసి రాత్రి టిప్పర్ల ద్వారా సరిహద్దులు దాటించేస్తున్నారు. ముఖ్యంగా గుమ్మఘట్ట మండలం రంగచేడు, భూపసముద్రం, కేపీకుంట, తాల్లకెర గ్రామాల మధ్య, రాయదుర్గం మండలం రేకులకుంట, జుంజురాంపల్లి తదితర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోంది. కర్ణాటకలో ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది.



**చుట్టూ నిల్వలే..**

పట్టణ శివారులోని మొలకాల్మూరు రోడ్డులో ఇటీవల ముళ్లకంపల్లో సుమారు 20 ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు అధికారులు దాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. వీటితోపాటు గొల్లపల్లి దారిలో ఓ వ్యవసాయ తోటలో పగలు ఇసుక నిల్వ చేసి రాత్రికి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అనంతపురం, మొలకాల్మూరు రోడ్డుకు ఆనుకుని ఓ వ్యవసాయ తోటలో ఇసుకను డంపింగ్ చేశారు. ఇక్కడి నుంచి రోజు మార్చి రోజు కర్ణాటకకు తరలిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఇసుక కర్ణాటకకు తరలివెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**దాడులు నిర్వహిస్తాం**

ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా, కర్ణాటకకు తరలించినా కఠిన చర్యలు తప్పవు. ఇటీవల పైతోట సమీపంలో ఇసుకను స్వాధీనం చేసుకున్నాం. దానికి త్వరలో వేలం పాట నిర్వహిస్తాం. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేసి ఇసుక అక్రమంగా తరలి వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.నాగరాజు, తహసీల్దార్

# కలప తరలుతోంది.. పచ్చదనం తగ్గుతోంది!

చెన్నేకొత్తపల్లి : కొన్ని రకాల కలప తరలించేందుకు అనుమతి అవసరం లేదన్న నిబంధనలను సాకుగా చేసుకొని ఇక్కడి కలపను ఇతర రాష్ట్రాలకు ప్రధానంగా గుజరాత్‌కు తరలుతోంది. ఇతర రాష్ట్రాల్లో సుబాబుల్, నీలగిరి కలపకు మంచి గిరాకీ ఉంది. కాగితపు తయారీ కంపెనీల వారు అధికంగా కొనుగోలు చేస్తుంటారు. సుబాబుల్, నీలగిరి వంటి మొక్కలను రైతులు తమ పొలాల్లో ప్రత్యేకంగా ఐదు నుంచి పదేళ్ల వరకు పెంచి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలు, బంజరు భూముల్లో స్వతహాగా పెరిగిన సుబాబుల్ చెట్లను నరికి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.




**విలువ తెలుసుకొని..**

ఇతర రాష్ట్రాల్లో ఈ కలప విలువ తెలిసిన కొందరు వ్యాపారులు పలు ప్రాంతాల్లో కొనుగోలు పాయింట్లు ఏర్పాటు చేసి టన్నుకు రూ.మూడు నుంచి రూ.4 వేలకు కొని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ టన్ను రూ.ఆరు నుంచి ఏడు వేలకు మిల్లుల యజమానులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

**నిత్యం లారీల్లో..** ఉమ్మడి జిల్లాలోని హిందూపురం, బత్తలపల్లి, ఎన్ఎస్ గేట్, పామిడి, గుంతకల్లు తదితర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో లారీల కలప తరలుతోంది. ప్రకృతిలో సహజంగా పెరిగిన చెట్లను అక్రమార్కులు తెగ నరికి తరలిస్తున్న వైనంపై వృక్ష ప్రేమికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతలో నానాటికీ అడవుల విస్తీర్ణం తరగి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. కలప అక్రమ రవాణాపై జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్ దృష్టికి తీసుకుపోగా సుబాబుల్, నీలగిరి కలప తరలించేందుకు అనుమతి అవసరం లేదన్నారు. ఇతర చెట్లు నరికి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# పేదల స్థలాల్లో పెద్దల పెత్తనం

బనగానపల్లి : మండలం యనకండ్లలో సర్వే నంబరు 191-1లో 1989-1990లో 1.50 ఎకరాల స్థలంలో 22 మంది లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేశారు. ఇక్కడ కొంత కాలం పాలిష్ పరిశ్రమలు నడిచాయి. కాలక్రమేణా మూతపడి పోయాయి. ఇక్కడ అసలు పరిశ్రమలు ఉన్నట్లు ఆనవాళ్లు కనిపించడం లేదు. సుమారు ఎకరా వరకు ఆక్రమణకు గురైంది. ఇక్కడ ఎకరా పొలం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉంటుంది. ఈ భూమి ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిందని బోర్డు వేసినా పొలం ఆక్రమణకు గురైంది.ఎస్సీల సంక్షేమం కోసం కేటాయించిన స్థలాలు పరులపాలవుతున్నాయి. ఎక్కడికక్కడ పెద్దలు పాగా వేస్తున్నారు.. రూ.కోట్లు విలువ చేసే భూములు అన్యాక్రాంతం అవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ కింద దశల వారీగా భూ పంపిణీ చేశారు. పరి'శ్రమి'స్తారన్న ఉద్దేశంతో పాలిష్ పరిశ్రమలు పెట్టుకోవడానికి 48.44 ఎకరాలు ఇచ్చారు. మొత్తం 490 యూనిట్లు ఉన్నాయి.. ఒక్కో యూనిట్ పరిధిలో 20-22 మంది ఉన్నారు. ఒక్కో యూనిట్‌కు ఎకరం నుంచి రెండెకరాల వరకు కేటాయించారు. కార్పొరేషన్ నిధులు వెచ్చించి యంత్రాలు కొనుగోలు చేసి ఇచ్చింది. కొన్నాళ్లు లబ్ధిదారులు గనుల నుంచి రాళ్లను తెప్పించుకొని పాలిష్ చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. కాలక్రమేణా నష్టాలు రావడంతో దశల వారీగా పరిశ్రమలు మూతపడ్డాయి. చివరకు అక్కడ పాలిష్ పరిశ్రమలు ఉన్నాయనే గుర్తులు లేకుండా పోయాయి. ప్రస్తుతం ఖాళీ స్థలాలుగా మారిపోయాయి. విలువ పెరిగింది.. దీంతో కొందరు ఆక్రమించుకొని పంటలు సాగు చేసుకొంటున్నారు.

# దంత వైద్యం.. అందని దైన్యం!



అనంతపురం : ఉమ్మడి జిల్లాలో అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న దంత వైద్యులు అందిస్తున్న సేవలు నామమాత్రంగా ఉన్నాయి. పుచ్చిన దంతాలను తొలగించటం..శుభ్రం చేయటం.. సిమెంట్ నింపడం వంటి మాత్రమే అందిస్తున్నారు. కొన్ని చోట్ల ఆధునిక పరికరాలు ఉన్నా వినియోగించని పరిస్థితి. ప్రాంతీయ, సామాజిక, జిల్లా ఆసుపత్రుల్లోని వైద్యులే యూహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో మంగళవారం, గురువారం, శనివారం ఓపీ సేవలు అందిస్తున్నారు. అక్కడా ఇక్కడా విధులు నిర్వహిస్తుండటంతో సేవలపై ప్రభావం చూపుతోంది. యూహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో దంత చికిత్సలకు సంబంధించి పరికరాలు అందుబాటులో లేవు. కేవలం ఓపీ చూసి మందులు రాసివ్వటంతో సరిపెట్టేస్తున్నారు.

**ఎనిమిది మందికి ఇద్దరే..**అనంతపురంలోని సర్వజన వైద్యశాలలో దంత వైద్యానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్ ఉండాలి. ఇక్కడ కేవలం అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. వీరిద్దరూ రోజు వారి ఓపీకి వస్తున్న 30 నుంచి 40 మంది రోగులకు సేవలు అందిస్తున్నారు. సోమవారం, బుధవారం, శుక్రవారం ఓపీ చూస్తున్నారు.

**నాలుగేళ్లుగా అంతే..**

కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాలుగేళ్లుగా పంటి శస్త్రచికిత్సలు ఆగిపోయాయి. ఇక్కడ ఒక వైద్యురాలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది నియమించలేదు. ఆమె వారంలో మూడు రోజులు ఇక్కడ.. మరో మూడు రోజులు యూహెచ్‌సీ, పీహెచ్‌సీలో పని చేస్తున్నారు. రోగులను పరీక్షించి ఔషధాలు రాసి ఇస్తున్నారు.

**వారానికి మూడు రోజులే..**

కదిరి ప్రాంతీయ ఆసుపత్రిలో వారంలో మూడు రోజులు మాత్రమే దంత వైద్యం అందుబాటులో ఉంటుంది. పరీక్షలు, శస్త్ర చికిత్సలు అందించేందుకు పరికరాలు అందుబాటులో ఉన్నా ఇక్కడ సేవలందించే వైద్యురాలు మూడురోజుల పాటు ఉంటున్నారు. దీంతో దంతసమస్యలు ఉన్న రోగులు ప్రైవేటు ఆసుపత్రులపై మొగ్గుచూపుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులే మూడు రోజులపాటు యూహెచ్‌సీ, పీహెచ్‌సీలో సేవలు అందిస్తున్నది వాస్తవమే. ఈ విధానం సక్రమంగా లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆసుపత్రుల్లో మరిన్ని ఆధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. డాక్టర్ పాల్ రవికుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త

# నిధులున్నా చెల్లింపులో జాప్యమెందుకు?



కదిరి : గత ఏడాది నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు మంజూరైన రవాణా భత్యం అందజేయడంలో విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇంతకాలం నిధులు రాలేదని కారణాలు చెబుతూ కాలం వెళ్లదీసిన అధికారులు తీరా అవి విడుదలయ్యాక.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య బోధించాలనే సంకల్పంతో ఉపాధ్యాయులకు గత ఏడాది టీచ్-టూల్, ఎఫ్ఎల్ఎన్, లీడర్ షిప్‌లపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా శిక్షణ కేంద్రాలు దూరప్రాంతంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాలతో సొంత ఖర్చులు వెచ్చించి వ్యయ, ప్రయాసాలు పడుతూ ఉపాధ్యాయులు వెళ్లారు. శిక్షణకు హాజరైన వారికి నిర్ణయించిన రవాణా భత్యం చెల్లింపుల్లో జాప్యం నెలకొంది.

ఇప్పటికే ఏడెనిమిది నెలలు గడిచిపోయింది. అయినా ప్రయాణ ఖర్చులను ఇవ్వటం లేదు. మరో 50 రోజుల్లో పాఠశాలలకు సెలవులు రానున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిక్షణ ప్రయాణ ఖర్చులను మంజూరు చేయాలని కోరుతున్నారు.

**ఉపాధ్యాయులకు రావాల్సిన సొమ్ము ఇలా..**

ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రథమార్థంలో టీచ్ - టూల్ శిక్షణకు సుమారు 509 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణ నిర్వహణకు ఉపాధ్యాయుల రవాణా భత్యంతో పాటు భోజనం, అల్పాహారం తదితర ఖర్చులకు రూ.20.61 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకు రూ.7.20 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.13.40 లక్షలు ఉపాధ్యాయులకు ఇవ్వాల్సి ఉంది.

ఏడో విడతల్లో మొత్తం 1,620 మందికి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ) శిక్షణను హిందూపురం బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇచ్చారు. హాజరైన ఒక్కొక్కరికి రూ.200 చొప్పున రూ.3.24 లక్షలు రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది.

'లీడర్‌షిప్' శిక్షణకు హాజరైన 650 మంది ప్రధానోపాధ్యాయులకు.. ఒక్కొక్కరికి రూ.200 చొప్పున రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది.

త్వరలో ఖాతాలకు జమ: దేవరాజ్, ఏపీసీ, ఎస్ఎస్ఏ, శ్రీసత్యసాయి జిల్లా టీచ్-టూల్‌కు సంబంధించిన రూ.13.40 లక్షల నిధులు వచ్చాయి. రెండు, మూడు రోజుల్లో ఖాతాలకు జమ చేస్తాం. ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ శిక్షణకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉంది. వచ్చిన వెంటనే శిక్షణ పొందిన అందరి ఖాతాలకు రవాణా భత్యం సొమ్ము జమ చేస్తాం.

# పట్టాలెక్కిస్తామని.. పత్తాలేకున్నారు..!




అమరావతి : విజయవాడ శివారులో రాయనపాడు, గొల్లపూడి, కొండపల్లి నాలుగు లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద వంతెన (ఆర్వోబీ)లను 2019లో రైల్వే మంజూరు చేసింది. రాష్ట్రం, రైల్వే 50-50 శాతం చొప్పున నిధులు వెచ్చించి నిర్మించాలనేది ఒప్పందం. కానీ.. జగన్ సర్కారు స్పందించలేదు. 2021లో మరోసారి పాలసీ మారింది. ఈసారి భూసేకరణ మాత్రమే రాష్ట్రం చేసిస్తే.. నిర్మాణం అంతా రైల్వేనే చూసుకుంటుంది. కానీ.. జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023-24లో పూర్తిగా పాలసీ మారింది. భూసేకరణ సహా మొత్తం నిర్మాణం రైల్వేనే భరిస్తుంది. ఒక్క రూపాయి కూడా రాష్ట్రం ఇవ్వాల్సిన పనిలేదు. కేవలం బడ్జెట్ అంచనాలు ఆయా శాఖలు ఇస్తే చాలని రైల్వే ప్రకటించింది. అయినా.. అంచనాలు ఇవ్వడానికీ చొరవ చూపలేదు.జగన్ సర్కారు... నిధులు ఇవ్వలేనంది... సరే భూమి సేకరించి ఇవ్వమంది.. రైల్వే అదీ తన వల్లకాదని చేతులెత్తేసింది... సరే ఆ బాధ్యతా మాదే.. అంచనాలైనా ఇవ్వండంది.. రైల్వే ఆసాంతం తామే నిర్మిస్తామని నిర్దయగా గాలికొదిలేసింది.. ప్రస్తుతం నాలుగు ఎల్‌సీ గేట్ల వద్ద నిత్యం వందల మంది నరకం చూస్తున్నారు. రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండే హైదరాబాద్-విజయవాడ మార్గం కావడంతో.. ప్రతి అరగంటకోసారి గేట్ పడుతోంది. ప్రయాణికులు, సరకు రవాణా రైళ్లు భారీగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో నాలుగు ఎల్‌సీ గేట్ల వద్ద ప్రజలు తల్లడిల్లుతున్న వేళ ఆరేళ్ల కిందటే ఆర్వోబీలను రైల్వే మంజూరు చేసింది. కానీ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో కార్యరూపం దాల్చలేదు. విజయవాడ నుంచి వెళ్లే వాహనాలన్నీ శివారులో గొల్లపూడి, రాయనపూడి మీదుగానే పైడూరుపాడు, కవులూరు, జి.కొండూరు, మైలవరం, జక్కంపూడి, షాబాద, కొత్తూరు తాడేపల్లి చేరాలి. ఈమార్గంలో రైల్వే గేట్ వద్ద నిత్యం గంటల కొద్దీ వాహనదారులు వేచి ఉండాల్సిందే. కొండపల్లి వద్ద ఉన్న ఎల్‌సీ గేట్ వద్ద కూడా ఇంతే.

**కూటమి ప్రభుత్వం వచ్చాక...**

కొండపల్లి వద్ద ఎల్‌సీగేట్ నంబరు 140, రాయనపాడు 147, 148, గొల్లపూడి 150.. ఈ నాలుగు ఆర్వోబీల నిర్మాణంలో తాజాగా కొంత కదలిక వచ్చింది. చంద్రబాబు సర్కారు కొలువుదీరాక.. తొమ్మిది నెలల్లో ఇప్పటికే మూడుసార్లు సమన్వయ భేటీలు పెట్టి చర్చించారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు సహా అన్ని ప్రభుత్వ విభాగాలు, రైల్వే అధికారులు సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా.. అన్ని విభాగాలు బడ్జెట్ అంచనాలు రూపొందించి రైల్వేకు పంపాలని నిర్ణయించారు. భూసేకరణ అంచనాలు రెవెన్యూ సిద్ధం చేసిచ్చింది. నీటి పైప్‌లైన్లు, విద్యుత్తు లైన్ల తరలింపు.. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు సహా కొన్ని విభాగాల నుంచి ఇంకా రైల్వేకు పంపక పోవడంతో మరింత జాప్యం జరుగుతోంది.

**త్వరగా నివేదికలు అందిస్తేనే...**

జిల్లా అధికారుల నుంచి బడ్జెట్ అంచనాలు రైల్వేకు పూర్తిగా అందాకే ప్రక్రియ ఆరంభమవుతుంది. అంచనాలు అందాక.. వాటితో కలిపి పూర్తి డీపీఆర్‌ను తయారుచేసి విజయవాడ రైల్వే డివిజన్ నుంచి బోర్డుకు పంపడానికి మరో నెలన్నరపైనే పడుతుంది. ఆ నివేదిక పంపాకే.. నిధులకు రైల్వే అనుమతి ఇస్తుంది. తర్వాతే టెండర్లు పిలిచి.. పనులు పట్టాలెక్కిస్తారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వ విభాగాలు నివేదికలు త్వరగా అందిస్తే.. సమస్య పరిష్కరించినట్లే.

# మల్లె రైతులకు లేవు సిరునవ్వులు

మైలవరం : 'ఆహా..ఈ రోజు కిలో మల్లె రూ.1,500 పలుకుతోంది..' డిసెంబరులో కొన్ని రోజుల పాటు రైతుల మురిపెమిది. 'అయ్యో.. ఈ రోజు రూ.100, 150కే కొంటున్నారు..' జనవరి నుంచి సీజన్ పూర్తయ్యే వరకు మల్లె సాగు రైతుల ఆవేదన.. రాష్ట్ర వ్యాప్తంగా మైలవరం ప్రాంతం మల్లెతోటలకు ప్రసిద్ధి..మండలంలోని చంద్రగూడెం కేంద్రంగా దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో మార్కెట్ కొనసాగుతోంది. దాదాపు 10 గ్రామాల రైతులు ఐదారు నెలల పాటు అక్కడ పూలు విక్రయిస్తుంటారు. వాటిని వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. నెల కిందట ఇక్కడ కిలో రూ.1,500ల నుంచి రూ.2 వేల వరకు పలికింది..అదీ వారం రోజుల లోపే. కానీ అప్పట్లో తోటల్లో దిగుబడులు అంతంత మాత్రమే..మార్కెట్‌కు వచ్చేది రోజుకి ఒకట్రెండు క్వింటాళ్లే. గరిష్ఠ ధరలున్నప్పుడు దిగుబడులు క్వింటాళ్లకే పరిమితమయితే, ధరలు దిగజారేనాటికి టన్నుల్లో దిగుబడులు వస్తున్నాయి. ముందస్తు పూల ధరను చూసి మురిసే లోపే, రైతుల ఆశలు ఆవిరై పోతున్నాయి.

**టన్నుల కొద్దీ దిగుబడులు**



జనవరి చివరి నుంచి ప్రస్తుతం అన్ని గ్రామాల్లోని తోటల్లో దిగుబడులు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. ఎకరానికి సరాసరి రోజుకి 40 కిలోల దిగుబడి వస్తుండగా, మార్కెట్‌కు 10 టన్నుల వరకు పూలు వస్తున్నాయి. దిగుబడులు పెరిగి గిరాకీ తగ్గిందన్న కారణంతో కిలో రూ.100 నుంచి రూ.150 మధ్య నాలుగైదు రోజులుగా కొనుగోళు సాగుతున్నాయి. రోజుకి ఒక కూలీకే 400 ఇస్తున్నామని..కూలి ధర, రూ.లక్షల్లో పెట్టుబడి..తగ్గిన మార్కెట్ సౌలభ్యంతో నష్టాలు తప్పడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అనుబంధ పరిశ్రమలుంటేనే**

రోజువారీ క్రయ విక్రయాలు, శుభముహూర్తాలే మల్లెలు అవసరం కావడంతో రైతులకు ఎక్కువగా నష్టం, లేదా అరకొర ఆదాయమే లభిస్తోంది. దశాబ్దం కిందటే మల్లె అనుబంధ పరిశ్రమలను స్థాపిస్తే..నిలకడైన ధరలుంటాయని రైతులు కోరడంతో, ఆ దిశగా అప్పట్లో ఆరా తీసినా ఎవరికీ పట్టలేదు. ప్రస్తుతం గ్రామంలో పరిశ్రమలకు కేటాయించిన పోరంబోకు స్థలంలో చొరవ తీసుకుని స్థాపిస్తే సాగు మరింత పెరుగుతుందని రైతులు అంటున్నారు.

**సాగు వివరాలిలా...**

సాగు విస్తీర్ణం : సుమారు 900 ఎకరాలు

పెట్టుబడి వ్యయం : రూ.1 లక్ష

కౌలు ధర : రూ.80,000- రూ.లక్ష

సరాసరి దిగుబడి : 5 నుంచి 6 టన్నులు

నికర ఆదాయం : నిలకడలేదు

# అనుమతులకే పరిమితం.. ఆపై పట్టించుకోం


మచిలీపట్నం : జిల్లాలోని గనుల శాఖలో అధికారుల కొరత వెంటాడుతోంది. స్వయంగా గనుల శాఖ మంత్రి జిల్లాలోనే అధికారులు లేకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. గత వైకాపా హయాంలో అక్రమాలను అడ్డుకోవడంలో ఈ శాఖ విఫలమైంది. ముడుపులు పుచ్చుకొని జిల్లాలో ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకో లేదు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోనే ముడా భూముల్లో మట్టి తవ్వకాలు, బుసుక, ఇసుక తరలిస్తున్నా చర్యలు తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఇక్కడ టెక్నికల్ అసిస్టెంట్ మినహా దాదాపు అన్ని స్థానాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఉన్న అధికారులు సైతం వైద్య సంబంధ సెలవులో కొనసాగుతున్నారు.

**ఫిర్యాదులకు పరిష్కారం శూన్యం**

మట్టి, ఇసుక మాఫియాలతో ఇబ్బంది పడుతున్న రైతులు, గ్రామస్థులు మండల స్థాయిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించుకుంటున్నారు. ఇక్కడికి వచ్చిన అర్జీలను గనుల శాఖకు పంపుతున్నారు. అక్కడ కేవలం టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే ఉండటంతో ఫిర్యాదులను పరిష్కరించలేక వాటిని మళ్లీ మండల అధికారుల వద్దకే బదలాయిస్తున్నారు. అక్కడ సమస్య తీరకుండానే పరిష్కరించినట్లు చూపుతుండటంతో అధికారుల తీరుపై అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సెలవులోనే ఏజీ, ఏడీ**

గనుల శాఖ ఏడీ అనారోగ్యం కారణంగా కొంత కాలంగా సెలవులో ఉన్నారు. ఈ స్థానంలో ఎవరూ లేకపోవడంతో ఎన్టీఆర్ జిల్లా డీడీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో ఆసక్తి చూపట్లేదు. ప్రజల నుంచి మట్టి, ఇసుక మేటల తొలగింపుపై వచ్చిన దరఖాస్తులు, ఇతర దస్త్రాలపై ఆయన సంతకాల కోసం ఇక్కడ ఉన్న టెక్నికల్ అసిస్టెంట్



విజయవాడ తీసుకెళ్లాల్సిందే. ఆర్జీ, సీనియర్ అసిస్టెంట్, స్థానాలు భర్తీ చేయాల్సి ఉంది. ఇక్కడ సర్వేయర్‌ను ఎన్టీఆర్ జిల్లాలో ఇన్‌ఛార్జి ఇవ్వడంతో అక్కడ విధులకే పరిమితమవుతున్నారు. ఏజీ సైతం అనారోగ్యం కారణంగా తరచూ సెలవు పెడుతున్నారు. నెలలో ఒకటి రెండ్రోజులు విధులకు రావడం, ఆరోగ్యం బాగోలేదని మళ్లీ సెలవు పెట్టడం పరిపాటిగా మారింది.

**తనిఖీలు లేవు..!**

పేర్ని నానికి చెందిన గోదాములకు ఉపాధి పనులు చేసిన మట్టిని తరలించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటి వరకు విచారణ లేదు. జిల్లాలోని ఇసుక రేవుల్లో రేయింబవళ్లు యథేచ్ఛగా యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. ముడా భూముల్లో రాత్రి, పగలు విచ్చలవిడిగా అక్రమంగా బుసక తవ్వుతున్నా ఎవరూ ఆపట్లేదు. మండల రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక, బుసక మాఫియాతో ముడుపులు తీసుకొని మిన్నకుండిపో తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# అమ్మబోతే.. అగమ్యగోచరం

మచిలీపట్నం : రామానగరానికి చెందిన తొట్టెంపూడి పెదబాబుకు పదిహేను రోజుల కిందట తన పదెకరాల్లో మాసూలు చేశారు. దిగుబడి 350 బస్తాలు(ముతకరకం) రాగా కొనే దిక్కే లేక పొలంలోనే మగ్గుతున్నాయి. ధర తగ్గించి కొనుగోలు చేసేందుకు సైతం మిల్లర్లు ఆసక్తి చూపకపోవడంతో ఏం చేయాలనే విషయంపై మల్లగుల్లాలు పడుతున్నారు.పాగోలుకు చెందిన రైతు శ్రీహరికి 300 బస్తాల బీపీటి రకం దిగుబడి వచ్చింది. కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో దళారులకు బస్తాను రూ.1,400 చొప్పున విక్రయించి రమారమి రూ.2లక్షల వరకూ నష్టపోవాల్సి వచ్చింది.
ఆరుగాలం కష్టార్జితానికి ఆశించిన మద్దతు ధర దక్కుతుందన్న సాగుదారుల ఆశలు అడియాసలే అవుతున్నాయి. పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర దక్కేలా చూస్తామంటూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలయ్యే పరిస్థితులు కన్పించడం లేదు. అధికారికంగా నిర్దేశించుకున్న కొనుగోళ్ల లక్ష్యం పూర్తికాకపోయినా కొనుగోలు కేంద్రాలు మూతపడడంతో ఇంకా అన్నదాతల వద్దే ఉన్న దాదాపు 3.99 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో 1.67 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. మొదట 13లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు ఊహించిన అధికారులు అధిక వర్షాలు, వరదల కారణంగా దాన్ని 9.5లక్షల మెట్రిక్ టన్నులకు కుదించారు. మార్కెట్‌లో ధర పలికే సన్నరకాలు పోనూ 5.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో గత నవంబరులో 302 కేంద్రాలు ప్రారంభించారు. జనవరిలో కొన్ని రైస్ మిల్లుల లక్ష్యం పూర్తయిందన్న వంకతో కొనుగోళ్ల ప్రక్రియ మందగించింది. అదనంగా ధాన్యం కొనుగోలు చేయడానికి పలువురు రైస్‌మిల్లర్లు కోరినా ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలంటూ అధికారులు చేతులెత్తేశారు. జనవరిలోనే నిర్దేశిత లక్ష్యం పూర్తయ్యిందంటూ రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిలిపివేశారు. రైతులు,




కొందరు ప్రజాప్రతినిధులు ఆందోళన చేయడంతో కేవలం 30వేల టన్నుల కొనుగోలుకు అనుమతించారు. అదీ పూర్తికావడంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

**మార్కెట్లో అమ్ముకోమంటున్నారు..**

రెండో పంట, ఇతరత్రా కారణాలతో రమారమి 3.99లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్దే మిగిలిపోయింది.అపరాలతో పాటు వరి మాసూలు చేసిన రైతులు అమ్ముకునేందుకు రైతుసేవా కేంద్రాలకు వెళితే ప్రభుత్వ ఆదేశాలు లేవని, సర్వర్ ఓపెన్ కాదని చెబుతున్నారు. మార్కెట్‌లో అమ్ముకోవాలంటూ సూచిస్తున్నారు. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పుకు వడ్డీలు పెరిగిపోతుండడంతో రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. వారు బస్తాకు రూ.300 వరకూ తక్కువకు అడగడమే కాకుండా నగదు ఇచ్చేందుకు గడువులు పెడుతున్నారు. దీంతో ధాన్యాన్ని అమ్ముకోలేక... నిల్వ ఉంచుకోలేక అయోమయ స్థితిలో రైతులు ఉన్నారు.

# అనుమతి లేని పరీక్షలు

మార్టేరు :తాడేపల్లిగూడెంలోని రామారావుపేట, జూబ్లీ రోడ్డులో అనుమతులు లేని ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. వారంలో ఒక రోజు ప్రత్యేక వైద్యుడిని తీసుకొచ్చి అధిక ఓపీ ఫీజు వసూలు చేస్తూ సేవలు అందిస్తున్నారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధమైనా, బహిరంగంగానే తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇదే పట్టణంలో నాలుగేళ్ల బాలిక అనారోగ్యంతో ఒకే రోజు వేర్వేరు చోట్ల పరీక్షలు చేయించుకోగా వేర్వేరు ఫలితాలు వచ్చాయి. దీంతో ల్యాబ్‌ల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం బోర్డులు లేకుండానే పెనుమంట్ర పంచాయతీ పరిధి బ్రాహ్మణచెర్వు కేంద్రంగా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ఆర్‌ఎంపీలు ఇచ్చే సమాచారం మేరకు సిబ్బంది అక్కడికి వెళ్లి నమూనాలు సేకరించి ఫలితాల నివేదికలను ఇస్తున్నారు. ఈ రకంగా అనధికారికంగా కార్యకలాపాలు సాగిస్తూ ప్రజల నుంచి భారీగా దండుకుంటున్నారు. ఇదంతా వైద్యాధికారులకు తెలిసినా మౌనంగా ఉండటం గమనార్హం. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని ఏ అనుమతులు లేకుండానే కొందరు ల్యాబ్‌ల నిర్వహణ చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో గుర్తింపు పొందిన ల్యాబ్‌లు సుమారు 350 మాత్రమే ఉ



న్నాయి. వైద్యులు, ఆర్‌ఎంపీలు, పీఎంపీల సూచన మేరకు రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో అనధికార ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించుకుంటున్నారు. వాటిల్లో రోగుల నుంచి భారీ మొత్తంలో దోచేస్తున్నారు. ఒక్కో ల్యాబ్‌లో ఒక్కో తీరులో ఫలితాలు వస్తున్నాయి. దీంతో రోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.
అర్హతలు లేని వ్యక్తులతో.. ఈ ల్యాబ్‌లలో పనిచేసే సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేయాల్సి ఉండగా పదిశాతం మినహా మిగిలిన వారు ఎటువంటి అర్హత లేకుండానే పరీక్షలు చేస్తున్నారు. కోర్సు చేసినవారి అర్హత పత్రాలను అడ్డుపెట్టుకుని ల్యాబ్‌లను నడుపుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలే అనధికారి ల్యాబ్‌లను ప్రోత్సహిస్తున్నారు. దీంతో వీరిచ్చే రోగ నిర్ధారణ ఫలితాలు సమగ్రంగా ఉండటం లేదు. ల్యాబ్‌లో సౌకర్యాలను, సిబ్బంది అర్హతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన యంత్రాంగం ఉదాసీన వైఖరిని అవలంబిస్తోంది.
గుర్తించి చర్యలు తీసుకుంటాం.. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన ల్యాబ్‌ల్లో ప్రమాణాలను పాటిస్తూ రోగులకు పరీక్షలు చేయాలి. అనధికారికంగా ల్యాబ్‌లు నిర్వహిస్తే అటువంటివి గుర్తించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.– భానునాయక్, జిల్లా వైద్యాధికారి, భీమవరం

# కృష్ణమ్మ జలసవ్వడి ఇక మూడు రోజులే!



అనంతపురం : రానున్న మూడు రోజుల్లో గలగలపారే కృష్ణమ్మ సవ్వడులు వినిపించవు. వచ్చే శనివారం నాటికి హంద్రీనీవా ప్రధాన కాలువలో నీటి ప్రవాహం ఆగిపోనుంది. ఇందుకు సంబంధించిన సంకేతాలు ఇక్కడి జలవనరుల అధికార యంత్రాంగానికి చేరవేశారు. ప్రస్తుత నీటి సీజన్‌లో మొత్తం 24.351 టీఎంసీలు జిల్లా సరిహద్దుకు చేరాయి. గత రెండేళ్లతో పోల్చితే ఈ దఫా ఎక్కువ జలాలు జిల్లాకు రావడం విశేషం. శ్రీశైలం జలాశయం వెనుక భాగంలో నంద్యాల జిల్లా మాల్యాల పంపుహౌస్ నుంచి మొత్తం 27.604 టీఎంసీల నీటిని ఎత్తిపోయగా.. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 3.253 టీఎంసీలు వినియోగించారు. తక్కిన 24.351 టీఎంసీలు ఉమ్మడి అనంత జిల్లాకు చేరాయి. గతేడాది ఆగస్టు 1న నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి ఈనెల 8 నాటికి లెక్కిస్తే మొత్తం 220 రోజులు నిర్విఘ్నంగా నీటి ప్రవాహం కొనసాగింది. వైకాపా ప్రభుత్వ హయాంలో మధ్యమధ్యలో నీటి ఎత్తిపోసే ప్రక్రియను ఆపేస్తూ వచ్చారు. విద్యుత్తు మోటర్లకు సంబంధించిన బిల్లు ఎక్కువ వస్తుందన్న ఉద్దేశంతో నీటి ఎత్తిపోతలను నిలుపుదల చేశారు. ప్రస్తుత నీటి సీజన్‌లో ఒక్కరోజు కూడా నీటి ప్రవాహం ఆగలేదు. ఈనెల 8నాటికి మల్యాల నుంచి నీటి సరఫరా బంద్ అయ్యే అవకాశం ఉందని హంద్రీనీవా ఎస్‌ఈ స్వరూప్ కుమార్ తెలిపారు. దిగువ కాలువలకు నీటి ప్రవాహం మరికొన్ని రోజులు కొనసాగుతుందన్నారు.

**89 చెరువులు...**అనంత జిల్లా పరిధిలో 144 కి.మీ. నుంచి జీడిపల్లి జలాశయం ఉన్న 216 కి.మీ. దాకా 8.160 టీఎంసీలను వాడారు. గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో 15 చెరువులకు, రెండో దశ కాలువ కింద ఉన్న కళ్యాణదుర్గం, రాప్తాడు, అనంత, పెనుకొండ, కదిరి, పుట్టపర్తి, మడకశిర, హిందూపురం, ధర్మవరం వంటి ప్రాంతాల్లో ఉన్న 74 చెరువులకు నీరు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 89 చెరువులను భర్తీ చేశారు. పీఏబీఆర్ జలాశయానికి 2.091, ప్యాకేజీ 36కు 0.168 టీఎంసీల జలాలను సరఫరా చేశారు. వచ్చే శనివారం లేదా ఆదివారం నాటికి నీటి సరఫరా బంద్ అవుతుంది. ముచ్చుమర్రి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను కొనసాగిస్తారా లేదా? అన్నదానిపై సందిగ్ధం నెలకొంది.

**5.681 టీఎంసీలు వృథా** ఉమ్మడి అనంత జిల్లా సరిహద్దుకు మొత్తం 24.351 టీఎంసీలు చేరగా.. ఇందులో ప్రధాన కాలువ తొలి విడత పరిధిలో 8.160 టీఎంసీలు, రెండో విడత పరిధిలో 16.191 టీఎంసీలను వినియోగించారు. జిల్లాకు చేరిన మొత్తం జలాల్లో ఏకంగా 5.681 టీఎంసీలు ఆవిరి, లీకేజీ.. వంటి రూపాల్లో వృథా అయ్యాయి. ప్రస్తుతం జిల్లా సరిహద్దులో 383 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. జీడిపల్లి జలాశయానికి 297 క్యూసెక్కుల మేర చేరుతున్నాయి. ఇక్కడి నుంచి రెండో దశ ప్రధాన కాలువకు 314 క్యూసెక్కుల ప్రవాహం వెళ్తోంది.

# టమాటా ధరల పతనం.. గిట్టుబాటు గగనం



అనంతపురం : తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే టమాటా సాగుపై అనంత రైతులు మక్కువ చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్, రబీలో పంట సాగు చేస్తున్నారు. దిగుబడి వస్తున్నా మార్కెట్‌లో ధరలు క్రమేణా పతనం అవుతున్నాయి. పెట్టుబడి కూడా చేతికందక నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.10 దాటడం లేదు. సాధారణంగా దిగుబడి తగ్గితే.. ధరలు పెరగాలి. ఉమ్మడి జిల్లాలో ఇందుకు భిన్నంగా ఉంది. అనంతపురం గ్రామీణ పరిధిలోని కక్కలపల్లి మార్కెట్‌లో రోజుకు 4 వేల నుంచి 5 వేల టన్నుల టామాటా వచ్చేది. ప్రస్తుతం 200–300 టన్నులకు పడిపోయింది. దీంతో అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక చర్యలు చేపట్టింది. మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటా కొనుగోలు చేయిస్తూ.. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తోంది. మరింతగా ఊతమిస్తేనే రైతుకు ప్రయోజకరం ఉంటుందని వ్యవసాయ నిపుణలు చెబుతున్నారు.

**రూ.7 కోట్లతో ప్రాసెసింగ్ యూనిట్లు**


కళ్యాణదుర్గం మండలం వెంకటాంపల్లి, కుందుర్పి మండలం బండమీదపల్లిలో రూ.3.50 కోట్లు చొప్పున రెండు ప్రాసెసింగ్ యూనిట్లకు నిధులు... మార్చి, 2023లో మంజూరయ్యాయి. అయినా ఒక్క అడుగు కూడా పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో అధికారులు ప్రాసెసింగ్ యూనిట్ల పనులు చకచకా చేయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఆధ్వర్యంలో నిర్మాణాలు సాగుతున్నాయి. గంటకు ఒకటిన్నర మెట్రిక్ టన్ను టమాటా ప్రాసెసింగ్ చేస్తారు. అందులోనే 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో శీతల గోదాములు నిర్మిస్తున్నారు. పనులు పూర్తి కాగానే రెండు యూనిట్ల నిర్వహణ బాధ్యతలను ఆర్డీటీకి అప్పగించనున్నారు.టమాటాకు ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ధరలు తగ్గినప్పుడు ప్రాసెసింగ్ చేయడం...సాస్, ఊరగాయ, వడియాలు వంటివి తయారు చేయనున్నారు.

**కొనుగోలు చేస్తున్నాం..: సత్యనారాయణచౌదరి, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ**

టమాటా ధరలు సాధారణంగా రూ.7కు తగ్గితే మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేస్తాం. ఇప్పటికే జిల్లాలో గత అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 540 మెట్రిక్ టన్నులు రైతుల నుంచి కొన్నాం. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, భీమవరం, ఏలూరు, ఒంగోలు, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేశాం.

# అదనపు సొమ్ముతో సొంతిల్లు సాకారానికి ఊతం

అనంతపురం : ఐదేళ్ల వైకాపా హయాంలో ఊర్లు నిర్మిస్తామంటూ బీరాలు పలికి పేదలకు చుక్కలు చూపించారు. ఇళ్ల నిర్మాణ సామగ్రి రెట్టింపు కావడంతో వారికి సొంతిళ్లు కలగానే మిగిలింది. ఇళ్లు మంజూరు అయినా ఐదేళ్లుగా కనీసం నిర్మాణం పూర్తి చేసుకోలేని దుస్థితి. లే అవుట్లలో గుత్తేదారులకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలు సైతం బిల్లులు తీసుకొని మధ్యలోనే ఆపేశారు. పెరిగిన ధరలతో పేదలు అప్పులతో మరింత కుదేలు అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇళ్ల నిర్మాణాలపై పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతోంది. పేదలకు సొంతిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీలతోపాటు చేనేతలకు అదనంగా ప్రయోజనం చేకూర్చాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లకు వివిధ దశల్లో ఉన్నా వాటికి కూడా అదనంగా సొమ్ము ఇవ్వాలని నిర్ణయించారు. ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీలకు రూ.50 వేలు, చేనేతలకు రూ.50 వేలు అందజేస్తారు. అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 7,324 ఇళ్లు ఆయా వర్గాల వారి ఇళ్లు లేఅవుట్లు, సొంత స్థలాల్లో నిర్మాణం చేసుకొని వివిధ దశల్లో ఉన్నా వారందరికీ తాజాగా ప్రయోజనం ఒనగూరనుంది. గత వైకాపా హయాంలో కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇంటి నిర్మాణానికి మంజూరు చేసేవారు. కొత్తగా ఇళ్లు నిర్మాణాలు చేసుకొనే వారికి కూటమి ప్రభుత్వం వచ్చిన



అనంతరం ఇతరులకు రూ.2.50 లక్షలు, ఎస్టీలకు రూ.3.25 లక్షలు, ఎస్సీలకు, చేనేతలకు రూ.3 లక్షలు గృహ నిర్మాణానికి బిల్లు అందజేయనున్నారు.అంశం: ఎస్సీ, ఎస్టీ, చేనేతల గృహ నిర్మాణానికి అదనంగా సొమ్ముఅనంతపురం జిల్లాలో ప్రయోజనం పొందే ఎస్సీలు: 5,925ఇచ్చే సొమ్ము: రూ.29.62 కోట్లు
ఎస్టీలు: 1,363అదనంగా ఇచ్చేది: రూ.10.22 కోట్లువేగంగా గృహ నిర్మాణాలకు అవకాశం: శైలజ, గృహనిర్మాణ సంస్థ పీడీఅదనంగా సొమ్ము ఇస్తుండటంతో లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. వేగంగా ఇళ్లు నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం ఉంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వస్తాయి.

# పల్లె నిధులు పక్కదారి

చిత్తూరు : వైకాపా హయాంలో పలు పంచాయతీల్లో నిధులు పక్కదారి పట్టించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను నాటి వైకాపా ప్రభుత్వం దారి మళ్లించగా, మిగిలిన అరకొర నిధులను ఆ పార్టీ నేతలు, సిబ్బంది స్వాహా చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఒకొక్కటిగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ప్రజల ఫిర్యాదులపై విచారించి చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది.

**తేలని లెక్కలు..**పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు, స్థానిక పన్నులు, ఇతరత్రా నిధులకు సరైన లెక్కలు లేవు. ఒకవేళ అందుబాటులో ఉన్నా కాకిలెక్కలేనన్న విమర్శలున్నాయి. వైకాపా నేతలతో కుమ్మక్కైన సిబ్బంది నిధుల దుర్వినియోగానికి సహకరించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే అక్రమాలను నిగ్గు తేల్చే పని ప్రారంభించింది. ఫిర్యాదుల ఆధారంగా విచారణ అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు చేపట్టనున్నారు.
రామకుప్పం మండలం కొంగనపల్లి పంచాయతీ సర్పంచి వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా రూ.7 లక్షలు డ్రా చేసినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలడంతో చెక్ పవర్ రద్దు చేశారు.
బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి సర్పంచి శ్రీనివాసులు అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్థులు ఈ నెల 3న గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత మూడేళ్లుగా బిల్లులు, ఎంబుక్ లేకనే పారిశుద్ధ్య పనులకు సంబంధించి



రూ.10 లక్షలు డ్రా చేశారని, గ్రీన్ అంబాసిడర్స్ వేతనాలు రూ.2 లక్షలకు నకిలీ వోచర్లు సృష్టించారన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలకు బిల్లులు, ఎంబుక్ లేకుండా చెక్కుల ద్వారా నిధులు డ్రా చేసినట్లు సహచట్టం ద్వారా సేకరించిన వివరాలను అధికారులకు నివేధించారు.తుంబకుప్పం పంచాయతీలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శితో పాటు వైకాపా నాయకులు కుమ్మక్కై నిధులు స్వాహా చేసినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై చిత్తూరు డీఎల్‌పీవో పార్వతి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించి నెలలు గడిచినా విచారణలో జాప్యం జరుగుతోంది.
రామకుప్పం మండలం బందార్లపల్లి, గుడుపల్లె మండలం పీబీవాడ, వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి, శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీల్లో వైకాపా హయాంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. వీటన్నింటిపైనా విచారణకు ఆదేశించారు.ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు: 1,411
అభియోగాలున్న పంచాయతీలు: 235
విచారణ సాగుతోంది.. : పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందుతున్నాయి. విచారణ ప్రారంభించాం. నిధులు దుర్వినియోగం జరిగినట్లు తేలిన పంచాయతీల్లో సంబంధిత సిబ్బంది లేదా బాధ్యులైన సర్పంచులపై చర్యలు చేపడతాం.సుధాకర్‌రావు, డీపీవో

# కట్టడాల్లో 'పుర'పాట్లు.. ఇక చెల్లవు

పాలకొల్లు : తాడేపల్లిగూడెంలో 2024లో భవన నిర్మాణాల నిమిత్తం మొత్తం 257 దరఖాస్తులొస్తే 256 అనుమతులిచ్చారు. ఇన్ని అనుమతులిచ్చినా అనధికారికంగా మరో 35 నిర్మాణాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించి 26 మందికి నోటీసులు జారీ చేశారు. అత్యధికంగా నరసాపురంలో 42 అనధికార నిర్మాణాలు గుర్తించి 31 మందికి నోటీసులిచ్చారు. రూ.11 లక్షల వరకు జరిమానాలు వసూలయ్యాయి. జిల్లాలోని పట్టణాల్లో ప్రణాళిక విభాగం తనిఖీలు, పనితీరును ఇది తేటతెల్లం చేస్తుంది. ప్రతి భవనం నిర్మాణానికి అనుమతులు తీసుకోవడం నిబంధనల ప్రకారం యజమానులు నడుచుకోవడాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ఏ పట్టణాన్ని తీసుకున్నా టౌన్ ప్లానింగ్ వ్యవస్థ లోపాలమయంగా తయారవ్వడంతో నిబంధనలు తుంగలో కలిసిపోతున్నాయి. ఇప్పటి వరకు 300 చదరపు గజాలు దాటిన నిర్మాణాలకే పరిమితమైన నివాసయోగ్య పత్రం ఇకమీదట అన్నిటికీ తప్పనిసరి చేశారు. తాజాగా పట్టణాభివృద్ధి శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. వీటిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని



హెచ్చరికలు జారీ కావడంతో అక్రమ నిర్మాణదారుల్లో వణుకు మొదలయ్యింది. ప్రతి పట్టణంలోను పదుల సంఖ్యలో ఉన్న అక్రమ నిర్మాణాలపై ఎటువంటి ఆదేశాలు అందుతాయో అనే దానిపై చర్చ నడుస్తోంది.

**సిఫార్సులకు చెక్కు..**

పట్టణాల్లో పలువురు నిర్మాణదారులు రాజకీయ సిఫార్సులతో అక్రమ కట్టడాలు కడుతున్నారు. ఇటువంటి వాటికి ఇకమీదట చెక్ పెట్టనున్నారు. అనుమతులు పొందిన భవన ప్లానింగ్ కాపీని నిర్మాణం పూర్తయ్యే వరకు ఆ స్థలంలో విధిగా ప్రదర్శించాలి. ప్రస్తుతమైతే ఏ ఒక్క చోట ఇలా కనిపించడం లేదు. తాజా మార్గదర్శకాల్లోను దీనిని పొందుపరిచారు. ప్రతి నిర్మాణంలో ఇంకుడు గుంత ఏర్పాటు తప్పనిసరి. పది శాతం కూడా అమలు చేయడం లేదు.

**పత్రం తప్పనిసరి..** భవిష్యత్తులో నియమాలు తప్పితే నివాసయోగ్య పత్రం మంజూరు చేయరు. అది ఉంటే తప్ప గృహ ప్రవేశంగాని బ్యాంకు రుణాలు, క్రయవిక్రయాలు జరిగే అవకాశం ఉండదు. ఒకవేళ ఎక్కడైనా లంచావతారాలు సదరు పత్రాన్ని జారీ చేసినట్లు రుజువైతే వారి ఉద్యోగానికే ఎసరు పెట్టనున్నారు. దీనిపై పురపాలిక ఆర్డీ సీహెచ్. నాగనరసింహారావును సంప్రదించగా అనధికార నిర్మాణాలన్నిటిపై ఛార్జిషీటు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త ఉత్తర్వుల ప్రకారం తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు.

చరకలు



# పచ్చని అడవికి ‘భూ’తాల కొరివి

నంద్యాల : జిల్లాలో అటవీ భూములు పెద్దఎత్తున ఆక్రమణలకు గురయ్యాయి. రాజకీయ అండదండలతో పాటు అటవీ అధికారుల తోడ్పాటుతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఒక్కొక్కరు పదుల ఎకరాలు కబ్జా చేసి పచ్చదనాన్ని కూకటి వేళ్లతో పెకళిస్తున్నారు. కొందరు గనులు తవ్వుతూ రూ.కోట్లు గడిస్తున్నారు. మరికొందరు బోర్లు వేసుకుని దర్జాగా పంటలు సాగుచేస్తున్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో మరింత రెచ్చిపోయారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు ఈ విషయాన్ని ఇటీవల పంచాయతీరాజ్, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు.

**450 ఎకరాలు పరాధీనం**

మహానంది మండలం కృష్ణనంది క్షేత్రం పరిధిలో పెద్ద ఎత్తున అటవీ భూములు పరాధీనమయ్యాయి. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లోని కడమలకాల్వ, తిమ్మాపురం గ్రామాల పరిధిలో 604, 642 సర్వే నంబర్లలో 449.20 ఎకరాల అటవీ భూమి ఉంది. తెలుగుగంగ కాల్వ చెంతనే ఉన్న ఈ సారవంతమైన భూములు 40 ఏళ్లుగా ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి. మహానంది మండలం తిమ్మాపురం, బుక్కాపురం, బండిఆత్మకూరు మండలం కడమలకాల్వతో పాటు నంద్యాలకు చెందిన కొందరు నాయకులు ఈ భూముల్లో అరటి తోటలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారు.

**ఎర్రమల కొండలకు గుండు**

ఎర్రమల కొండల పరిధిలోని డోన్, బేతంచెర్ల మండలాల్లో అధిక విస్తీర్ణంలో అటవీ భూములను అక్రమార్కులు స్వాధీనం చేసుకున్నారు.



బేతంచెర్ల మండలంలోని సీతారామాపురంలో సర్వే నంబరు 133 (ఏ)లో సుమారు వందెకరాల భూమి అన్యాక్రాంతమైంది. దీనిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు రావడంతో ఇటీవల అటవీ అధికారులు ఆక్రమణదారులకు తాఖీదులిచ్చి చేతులు దులిపేసుకున్నారు.

డోన్ మండలం ధర్మవరం సమీపంలోని కన్నప్పకుంట పంచాయతీలో 50 ఎకరాలకు పైగా కబ్జా చేశారు. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున డోలమైట్ నిక్షేపాలు ఉన్నాయి. దీంతో కొందరు పెద్దఎత్తున అక్రమ మైనింగ్ చేస్తున్నారు. ఇక్కడ ఆక్రమించిన భూమికి కొందరు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా పుట్టించి దర్జాగా బ్యాంకుల్లో రుణాలు పొందడం గమనార్హం.

**కౌలు వసూలు చేస్తున్న సిబ్బంది**

ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన వైకాపా నాయకుల కుటుంబ సభ్యులు ఇద్దరు బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు శివారులో 80 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారు. అందులో మూడు దశాబ్దాలుగా మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఇదే ప్రాంతంలోనే నంద్యాల నియోజకవర్గానికి చెందిన మరో వైకాపా నాయకుని సమీప బంధువులు 30 ఎకరాలను కబ్జాచేసి పండ్ల తోటలను సాగు చేస్తున్నారు.

బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు, శింగవరం, జీసీ పాలెం, కడమలకాల్వ, ఓంకారం సమీపంలోని అటవీ భూములను పలువురు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. ఆక్రమణదారుల నుంచి అటవీ సిబ్బంది కొన్నేళ్లుగా అనధికారికంగా కౌలు వసూలు చేస్తున్నారు. మరికొందరు సిబ్బంది ధాన్యం వసూలు చేస్తున్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో ఆక్రమించి అటవీ భూముల్లో పసుపు, బొప్పాయి పంటలు సాగు చేస్తున్నారు. ముత్యాలపాడు గ్రామంలో ఏకంగా నిర్మాణాలు చేపట్టారు.

**విలువ రూ.కోట్లలోనే..**

తెలుగుగంగ ప్రధాన కాలువ పరివాహక గ్రామాలైన కడమలకాల్వ, నారాయణాపురం, ఈర్నపాడు, మహానంది తదితర ప్రాంతాల్లో ఎకరం భూమి విలువ రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఉంది. నల్లమల అటవీ ప్రాంతంలోనే 1500 ఎకరాలకు పైగా భూమి ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. ఒక్క కృష్ణనంది ప్రాంతంలోనే 450 ఎకరాల భూమి ఆక్రమణల్లో ఉంది. నల్లమల పరిధిలో అన్యాక్రాంతమైన భూమి విలువ రూ.350 కోట్లకుపైగా ఉంటుంది.

# క్రమబద్ధీకరణలో అక్రమాల పద్దు

ఆదోని : ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో అక్రమ లేఅవుట్లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. వాటి క్రమబద్ధీకరణ పేరుతో గత వైకాపా ప్రభుత్వం ఇష్టానుసారంగా రుసుము వసూలు చేసింది. అనుమతుల్లేకుండా వేసిన లేఅవుట్లకు అనుమతులిస్తామని ఊరించి, వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో చాలా మంది దరఖాస్తులు చేసుకుని రుసుము చెల్లించారు. ప్రస్తుతం డబ్బు చెల్లించినవారి



పరిస్థితి అయోమయంగా మారింది. ఆ సొమ్మంతా ఏమైందో అంతుచిక్కని పరిస్థితి.

**‘ఉత్త’ర్వులు జారీ చేసి**వైకాపా ప్రభుత్వ హయాంలో 2020లో లేఅవుట్ క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో వెయ్యికిపైగా దరఖాస్తులు వచ్చాయి. సుమారు రూ.8–10 కోట్లు ఆదాయం వచ్చింది. వచ్చిన దరఖాస్తులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపలేకపోయారు. గడువులు విధిస్తూ కాలయాపన చేస్తూ వచ్చారు నాన్ లేఅవుట్‌దారుల సమస్యలకు చెక్ పెడతామని నాటి వైకాపా ప్రభుత్వం ఆదాయవనరుగా మార్చుకోవాలని భావించి జీవోను విడుదల చేసింది. స్థల యజమానులు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీంను ఆశ్రయించి దరఖాస్తులు చేసుకున్నారు. అందులోనూ అక్రమాలకు చెక్ అంటూ అంతర్జాల విధానాన్ని తెరపైకి తెచ్చారు. కొన్నింటికి పరిష్కారం చూపగా, మరికొన్ని అపరిష్కృతంగా మిగిలాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారిపోవడంతో కూటమి ప్రభుత్వం సరిదిద్దాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# సొంతింటి కల నెరవేర్చాలని..



చిత్తూరు: ఎప్పటికైనా సొంతంగా ఓ గూడు నిర్మించుకుని అందులో స్థిరపడాలన్నది పేదల ఆకాంక్ష. వైకాపా హయాంలో నామమాత్రంగానే సాయం లభించడంతో ఈ కల నెరవేర్చుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. కేంద్రం సహకారంతో కూటమి ప్రభుత్వం మరింత చేయూత అందించాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే సొంత స్థలం ఉన్న వ్యక్తులు ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. సచివాలయ సిబ్బంది సైతం డిమాండ్ సర్వే ద్వారా సమాచారం సేకరించగా.. పేదల నుంచి పెద్దఎత్తున అర్జీలు వస్తున్నాయి.

జగన్ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇళ్ల నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్రం నుంచి వచ్చే రూ.1.80 లక్షలతోనే సరిపెట్టుకోవాలని ఉత్తర్వులిచ్చారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొండలు, గుట్టల్లో పట్టాలు ఇచ్చినందున పునాదులకే రూ.2 లక్షలు– రూ.2.50 లక్షలు ఖర్చయింది. దీంతో ఎక్కువ మంది గృహ నిర్మాణాలకు మొగ్గు చూపలేదు. ఈ క్రమంలో గతంలో మొదలు పెట్టిన వ్యక్తుల ఇళ్ల ఫొటోలు అప్‌లోడ్ చేసి బిల్లులు చేసుకున్నారు. ఇలా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని చెప్పుకొచ్చారు.

**రూ.2.50 లక్షలు ఇస్తామన్న ప్రకటనతో..**గతేడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.2.50 లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తామని సూచనప్రాయంగా తెలిపింది. ఈనేపథ్యంలోనే ఎక్కువ మంది ఇళ్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు తిరుపతి జిల్లాలో 21,600 దరఖాస్తులు రాగా చిత్తూరు జిల్లాలో 20వేల అర్జీలు.. రెండుచోట్ల కలిపి 41,600 మంది వినతులు సమర్పించారు.

**పురపాలికల్లో 4,306 మాత్రమే**

చిత్తూరు నగరపాలక సంస్థతోపాటు కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి పురపాలికల్లో కలిపి 1,875 అర్జీలు, తిరుపతి జిల్లాలో 2,431 మంది డిమాండ్ సర్వేలో వివరాలు ఇచ్చారు. తిరుపతి, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ)ల్లోనే సింహభాగం దరఖాస్తులు వచ్చాయి. ఏకంగా 37,294 మంది గృహం మంజూరు చేయాలని విన్నవించారు. యూడీఏల్లో గ్రామీణ ప్రాంతాలే ఎక్కువ.

**రెవెన్యూ అధికారుల పరిశీలన తర్వాతే**

రెండు జిల్లాల్లో దరఖాస్తు చేసిన అర్జీదారులకు ఆయా ప్రాంతాల్లో అనుభవ ధ్రువీకరణ పత్రం ఉందా? లేదంటే సొంత స్థలం ఉందా? అని రెవెన్యూ అధికారులు పరిశీలిస్తారు. వారి ఆదాయం ఎంత? నిజంగానే అర్హులా అని నిర్ధారించుకుంటారు. ఆ తర్వాత జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపితే గృహం మంజూరవుతుంది. ప్రస్తుతానికి పట్టణాల్లో ఇళ్ల మంజూరుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు.

# ఈ తప్పెవరిది?



చిత్తూరు : ఐదేళ్ల వైకాపా పాలనలో పెద్దాయన అండతో ఎస్పీడీసీఎల్‌లో కొందరు ఉన్నతాధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి 8 నెలలు కావస్తున్నా వైకాపాతో అంటకాగిన అధికారుల తీరు మారలేదు.. అన్నదాతలు అవస్థలు పడుతుంటే మాకేంటన్నట్లు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే ఉద్దేశంతో విద్యుత్తు వైర్లు (కండక్టర్లు), పరికరాల సరఫరాలో తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు వైర్లు, అనుబంధ పరికరాల కొరత తీవ్రంగా ఉంది. కొత్త సర్వీసులు అమర్చాలంటే వైర్లు, 50 రకాల అనుబంధ పరికరాలు అవసరం. గోదాములో ప్రస్తుతం నియంత్రికలు తప్ప ఏమీ లేవు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు 1,500 కి.మీ., తిరుపతి జిల్లాకు 2,500 వేల కి.మీ. మేర విద్యుత్తు వైరు అవసరం. రైతులు కొత్త సర్వీసులు, తీగలు, పరికరాల కోసం తిరుగుతున్నా ఫలితం లేదు. త్వరలో వస్తాయని చెబుతూ అధికారులు నెలల తరబడి గడిపేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తాము సాగు చేసిన పంటలకు నీటి తడులు లేక సాగు ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు.

**అధిక ధరలకు కొనుగోలు**

వైకాపా హయాంలో ఆ పార్టీ పెద్దలకు కోట్లాది రూపాయలు దోచిపెట్టాలనే ఉద్దేశంతో కొందరు ఉన్నతాధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు నియంత్రికలు, అనుబంధ పరికరాలను కమీషన్ల కోసం అధిక ధరలకు కొనుగోలు చేశారు. రైతులపై భారం వేశారు.

జిల్లాలో పెండింగ్ సర్వీసుల వివరాలు

వ్యవసాయ సర్వీసులు: 3,250

వాణిజ్య: 105

పరిశ్రమలు: 10

ఎస్పీడీసీఎల్ పరిధిలో అవసరమైన కండక్టర్: 1,500 కి.మీ. మేర

**నిర్ణయంలో జాప్యం..**పెంచిన ధరలు తగ్గించి అనుబంధ పరికరాలు కొనుగోలు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారులకు సూచించింది. వైకాపాతో అంటకాగిన అధికారులే టెండర్లు ఆహ్వానించారు. రెండుసార్లు పిలిచినా తక్కువ ధరకు గుత్తేదారులు కోట్ చేయకపోవడంతో రద్దు చేశారు. మరోసారి పిలిచి నెల రోజులు కావస్తున్నా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. రైతులు అవస్థలు పడుతున్నా.. సంస్థ ఆర్థికంగా నష్టపోతున్నా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ శాఖ అధికారులే విమర్శిస్తున్నారు. నెలాఖరుకు సరఫరా..విద్యుత్తు వైర్లు, అనుబంధ పరికరాలను ఈ నెలాఖరుకు తెప్పించి సరఫరా చేస్తాం. టెండర్ల ప్రక్రియలో కొంత జాప్యంతో ఇలా జరిగింది. జానకిరామ్, సీజీఎం, కొనుగోలు విభాగం, ఏపీఎస్పీడీసీఎల్

# కూ.. చిక్కుల్లేని ప్రయాణం సాగేలా!



తిరుపతి: నిత్యం భక్తులు, ప్రజల రాకపోకలతో కిటకిటలాడే తిరుపతి రైల్వేస్టేషన్‌లో సరిపడా సౌకర్యాలు లేవు. దీన్ని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని గతంలోనే రైల్వేశాఖ ప్రకటించింది. తాజాగా ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మరోసారి పునరుద్ఘాటించారు. తిరుపతి రైల్వేస్టేషన్ మీదుగా రోజూ 90 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. సాధారణ రోజుల్లో లక్ష మంది.. పర్వదినాలు, సెలవుల్లో 1.20 లక్షల మంది వస్తుంటారు. ఉత్తరం, దక్షిణం ఇలా ఇరువైపులా అభివృద్ధి చేసేందుకు రూ.312 కోట్లు వెచ్చిస్తున్నారు. దక్షిణ దిశలో నూతన భవనాలు, ఒకటి నుంచి ఆరో ప్లాట్‌ఫాం వరకు ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మించారు. బుకింగ్ కౌంటర్లు, విశ్రాంతి గదులు, లిఫ్టులు, ఎస్కలేటర్లు నిర్మిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు అనువుగా పనులు జరుగుతున్నాయి. మొత్తంగా విమానాశ్రయాల తరహాలో సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ః 2020 జూన్‌లో పనులు ప్రారంభం కాగా ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**మిగిలిన చోట్లా..**తిరుపతి తరహాలోనే శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, పాకాల, రేణిగుంట, చిత్తూరు, కుప్పం స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద పనులు జరుగుతున్నాయి.

శ్రీకాళహస్తిలో మూడో ప్లాట్‌ఫాం కడుతున్నారు. ప్రయాణికుల హాలు నిర్మిస్తున్నారు.

సూళ్లూరుపేటలో రెండు లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. చెంగాలమ్మ ఆలయ తరహాలో ముఖద్వారం నిర్మిస్తున్నారు.

చిత్తూరు స్టేషన్‌కు రూ.17 కోట్లు కేటాయించారు. విశాలమైన వాహనాల పార్కింగ్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్‌ఫాం షెడ్డు విస్తరిస్తు న్నారు. మరుగుదొడ్లు, లిఫ్టులు అందుబాటులోకి తెచ్చారు.

భూసేకరణలోనే చిక్కంతా..

2011–12లో నడికుడి– శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు మంజూరయ్యాయి. రూ.2,289 కోట్లతో 309 కిలోమీటర్ల మేర పనులు చేయాలి.

ఇందులో 50 శాతం నిధులు రాష్ట్రం ఇవ్వాలని కేంద్రం సూచించింది. భూసేకరణ వ్యయాన్ని కూడా భరించాలని స్పష్టం చేసింది.

ఇది అందుబాటులోకి వస్తే హైదరాబాద్, చెన్నై, తిరుపతి మధ్య 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

ప్రస్తుతం 70 కిలోమీటర్ల మేర నిర్మాణం జరిగింది.

భూసేకరణలో అసలు చిక్కు ఉంది. దాదాపు 1,800 ఎకరాల వరకు సేకరించాలి. దీనిపై దృష్టి పెడితే రాబోయే రోజుల్లోనైనా పనులు వేగంగా జరుగుతాయి.

దీనిపై దృష్టి పెడితే రాబోయే రోజుల్లోనైనా పనులు వేగంగా జరుగుతాయి.

# తుంగలో కట్ట కేసీకి కటకట

కర్నూలు : మంత్రాలయం నియోజకవర్గ పరిధికి అత్యంత సమీపంలో కర్ణాటక భూభాగంలో ఆ ప్రభుత్వం ‘బ్రిడ్జ్ కం బ్యారేజ్’ను రూ.397.50 కోట్లతో నిర్మాణానికి ప్రయత్నించడంపై కలకలం రేగుతోంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తవ్వడంతో కర్ణాటకలోని తుంగభద్రపై చిక్కల్‌పర్వి దగ్గర బ్యారేజ్ నిర్మాణానికి ఆ రాష్ట్ర అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తుంగభద్రపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ఆ నది ప్రవహించే సరిహద్దు రాష్ట్రాల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అందులో భాగంగా ఆ రాష్ట్ర మంత్రి బోస్‌రాజ్ కొన్ని నెలల కిందట కర్నూలులోని స్థానిక ప్రజాప్రతినిధులకు ఈ విషయాన్ని తెలియజేస్తే వారంతా తిరస్కరించారు. ఇవేవీ పట్టించుకోని ఆ రాష్ట్రం బ్యారేజ్ సామర్థ్యం కేవలం 0.34 టీఎంసీలు మాత్రమేనని అంటూ ఆ బ్యారేజ్‌కు ఏకంగా 73 స్లూయిస్‌లు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు.

**అభ్యంతరాలు లేవనెత్తినా**

కేసీ ఆయకట్టులో ఎక్కువ భాగం నంద్యాల జిల్లా పరిధిలో ఉండటంతో ఎమ్మెల్యేలు గౌరు చరిత, జయసూర్య, భూమా అఖిలప్రియలు కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య పలు అభ్యంతరాలు లేవనెత్తగా కర్ణాటక అధికారు



లు వాటికి సమాధానమిచ్చారు. మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి అనుమతులు ఇవ్వొద్దని స్పష్టంగా తెలిపారు. బ్యారేజ్‌కు ఏర్పాటుచేస్తున్న స్లూయిస్‌లలో కొన్నింటిపై నియంత్రణను సంపూర్ణంగా ఇవ్వాలన్న ఏపీ అధికారుల ప్రతిపాదనను కర్ణాటక తిరస్కరిస్తుండటం గమనార్హం.

**జిల్లా నీటి వాటాకు కోత పడే ప్రమాదం**

తుంగభద్ర డ్యామ్ నుంచి ఏటా సగటున ఏడు టీఎంసీల నీటిని అధికారికంగా ఏపీ వినియోగించుకుంటోంది. బ్యారేజ్ నిర్మిస్తే ఏడు టీఎంసీల నీటి పరిమాణం తగ్గే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నవంబరు నుంచి జూన్ వరకు డ్యామ్ నుంచి వచ్చే ఆ ఏడు టీఎంసీల నీరే ఏపీకి, ఉమ్మడి కర్నూలు వాసులకు అత్యంత కీలకం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు, కర్నూలులోని 6.50లక్షల మందికి, పశ్చిమ ప్రాంతంలోని 286 గ్రామాల వారికి, కేసీ కాలువకు ఆనుకుని ఉన్న మరో 42 గ్రామాల తాగునీటి అవసరాలకు తుంగభద్ర నీరే కీలకం.

నీటి వాటా అందడంలో సమస్యలొస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు, సాధారణ ప్రజలు విలవిల్లాడాల్సిన పరిస్థితి ఎదురవుతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

నిర్మాణ వ్యయం: రూ.397.50 కోట్లు

స్లూయిస్‌ల సంఖ్య: 73

నీటి ప్రవాహ సామర్థ్యం: 7,65,898 క్యూసెక్కులు

నిల్వ సామర్థ్యం: 0.34 టీఎంసీలు

లేఖ వచ్చిన విషయం వాస్తవమే

కబీర్ బాషా, సీఈ, జలవనరులశాఖ, కర్నూలు

కర్ణాటక ప్రభుత్వ చిన్ననీటిపారుదల, భూగర్భ జలాల అభివృద్ధి విభాగం ఉన్నతాధికారుల నుంచి ‘బ్రిడ్జ్ కం బ్యారేజ్’ నిర్మాణానికి అనుమతి కోరుతూ లేఖ వచ్చిన విషయం వాస్తవమే. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో చర్చించి అభిప్రాయాలను తెలియజేస్తాం.

# నిధులకు ‘మంట’

కర్నూలు : “డాడీస్ రోడ్ సంస్థ వాహనదారులకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు విక్రయిస్తోంది. రూ.599 విలువైన ఆ స్టిక్కర్ వాహనంపై అతికిస్తే వాహనదారులకు ఆ సంస్థ కొన్ని రకాల సేవలు అందిస్తోంది. సదరు సంస్థ నియోజకవర్గ స్థాయిలో అవుట్‌లెట్లు ప్రారంభించడానికి డీలర్‌షిప్‌లు ఇస్తోంది. కొనుగోలుదారులతో అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి మాట్లాడటం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వర్తిస్తూ వ్యాపారాలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రాలు ఉంచాలని స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి.. జిల్లా అగ్నిమాపకశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొన్ని నెలలకే సీఎం చిత్ర పటాన్ని తొలగించడం.. డిప్యూటీ సీఎం ఫొటోనే ఏర్పాటు చేయకపోవడం..



సదరు అధికారి వ్యవహార శైలి చర్చనీయాంశంగా మారింది.

**వైకాపా నేతలతో సత్సంబంధాలు**

కృష్ణా జిల్లాలో విధులు నిర్వర్తించిన కాలంలో ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రొబేషన్ సమయంలోనే సస్పెండ్ అయినప్పటికీ అనూహ్యంగా గత వైకాపా ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో ఇచ్చి మరీ ఆయన ప్రొబేషన్‌ను ఆమోదించింది. సాధారణంగా ప్రొబేషన్ సమయంలో సస్పెండ్ అయితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. ఆయన సోదరుడు అన్నమయ్య జిల్లాలో వైకాపా నాయకుడిగా గుర్తింపు పొందారు. వైకాపా హయాంలో నియమితులైన ఆయన ఆ పార్టీ నేతలతో అంటకాగారు.

**దస్త్రాలు గల్లంతు**

బహుళ అంతస్తుల భవనాలతో పాటు జాతీయ భవన నిర్మాణ కోడ్ (ఎన్‌బీసీ) నిబంధనలు పాటించని వాటికి రాష్ట్రస్థాయిలో డీజీ నుంచి జిల్లాస్థాయిలో డీఎఫ్‌వో వరకు అనుమతులు ఇచ్చారనే విమర్శలున్నాయి. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో కొన్ని భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన దస్త్రాలు జిల్లా కార్యాలయంలోనే లేవని పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. మరికొన్నింటికి ఆన్‌లైన్ విధానంలో కాకుండా ఆఫ్‌లైన్‌లో అనుమతులు ఇచ్చారు.

**సంక్షేమ నిధుల పక్కదారి**

అగ్నిమాపకశాఖ రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పెట్రోలు బంకులు నిర్వహిస్తోంది. ఆయా పెట్రోలు బంకులపై వచ్చే ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికి వినియోగించేవారు. ఆశాఖ డీజీగా పి.వి.సునీల్‌కుమార్ ఉన్నప్పుడు ఆ సంక్షేమ నిధులను పక్కదారి పట్టించి డీజీ కోసం ఏకంగా రూ.60లక్షలకు పైగా ఖరీదైన ఫార్చ్యూనర్‌ను కొనుగోలు చేశారనే దానిపై ఆశాఖ వర్గాల్లో చర్చ రేగుతోంది.

## పర్యాటకుల భద్రత ప్రశ్నార్థకం?

లేపాక్షి ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన లేపాక్షిలో పర్యాటకుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేసిన పోలీస్ కేంద్రం నేడు నిరుపయోగంగా మారింది. ఏకశిలా నంది విగ్రహానికి 10 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రారంభించిన తర్వాత ఎనిమిది నెలలు మాత్రమే సేవలందించింది. నాటి నుంచి దీన్ని వాడుకలోకి తీసుకురాకపోవడమే గాక సిబ్బందిని కేటాయించకపోవడంతో లక్ష్యం నీరుగారినట్లయ్యింది.

**ఆకతాయిలకు అడ్డాగా..:** పర్యాటకుల భద్రతే లక్ష్యంగా గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 21 పర్యాటక కేంద్రాల్లో ఈ పోలీస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే లేపాక్షిలో 2023 ఫిబ్రవరి 14న అప్పటి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో ఏఎస్సైతో పాటు నలుగురు పోలీసులు రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ భద్రత, సేవాభావంతో పని చేసేవారు.




పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా క్షణాల్లో అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించేవారు. ఇటువంటి సేవలందించిన కేంద్రం ఆకతాయిలకు అడ్డాగా మారిపోయింది. అంతేకాక కేంద్రం చుట్టూ మద్యం సీసాలు తినుబండారాలతో పాటు చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. సుదూర ప్రాంతాల నుంచి ఆలయ సందర్శనకు వచ్చే పర్యాటకులకు నంది విగ్రహం చెంత ఉన్న పోలీస్ కేంద్రం దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. కూటమి ప్రభుత్వం దీన్ని పునః ప్రారంభించి పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై హిందూపురం గ్రామీణ మండల సీఐ జనార్ధన్ మాట్లాడుతూ లేపాక్షి నంది విగ్రహం సమీపంలో నిరుపయోగంగా ఉన్న పర్యాటక పోలీస్ కేంద్రానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. ఉన్న సిబ్బందితోనే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

## విమానాశ్రయ భూముల్లో మట్టి తోడేళ్లు..!

కుప్పం : కుప్పం నియోజకవర్గానికి విమానాశ్రయం తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తుంటే అందుకు సేకరించిన భూమిలో మట్టి తోడేళ్లు చెలరేగుతున్నాయి. అక్రమాన్ని ప్రశ్నిస్తే.. దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుప్పంతోపాటు జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల సత్వర రవాణా, మార్కెటింగ్ వసతి, గిట్టుబాటు ధరల కోసం రామాపురం వద్ద విమానాశ్రయాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. శాంతిపురం, రామకుప్పం మండలాల సరిహద్దులోని అమ్మవారిపేట, కిలాకిపోడు, కడిసనకుప్పం, మణీంద్రం రెవెన్యూ పరిధిలో కార్గో ఎయిర్‌పోర్టు కోసం ప్రభుత్వం 499 ఎకరాల భూసేకరణ చేపట్టింది. విమానాశ్రయంతోపాటు ఇతరత్రా అవసరాల కోసం అదనంగా 1,050 ఎకరాల భూసేకరణకు



చర్యలు చేపడుతున్నారు. ప్రతిపాదిత భూములు ఎయిర్‌పోర్టు అథారిటీ అధికార బృందం ఇటీవల పరిశీలించి వెళ్లింది. నిర్దేశిత భూముల్లో చాలా వరకు బీళ్లుగా ఉండటంతో అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపడుతున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

అమ్మవారిపేట, రామాపురం, విజలాపురం, కిలాకిపోడు, జీడిగుట్లు, నిమ్మనపల్లె తదితర గ్రామాల సమీపంలోని ఎయిర్‌పోర్టు భూముల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం సేకరించిన భూములతో పాటు కొత్తగా ప్రతిపాదిత స్థలాల్లో భారీ యంత్రాలతో అడ్డదిడ్డంగా మట్టి తవ్వేస్తుండటంతో భూములు రూపు కోల్పోతున్నాయి.

**పరిశీలించి.. అడ్డుకుంటాం..** రామాపురం విమానాశ్రయం భూముల్లో తవ్వకాలపై సమాచారం లేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. తవ్వకాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. శ్రీనివాసరాజు, కుప్పం ఆర్డీవో

## చెరువులకు జీవం

చిత్తూరు : సాగు, తాగునీటికి ముఖ్య ఆధారమైన చెరువుల బాగును గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం విస్మరించింది. మరమ్మతులకు చిల్లిగవ్వ ఇవ్వక పోగా.. ఒక పార మట్టి పనిచేయలేదు. ఫలితంగా జల వనరుల శాఖ పరిధిలోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, కుంటల్లో ముళ్లచెట్లు, పెరిగాయి. చెరువు కట్టలు బలహీనమై తెగిపోతున్నాయి. కాలువలు, మొరవలు ఆనవాళ్లు కోల్పోయాయి. కూటమి ప్రభు త్వం జల వనరుల సంరక్షణలో భాగంగా చెరువుల బాగుకు దృష్టి సారించిం ది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చెరువుల మరమ్మతులకు జల వనరుల



శాఖ రూ.436.98 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

**నియోజకవర్గాల వారీగా 1,678 పనులు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు ఐదు వేల చెరువులున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా పరిధిలో నియోజకవర్గాల వారీగా 1,678 పనులకు రూ.436.98 కోట్ల వ్యయ అంచనాలతో ప్రతిపాదనలు పంపామని జిల్లా జల వనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరాజు తెలిపారు. నిధులు రాగానే చెరువు కట్టల బలోపేతం, మొరవల రిపేర్లు, కాలువల పునరుద్ధరణ పనులు చేపడుతామని ఆయన తెలిపారు.

## నిర్వహణ కరవు.. జలాశయాలకు ముప్పు!



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ఏటా వర్షాభావం తలెత్తుతోంది. వరుణుడి కరుణిస్తే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వాన నీరే దిక్కు. తుంగభద్ర జలాలే ఇక్కడి ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్నాయి. వీటికితోడు పెన్నా, చిత్రావతి నదులు ప్రవహించిన సమయాల్లో వాటిపై నిర్మించిన ఆనకట్టలతో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. కొన్నేళ్లుగా హెచ్చెల్సీ ద్వారా వచ్చే తుంగభద్ర నీరే అనంత దాహార్తిని తీరుస్తోంది. వాటిని నిల్వ చేసే ప్రాజెక్టుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. చిన్నపాటి మరమ్మతులు సైతం చేయించలేని దయనీయ దుస్థితి నెలకొంది. గత వైకాపా పాలనలో నయాపైసా నిర్వహణకు ఇవ్వలేదు. షట్టర్లు, గేట్లకు కనీసం గ్రీజు అట్టించలేని దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్యవసరంగా కొన్ని గేట్లను తాత్కాలిక మరమ్మతు చేయించారు. శాశ్వత మరమ్మతులు, నిర్వహణ చేయించకపోతే లీకేజీ రూపంలో డ్యాంలకే ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు.

**సగం టీఎంసీలే..**

ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని పీఏబీఆర్ ప్రాజెక్టు ఉమ్మడి అనంత జిల్లాకు గుండె లాంటిది. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల అధిక శాతం ప్రజల దాహార్తిని తీరుస్తోంది. 11.1 టీఎంసీల సామర్థ్యం ఉన్నా.. ఐదు టీఎంసీలు కూడా నిల్వ చేసుకోలేని పరిస్థితి. ప్రధాన జలాశయ గేట్లు మరమ్మతుకు నోచుకోలేదు. లీకేజీల రూపంలో నీరు వృథా అవుతోంది. ప్రధాన కట్ట బలహీనంగా మారింది. కంపచెట్లు ఏపుగా పెరిగాయి.

**తుప్పుపట్టి..**

చిత్రావతి నదిపై నిర్మించిన యోగివేమన జలాశయం ముదిగుబ్బ మండలంలో ఉంది. ప్రధానంగా 5,6,7,9 గేట్లు బాగా దెబ్బతిన్నాయి. గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు చేయకపోవడంతో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసుకోలేని దుస్థితి. ప్రధాన కట్టపై కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. ఆయకట్టు 12,880 ఎకరాలు.

**దిగువకు పోతూ..**

పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు జలాశయం నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసింది. డ్యాం గేట్లు బాగాలేవు. లీకేజీతో నీరు దిగువకు వెళ్లిపోతోంది. దాదాపు కిలోన్నర మీటరు మట్టికట్ట ముళ్లచెట్లతో నిండిపోయింది.

**డ్యాం పైభాగంలో దెబ్బతిందిలా..** రామగిరి మండల పరిధిలోని పెన్నా నదిపై పేరూరు జలాశయం నిర్మించారు. ఆయకట్టు 12 వేల ఎకరాలు. గత ఐదేళ్లలో గేట్లకు గ్రీజు కూడా పూయలేదు. 5, 8వ గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అన్ని గేట్లకు మరమ్మతులు తప్పనిసరిగా చేయాలని ఇప్పటికే ఇంజినీర్లు నివేదిక ఇచ్చారు.

## కర్బూజకు తెగులు.. కర్షకులకు దిగులు



కదిరి : సంప్రదాయ పంటలతో నష్టపోతున్నాం. కర్బూజ పండిద్దామని భావించిన కరవు రైతులకు నిరాశే ఎదురైంది. చలి అధికం కావటంతో పంటకు వైరస్ సోకింది. తక్షణ చర్యలు కరవటంతో కొన్నిచోట్ల పంట మొత్తం దెబ్బతింది. పెట్టుబడికి చేసిన అప్పులకు వడ్డీ కూడా దక్కని దయనీయ పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి మొదలయ్యే సమయానికి పంట చేతికొస్తుంది. వేసవిలో మంచి డిమాండుతో కాయలు అమ్ముడుపోయి ఆదాయం బాగా వస్తుందని భావించారు. లాభాలు దేవుడెరుగు.. వైరస్‌తో కాయలు కళ్లముందే పొలంలో కుళ్లిపోయాయి. పంట కోత చేయక మునుపే నెత్తిపై నష్టాల పిడుగు పడిందని దోస రైతులు ఆవేదన చెందుతున్నారు. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**ప్రతికూల వాతావరణం**

శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 127 హెక్టార్లలో కర్బూజ సాగు అయింది. ప్రస్తుతం కోత సమయం.. దట్టమైన పొగమంచు ఏర్పడింది. ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఆకులన్నీ ఎర్రబడి, కాయలకు పురుగు పట్టింది. పంటను కాపాడుకునే ప్రయత్నంలో పరిమితికి మించి మందులు పిచికారీతోనూ నష్టానికి కారణమైందని కొందరు రైతులు ఆవేదన చెందుతున్నారు. కళ్లముందే కుళ్లిపోతుండటంతో బాగా ఉన్న కర్బూజ పంటను అమ్ముకుంటే ఎంతో కొంతైనా సొమ్ము వస్తుందని భావించిన రైతులు వ్యాపారులకు కారు చౌకగా అమ్ముకున్నారు. సరైన అవగాహన లేని ఫర్టిలైజర్ వ్యాపారులు రెండు, మూడు రకాల మందులు కలిపి పిచికారీ చేస్తే మంచి దిగుబడి వస్తుందన్న సలహాలు పాటించామని, బాగున్న పంటను నష్టపోయామని మరికొందరు వాపోతున్నారు. ఉద్యాన అధికారులు సలహాలు, సూచనలు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**అప్పులు మిగిలాయి- నవీన్‌రెడ్డి, రైతు, నంగివాండ్లపల్లి**

నాకున్న ఎకరా పొలంలో లాల్‌పూర్ రకం కర్బూజ పంట సాగుచేశాను. పంట సాగుకు, మందులు, ఎరువులు, కూలీలు, సేద్యపు ఖర్చులు తదితర వాటికి రూ.లక్ష పెట్టుబడి వచ్చింది. ఇంకో వారం రోజుల్లో పంట చేతికి వస్తోందని సంతోషపడ్డా. అంతలోనే వైరస్ వచ్చి పంటను నిలువునా నాశనం చేసింది. దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా దక్కక అప్పులు మిగిలాయి.

**20 శాతం దిగుబడి తగ్గుదల- చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన అధికారి, పుట్టపర్తి**

చలి పెరగటం.. పంటపై ప్రతికూల ప్రభావం చూపింది. పంట చేతికొచ్చే సమయంలో సాగు ఎండు ముఖం పట్టి దెబ్బతింది. రైతులకు అవగాహన కల్పించి మందులు పిచికారీ చేస్తున్నాం. చలి ప్రభావంతో సాగు పంటలో 20 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అంతేగాని పూర్తి స్థాయిలో ఎక్కడా దోసపంట దెబ్బతినలేదు.

## రెచ్చిపోతున్న మట్టి మాఫియా



రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. అభివృద్ధి పనుల మాటున రాయదుర్గం పట్టణంతోపాటు గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల్లోని కొండలు, గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో మట్టిని తవ్వేస్తున్నారు. రాత్రివేళ గుట్టుగా కర్ణాటకకు తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ధర నిర్ణయించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు దందా దర్జాగా సాగిస్తున్నారు. రాయదుర్గం పట్టణంలో గతంలో జరిగిన రైల్వే పనుల కోసం తొలుత కణేకల్లు రోడ్డులోని పార్కు సమీపంలో వారం రోజుల పాటు ఓ స్థలంలో మట్టిని తవ్వి తరలించారు. స్థలం యజమాని అడ్డుకోవడంతో అక్కడి నుంచి జారుకున్నారు. ఆ తర్వాత గౌడ లేఅవుట్ సమీపంలో కొండను తవ్వారు. మట్టి తరలింపులో పట్టణానికి చెందిన నాయకులు కీలకంగా వ్యవహరించినట్లు చర్చ నడిచింది. పట్టణ శివారులోని బీటీపీ లేఅవుట్, సిరిగేదొడ్డి, గొల్లపల్లి గ్రామాలకు వెళ్లే దారిలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి స్థలాలను కబ్జా చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు రంగంలోకి దిగి అడ్డుకున్నారు. డి.హీరేహాళ్ మండలంలో మట్టి అక్రమ దందాకు అడ్డుఅదుపు లేకుండాపోయింది. మండల కేంద్రం సమీపంలో మడెనహళ్లికి వెళ్లే దారిలో కుడి, ఎడమ వైపున ఉన్న కొండల్లో మట్టిని తవ్వి కర్ణాటకకు తరలించేశారు. ఒక్కో టిప్పర్ లోడును రూ.4 వేలు నుంచి రూ.5 వేలకు అమ్ముకుంటున్నారు. అధికారులు దాడులు చేస్తున్న సమయంలో మాత్రం తవ్వకాలు ఆపేసి మళ్లీ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. **కఠిన చర్యలు తీసుకుంటాం**

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

ఇటీవల ఎర్రమట్టి తరలిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో క్షేత్ర స్థాయిలో విచారించాం. రహదారిని చదును చేసుకుంటున్నట్లు కాలనీ వాసులు చెప్పారు. ఇప్పటికే పలు చోట్ల దాడులు నిర్వహించి మట్టి తవ్వకాలను అడ్డుకున్నాం. ఎవరైనా మట్టి తవ్వి తరలిస్తే వాహనాలను జప్తు చేస్తాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

## మేతభూమిపై కన్నేసి.. కాజేస్తూ..

ఏర్పేడు : ఏర్పేడు మండలం కోబాక సమీపంలోని పశువుల మేతభూమిలో ఆక్రమణలు మితిమీరుతున్నాయి. కూతవేటు దూరంలో ఆరు వరుసల రహదారి ఉండటమే కాకుండా ఈ ప్రాంతంలో శిక్షణా నైపుణ్యాభివృద్ధి సంస్థను నిర్మించేందుకు గత ప్రభుత్వం 50 ఎకరాల స్థలం కేటాయించింది. ఇదే అదునుగా భావించిన వైకాపా నేతలు గతంలో విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడ్డారు. తమ సొంత ఆస్తుల్లా హద్దులు ఏర్పాటు చేసుకుని ఇంటి స్థలాలుగా మార్చి బయట ప్రాంతాల వారికి విక్రయించారు. వచ్చిన నగదును వాటాల రూపంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పంచుకుంటున్నారు.

సర్వే నంబరు 174లోని 123.5 ఎకరాల మేత భూమిలో 20 ఎకరాల వరకు ఆక్రమణలున్నాయి. మిగిలిన భూముల్లో ఐదేళ్లపాటు వైకాపా



నేతలు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపట్టి బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు.

ప్రశ్నించిన సామాన్యులపై దాడులకు తెగబడటమే కాకుండా కేసులు పెడతామని భయపెట్టారు.


**వైకాపా బాటలోనే..** వైకాపా పాలనలో అక్రమార్కులు ఎలా చెలరేగారో.. అదే తరహాలో ప్రస్తుతం కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. వారితో పోటీపడి మేతభూమిని కాజేయడమే కాకుండా మట్టిని అమ్ముకుం టున్నారు.

**సర్వే చేసి తొలగిస్తాం** ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో అధికారులను కమిటీగా ఏర్పాటు చేసి సర్వే చేయిస్తున్నాం. ఆక్రమణలు గుర్తించి వెంటనే తొలగించడమే కాకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతంలో మట్టితవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. భార్గవి, తహసీల్దార్, ఏర్పేడు

## ప్రసవ వేదన..!

సూళ్లూరుపేట: మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని, గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలని, సులువుగా కాన్పులు జరగాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సేవలకు దూరంగా ఉన్నాయి. ప్రసవాలకు వెళ్లేవారు అరకొరగా ఉంటున్నారు. జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల్లో ఏడాదిలో ఒక ప్రసవం కూడా జరగని దాఖలాలు ఉండటం గమనార్హం.

జిల్లా వ్యాప్తంగా 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 24 గంటలు వైద్య సేవలు అందించేం దుకు ప్రతి కేంద్రంలో వైద్యులతో పాటు 13 మంది సిబ్బందిని నియమించారు. ఇక్కడే ప్రసవాలు చేయాలన్న లక్ష్యానికి కొన్ని పీహెచ్‌సీలు తూట్లు పొడుస్తున్నాయని గతేడాది గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పలు పీహెచ్‌సీల్లో ఏడాదిలో ఒక్క ప్రసవం కూడా జరగలేదు. మరికొన్ని చోట్ల ఒక అంకెను దాటనే



లేదు.

జిల్లాలో 2024 లెక్కలు పరిశీలిస్తే..

జీరో ప్రసవాల పీహెచ్‌సీలు- 2

పదిలోపు ప్రసవాలు- 34

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉన్నా..


ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకుంటే రూ.6వేల నగదును ప్రోత్సాహ బహుమతి కింద అందజేస్తున్నారు. దీంతోపాటు ఇంటి వరకు ఉచితంగా రవాణా సదుపాయం కల్పిస్తున్నారు. అయినప్పటికీ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ప్రజలు పీహెచ్‌సీల్లో ప్రసవాలకు ధైర్యం చేయడం లేదు. పేరుకు 24 గంటలు అయినప్పటికీ పలుచోట్ల ఆరు గంటలు కూడా పనిచేయడం లేదు.

**భరోసా కల్పించడం లేదు**

ప్రతి పీహెచ్‌సీ పరిధిలో నెలకు పది ప్రసవాలు జరగాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రసవాలు చేసుకోవచ్చన్న భరోసాను సిబ్బంది ప్రజలకు కల్పించడం లేదు. దీంతో పేదలు సైతం ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

## పశ్చిమ పొలాల్లో ఎర్ర తివాచీ

హోలహర్వి : జిల్లా పశ్చిమ ప్రాంత, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు మండలమైన హోలహర్వి ప్రాంతంలో ప్రస్తుతం ఎండు మిరప కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ప్రధానంగా గూళ్యం, సిద్దాపురం, చింతకుంట, కొక్కరచేడు, శిరగాపురం గ్రామాల్లో పంట సాగు చేశారు. ఎండు మిరప కోత పనులకు స్థానిక గ్రామాల



నుంచి కాకుండా ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి, మండలాల నుంచి కూలీలు వెళ్తున్నారు. ఎండు మిరపను గ్రేడింగ్ చేసేందుకు ఖాళీ పొలంలో రైతులు ఆరబెడుతున్నారు. దీంతో రహదారి పైనుంచి పొలాల్లో కనుచూపు మేర ఎండు మిరపతో ఎర్రటి తివాచీ పరిచినట్లు కనిపిస్తోంది. ఈ దృశ్యం రహదారిపై వెళ్లేవారి దృష్టిని ఆకర్షిస్తోంది.

## చీరకట్టులో అందాల బేబీ.. సో బ్యూటీఫుల్

సోషల్ మీడియాలో తరచుగా తన అందమైన లుక్స్‌తో ఆకట్టుకునే వైష్ణవి చైతన్య ఈసారి చీరకట్టులో కనిపించి అందర్నీ ఆశ్చర్యపరిచింది. మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌తో అదరగొట్టే వైష్ణవి, ఈసారి పింక్ అండ్ గోల్డెన్ కలర్ సిల్క్ చీరలో సంప్రదాయ అందాన్ని హైలెట్ చేసింది. తన గ్లామర్‌తో పాటు, స్టైలిష్ హావభావాలతో కుర్రకారును కనులవిందు చేసింది. ఆమె ఈ లుక్‌లో దిగిన ఫోటోలు వైరల్ అవుతుండటం విశేషం. చీరకట్టులో వైష్ణవి అందానికి అందమైన హెయిర్ స్టైల్, నాజూకైన చెవిపోగులు, సింపుల్ జ్యువెల్రీ మరింత హైలైట్ అయ్యాయి. మరీ ముఖ్యంగా ఆమె చూపు, హావభావాలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఫోటోషూట్‌లో ఆమె క్లాస్ అండ్ గ్రేస్‌ను మిక్స్ చేసి అదిరిపోయే పోజులతో ఫ్యాషన్



స్టేట్‌మెంట్‌కి మరో అర్థం చెప్పింది. ఫోటోలలో ఆమె కళ్లలో కనిపించే కాన్ఫిడెన్స్, లుక్‌లో ఉండే అందం ఆమెను ట్రెడిషనల్ గర్ల్‌గా నిలబెట్టాయి. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన ఈ ఫోటోలు క్షణాల్లోనే ట్రెండ్ అయ్యాయి. నెటిజన్లు 'ఈ లుక్‌లో మరింత అందంగా కనిపిస్తున్నావు' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఆమె ఈ చీరకట్టును ఎంతో సొగసుగా మెలిపెట్టుకున్న తీరు మరింత అందంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఇక వైష్ణవి కెరీర్ విషయానికి వస్తే, అల..వైకుంఠపురములో సినిమాతో మంచి గుర్తింపు అందుకున్న అమ్మడు ఆ తరువాత పలు వెబ్ సీరీస్ లతో కూడా క్రేజ్ అందుకుంది. ఇక 'బేబీ' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం జాక్ అనే సినిమాతో బిజీగా ఉన్న వైష్ణవి మరో న్యూ ప్రాజెక్టుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఆమెకు గతంలో కంటే చాలా ఆఫర్స్ వస్తున్నప్పటికీ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను మాత్రమే సెలెక్ట్ చేసుకుంటోంది. మరి రాబోయే సినిమాలు అమ్మడికి ఎలాంటి క్రేజ్ ను తీసుకు వస్తాయో చూడాలి.

## సమంత ఆరోగ్య ప్రయాణం.. ఫ్యాన్స్‌కు మరో బిగ్ అప్‌డేట్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంతా రూత్ ప్రభు గత కొంతకాలంగా సినిమాలకంటే కూడా తన పర్సనల్ లైఫ్ లో తీసుకుంటున్న నిర్ణయాలు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తన సినీ జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని ఒక సరైన ట్రాక్ లో ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. సినిమాల్లో గ్లామర్, యాక్షన్, ఎమోషన్‌తో అలరించడమే కాకుండా, తన ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ఫిట్‌నెస్, ఆరోగ్యంపై అభిమానులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ఆమె ప్రారంభించిన హెల్త్ యూట్యూబ్ కార్యక్రమం 'టేక్ 20'కి మంచి స్పందన లభిస్తోంది. తాజాగా, రెండో ఎపిసోడ్‌లో ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ థామస్ లేవీతో ఆమె చర్చించిన ఆరోగ్య రహస్యాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ ఎపిసోడ్‌లో సమంత ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే విషతత్వాల గురించి చర్చించారు. డాక్టర్



లేవీ తన 'Toxins, The Cause of All Diseases' అనే పుస్తకంలోని ముఖ్యమైన విషయాలను వివరిస్తూ, మన రోజువారీ జీవనశైలిలో ఉండే విషతత్వాలు ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వివరించారు. ఆయన చెప్పిన మేరకు, ఆక్సిడేటివ్ స్ట్రెస్ అనేది అనేక వ్యాధులకు మూల కారణం అవుతోంది. గుండె సంబంధిత వ్యాధుల నుంచి క్యాన్సర్ వరకు అనేక ఆరోగ్య సమస్యలకు ఈ విషతత్వాలు ప్రధాన కారణమని వెల్లడించారు. సమంత ఈ కార్యక్రమం ద్వారా తన అనుభవాలను పంచుకున్నారు. కొంత కాలంగా మయోసిటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో పోరాడుతున్న ఆమె, సహజ చికిత్సా విధానాలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. వైద్యుల సూచనల మేరకు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం, రోజువారీ విషతత్వాలను తొలగించుకునే పద్ధతులు పాటించడం వంటి విషయాల గురించి వివరించారు. ముఖ్యంగా, డాక్టర్ లేవీ చెప్పినట్టు విటమిన్ %జ% ఆరోగ్యాన్ని కాపాడటంలో అద్భుతంగా పనిచేస్తుందని, తన అనుభవంలో కూడా ఇది చాలా ఉపయోగపడిందని పేర్కొన్నారు. సమంతా సినిమాల్లో ఎంత జాగ్రత్తలు తీసుకుంటారో, ఆరోగ్య పరంగా కూడా అంతే శ్రద్ధ చూపిస్తున్నారు. ఆరోగ్యంపై ఆమె పెంచుకున్న అవగాహన ఇప్పుడు మరింత ప్రాముఖ్యత పొందుతోంది. ఇలాంటి ప్రముఖుల ఆరోగ్య కార్యక్రమాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిమానులు భావిస్తున్నారు.




## మీడియం రేంజ్ హీరోల విషయంలోనూ నిర్మాతలు తగ్గేదేలే!



ఒకప్పుడు స్టార్ హీరో కోసమే నిర్మాత రిస్క్ తీసుకుని 100 కోట్లు ఖర్చు చేసేవారు. పక్కాగా బిజినెస్ అవుతుం దనే నమ్మకంతోనే అంత భారీ మొత్తంలోపెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చేవారు. ఇక్కడ మరో సినారే కూడా ఉంది. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయి నష్టాలు వస్తే గనుక అదే హీరో తన పారితోషికంలో కొంత మిన హాయింపు ఇస్తాడనో..పూర్తిగా వదులుకుంటాడనే భరోసా కూడా నిర్మాతకు ఉండేది. దీంతో నిర్మాత మరో ఆలోచన లేకుండా ముందుకొచ్చే వాడు. అదే మీడియం రేంజ్ హీరోలపై అంత మొత్తం పెట్టాలంటే నిర్మాత చాలా విషయాలు ఆలోచించేవారు. 50 కోట్లు ఖర్చు చేయడమే ఎక్కువగా భావించేవారు. దీంతో దర్శకులు కూడా బడ్జెట్ ఓవర్ ది బోర్డ్ దాట కుండానే పూర్తి చేయాల్సి వచ్చేది. ఇలా కొంత రాజీతో కూడిన నిర్మాణం మీడియం రేంజ్ హీరోల విషయంలో జరిగేది. అయితే ఇప్పుడు మీడియం రేంజ్ హీరోలపై కూడా 100 కోట్లు పెట్టడానికి నిర్మాతలు వెనకడుగు వేయడం లేదు. వస్తే కొండ పోతే పైసా అన్న లెక్కలో ధైర్యంగా నిర్మాణంలోకి దిగిపోతున్నారు. నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల ది ప్యారడైజ్ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. దసరాతో నాని 100 కోట్ల క్లబ్ లో చేరాడు. దీంతో ప్యారడైజ్ బడ్జెట్ ఏకంగా 120 కోట్లుగా మారింది. అలాగే మెగా మేనల్లుడు సాయితేజ్ హీరోగా రోహిత్ కె. పి సంబరాల ఏటిగట్టు అనే సినిమా రూపొందిస్తున్నాడు. ఈ సినిమా బడ్జెట్ కూడా 125 కోట్లు అంటున్నారు. విరూపాక్షతో సాయితేజ్ కూడా సెంచరీ కొట్టేసిన సంగతి తెలిసిందే. ఇక అక్కినేని వారసుడు ఇటీవలే తండేల్ తో 100 కోట్ల క్లబ్ లో చేరిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్తిక్ దండు తో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా బడ్జెట్ కూడా సుమారు 100 కోట్లు అని సమాచారం. తండేల్ రిలీజ్ కు ముందే ఫిక్స్ అయిన బడ్జెట్ ఇది. అలాగే నిఖిల్ స్వయంభూ, యంగ్ హీరో తేజ సజ్జా మిరాయ్ చిత్రాల బడ్జెట్ కూడా సెంచరీకి సమీపంలోనే ఉందని అంటున్నారు.

## మెగాస్టార్ విశ్వంభర.. మళ్లీ సమస్యేంటి?



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమా మొదట్లో అభిమానుల్లో అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దర్శకుడు వశిష్ట బింబిసార సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్న తరువాత చేస్తున్న సినిమా కావడంతో ఎనౌన్స్ చేసినప్పుడే సినిమాపై హైప్ క్రియేట్ అయ్యింది. అయితే, ఈ సినిమా విడుదలపై అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో సినిమా అవుట్ పుట్ పై కూడా రకరకాల గాసిప్స్ పుట్టుకొస్తున్నాయి. అసలైతే ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ అప్పటికి గేమ్ ఛేంజర్ ఉండడం వల్ల వెనక్కి తగ్గారు. అంతే కాకుండా గ్రాఫిక్స్ విషయంలో అంతగా సంతృప్తి చెందకపోవడం కూడా మరొక రీజన్ అని టాక్ వచ్చింది. దీంతో మే నెలకి వాయిదా వేసారు. ఇప్పుడు మళ్ళీ కొత్త తేదీపై క్లారిటీ లేకపోవడంతో మెగా అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఆలస్యం వెనుక ఉన్న అసలు కారణం విశ్వంభర విజువల్ ఎఫెక్ట్స్ పనులు అన్నది ఇండస్ట్రీ వర్గాల సమాచారం. టాలీవుడ్ లో ఇప్పటివరకు అనుకున్నట్టు గ్రాఫిక్స్ పనులు ఫినిష్ కాలేదట, దీంతో మరింత సమయం పట్టేలా ఉన్నట్లు టాక్ వస్తోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్, అత్యుత్తమ క్వాలిటీకి ఏమాత్రం తగ్గకుండా ఉండాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. అందుకే, హాలీవుడ్ స్థాయిలో విజువల్ ఎఫెక్ట్స్ రూపొందించేందుకు ప్రముఖ స్టూడియోల సహాయాన్ని తీసుకుంటున్నారు. అవతార్ చిత్రానికి పని చేసిన టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు కూడా విశ్వంభర కోసం పని చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే నాగ్ అశ్విన్ కూడా ఇన్ పుట్స్ ఇచ్చినట్లు ఆమధ్య రకరకాల కథనాలు వచ్చాయి. దీంతో సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పని మరింత సమయం తీసుకుంటోంది. మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్ లో కనిపించనుండగా, చిత్రంలోని ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ మిక్స్ కావడం మరో ప్రధాన ఆకర్షణ. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్, టీజర్ లకు మంచి స్పందన వచ్చినా, ఫైనల్ అవుట్‌పుట్ ఎలా ఉండబోతుందనేదానిపై అందరికీ భారీ ఆసక్తి నెలకొంది. ఈ స్థాయిలో భారీ గ్రాఫిక్స్‌తో రూపొందిస్తున్న సినిమా కావడంతో, ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్లు క్వాలిటీని మిస్సవ్వకుండా తీసుకురావాలని టీం చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇకపోతే, సినిమా ఆలస్యమవుతున్నా, నటీనటులు మాత్రం ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నారు. సినిమాలో త్రిష, ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్ వంటి స్టార్స్ నటిస్తుండగా, వారికి సంబంధించిన కీలక సన్నివేశాల షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు, గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కోసం మాత్రమే ఆలస్యం జరుగుతోందని టీమ్ చెబుతోంది. అయితే, మే నెలలో కూడా సినిమా రావడం కష్టమేనన్న వార్తలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. ఇటీవల టాలీవుడ్‌లో భారీ బడ్జెట్ సినిమాల విడుదల వాయిదాలు సాధారణంగా మారిపోయాయి. ఆదిపురుష, సలార్, హనుమాన్ వంటి సినిమాలు క్వాలిటీ మెరుగుపరిచే క్రమంలో ఆలస్యమయ్యాయి. అలాగే విశ్వంభర కూడా అదే బాటలో వెళ్తోందా లేదా థియేట్రికల్ రిలీజ్ కోసం మరో షాకింగ్ అప్డేట్ వస్తుందా అనే ప్రశ్న మెగా అభిమానుల మదిలో ఉంది.

## సిల్క్ స్మిత ధైర్యాన్ని ప్రశంసించిన స్టార్ హీరోయిన్

లైంగిక వివక్ష, స్త్రీ పురుష విభేధం గురించి ప్రస్తావించారు స్టార్ హీరోయిర్ విద్యాబాలన్. తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన పోరాటాల గురించి బాలన్ ని మీడియా ప్రశ్నించగా, దానిని ఎప్పుడూ పోరాటంగా చూడలేదని, ప్రయాణంలో భాగంగా మాత్రమే చూశానని విద్యా చెప్పారు. దక్షిణ భారత కుటుంబం నుండి వచ్చిన బాలన్ సహనం ముఖ్యమని నమ్ముతుంది. తిరస్కరణలను ఎదుర్కొన్నప్పటికీ అవకాశాలను వదులుకోవాలని ఎప్పుడూ భావించలేదు. కఠినమైన సమయాల్లో తనను తాను బెస్ట్ గా ఉంచుకోవడానికి కుటుంబం మద్దతుగా నిలిచిందని తెలిపారు బాలన్. అలాగే బాలీవుడ్ సమాజంలో ద్వంద్వ ప్రమాణాల గురించి చర్చిస్తూ, తెరపై బలమైన వ్యక్తిత్వం ఉన్న స్త్రీ పాత్రల్లో నటించినా కానీ, నిజ జీవితంలో ఎల్లప్పుడూ స్త్రీలు గౌరవం అందుకోలేరని విద్యా ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సమస్యలు సామాజికమైనవి. నిజానికి మహిళలు పోటీ పడటం కంటే ఒకరినొకరు ఆదరించడంతోనే సరిపుచ్చుతారని బాలన్ వ్యాఖ్యానించారు.



పురుషాధిక్య ప్రపంచంలో నాయికా ప్రధాన చిత్రాలు తీయాల్సిన అవసరం గురించి బాలన్ మాట్లాడారు. మహిళలు కూడా పురుషులతో సమాన ప్రాతినిధ్యం సాధించిన తర్వాత అణిగిమణిగి ఉండాల్సిన పని లేదని బాలన్ అన్నారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతూ.. కేవలం నటిగా అడుగు పెట్టడం మాత్రమే కాదు,..తమదైన మార్గాన్ని నిర్ణయించుకునే శక్తిని కలిగి ఉండటం సాధికారత అని పేర్కొంది. %-%ది డర్టీ పిక్చర్%-%లో తన పాత్రను ప్రతిబింబిస్తూ, నిజమైన సాధికారత ప్రతికూల పరిస్థితుల్లో కూడా సొంత ఎంపికలతో ముందుకు సాగడమేనని అన్నారు. తన నిబంధనల ప్రకారం.. జీవితాన్ని గడపడంలో సిల్క్ స్మిత ధైర్యాన్ని బాలన్ మెచ్చుకుంది. బాడీ ఇమేజ్‌పై పరిశ్రమకు ఉన్న వ్యామోహాన్ని విద్యా బాలన్ పరిహాసంగా ప్రస్తావించింది. ప్రజలు నిరంతరం డైట్ ప్లాన్‌లను ఎలా సూచిస్తున్నారో కూడా తెలిపింది. ఇటీవలే బాలన్ ను ఫెడరల్ బ్యాంక్ తమ బ్రాండ్ ప్రమోటర్ గా ఎంపిక చేసుకుంది. ఈ సందర్భంగా విద్యా మాట్లాడుతూ-%--%ది డర్టీ పిక్చర్ విజయం తర్వాత ఆమెకు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ కోసం చాలా ఆఫర్లు వచ్చాయని వెల్లడించింది. కానీ దురదృష్టవశాత్తు కార్ బ్రాండ్‌లు, బ్యాంకులు ఎప్పుడూ తనను సంప్రదించలేదు. మహిళలు డ్రైవింగ్ చేయడానికి, ఆర్థిక నిర్వహణకు సరిపోరని పరిమితం చేయబడ్డారని బాలన్ గ్రహించినట్టు తెలిపారు. సమాజంలో అంతర్లీనంగా ఉన్న లైంగిక వివక్షను ఎత్తి చూపారు. భారతదేశంలో మహిళలు తమ ఆర్థిక వ్యవహారాలను తమ తండ్రి లేదా భర్త చేతిలో వదిలేయాలని భావిస్తున్నారని విద్యా అన్నారు. ఆర్థిక వ్యవహారాల్లో స్వతంత్రురాలైనప్పటి నుండి బాలన్ ఎక్కువ డబ్బు సంపాదించడం ప్రారంభించింది. మహిళలు తమకు అవసరమైన డబ్బును తామే ఆర్జించాలని బాలన్ ప్రేరణనిచ్చింది.

## బలగం బ్యూటీ వెయిటింగ్ ఫర్ ఏ ఛాన్స్..!

చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసి హీరోయిన్ గా మారిన భామల్లో తెలుగు అమ్మాయి కావ్య కళ్యాణ్ రామ్ ఒకరు. చైల్డ్ ఆర్టిస్ట్ గా నటిస్తూ ఆడియన్స్ కు దగ్గరైన ఈ అమ్మడు మసూద సినిమాతో హీరోయిన్ గా టర్న్ తీసుకుంది. ఆ తర్వాత బలగం సినిమాతో ఆకట్టుకుంది. ప్రియదర్శికి జతగా బలగం సినిమాలో కావ్య నటనకు ఆడియన్స్ ఇంప్రెస్ అయ్యారు. బలగం తో పాపులారిటీ బాగా వచ్చినా అవి ఛాన్స్ ల రూపంలో మాత్రం మారాలేదు. బలగం తర్వాత అమ్మడు శ్రీ సింహాతో ఉస్తాద్ అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా వర్క్ అవుట్ కాకపోయే సరికి కావ్యని ఎవరు పట్టించుకోవట్లేదు. ఐతే కావ్య మాత్రం సినిమా ఆఫర్లు లేకపోయినా ఆడియన్స్ ను తన ఫోటో షూట్స్ తో బుట్టలో వేసుకోవాలని చూస్తుంది. తనదైన శైలిలో రకరకాల ఫోటో షూట్స్ తో అలరిస్తుంది కావ్య కళ్యాణ్ రాం. కెరీర్ బిజీ చేసుకునే ప్లానింగ్ లో భాగంగానే అమ్మడు ఫోటో షూట్స్ తో ఎట్రాక్ట్ చేస్తుంది. ముఖ్యంగా తన క్యూట్ లుక్స్ తో కావ్య ఫాలోవర్స్ హృదయాలను మెలిపెట్టేలా చేస్తుంది. చైల్డ్ ఆర్టిస్ట్ గానే ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ



అమ్మడు ఇప్పుడు హీరోయిన్ గా కూడా అదే ఫాం కొనసాగించాలని చూస్తుంది. ఐతే బలగం హిట్ తో కచ్చితంగా కావ్య కెరీర్ ఊపందుకుంటుందని అనుకోగా ఎందుకో అలా జరగలేదు. ఐతే కావ్య కూడా హడావిడిగా సినిమాలు చేసే ఉద్దేశం లేనట్టు ఉంది. అందుకే కెరీర్ గురించి పెద్దగా దిగులు పడకుండా వచ్చిన ఛాన్స్ లనే చేస్తూ వస్తుంది. ఐతే కొందరు తెలుగు అమ్మాయి కాబట్టే కావ్యకి అవకాశాలు ఇవ్వట్లేదు అన్నట్టుగా మాట్లాడుతున్నా వాటిని అసలేమాత్రం లెక్క చేయకుండా తన కోసం రాసి పెట్టుకున్న పాత్రలు వస్తాయని ఎదురుచూస్తుంది అమ్మడు. ఈమధ్య సినిమాల్లో కాస్టింగ్ విషయంలో డైరెక్టర్స్ చాలా పర్ఫెక్ట్ గా ఉంటుంది. కావ్య లాంటి భామ కావాలి ఆమె మాత్రమే చేస్తుంది అని ఫిక్స్ అయితే వెంటనే పిక్ చేసుకుంటున్నారు. ఐతే కావ్య కూడా అలాంటి ఛాన్స్ ల కోసమే ఎదురుచూస్తున్నట్టుగా ఉందని తెలుస్తుంది. కావ్య సినిమాలు చేసినా చేయకపోయినా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తోనే ఆడియన్స్ లో మంచి క్రేజ్ సంపాదిస్తుంది. ఇక వాటికి తోడు మంచి సినిమాలు కూడా పడితే తిరుగు ఉండదని చెప్పొచ్చు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536